

'అన్నం పెట్టే రైతన్నను రుణ విముక్తుణ్ని చేయడమే నా ముందున్న లక్ష్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 11

సోమవారం 3-4-2023

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



సన్‌రైజర్స్ ఢమాల్..
రాజస్తాన్ రాయల్స్ చేతిలో 72 పరుగుల తేడాతో ఓడిన హైదరాబాద్ జట్టు - 12లో



పన్ను శూన్యం.. ఆదాయం అదనం
పన్ను ఆదా చేసే పెట్టుబడి సాధనాలపై ప్రత్యేక కథనం - 13లో



జైలు శిక్షపై నేడు రాహుల్ అప్పీల్
సూరత్ కోర్టు వేసిన జైలు శిక్షపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్థానిక సెషన్స్ కోర్టులో అప్పీల్ చేయనున్నారు.
వివరాలు 6లో ▶



అల్లర్లకు పాల్పడ్డవారికి ఉరే
బిహార్‌లో అల్లర్లకు పాల్పడిన వారిని తలకిందులుగా ఉరి తీస్తామని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు.
వివరాలు 6లో ▶



చాట్‌జీపీటీపై ఇటలీ నిషేధం
ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్‌బాట్ చాట్‌జీపీటీపై తాత్కాలిక నిషేధం విధిస్తూ ఇటలీ సంచలన నిర్ణయం తీసుకుంది.
వివరాలు 6లో ▶



ఆర్‌ఎల్‌వీ–ఎల్‌ఈఎక్స్ సక్సెస్
'గగన్‌యాన్' పరిశోధనా పరీక్షల్లో భాగంగా ఆర్‌ఎల్‌వీ–ఎల్‌ఈఎక్స్ రాకెట్ ప్రయోగాన్ని ఇస్రో విజయవంతంగా నిర్వహించింది.
వివరాలు 6లో ▶

ఏది నిజం?

ఇంకెన్నాళ్లీ 'కలం' కూట విషం?

- పోలవరంపై చంద్రబాబు తప్పులు ఎప్పుడూ చెప్పరేం?
- పదేపదే అదే రాస్తే నిజమైపోతుందా రామోజీ?
- మీరు, మీ వియ్యంకుడు, బాబుల డీపీటీ అబద్ధమా?
- అసలు కేంద్రమే చేపట్టి ఉంటే ఈ పాటికి పూర్తయ్యేది కదా?
- రాష్ట్రానికివ్వమని బాబు అడిగింది మీ వియ్యంకుడి కోసమేగా?
- అసలు వేల కోట్ల పనులు నామినేషన్‌పై ఇవ్వటం ఎక్కడైనా ఉందా? 4లో
- అంతటి దుర్మార్గాన్ని ఎన్నడూ ప్రశ్నించలేదేం?.. స్పిల్‌వే, స్పిల్ చానెల్, అప్రోచ్ చానెల్, పైలట్ చానెల్ ఎందుకు కట్టలేదు?
- అవన్నీ వదిలేసి కాఫర్‌డ్యామ్‌లు, డయాఫ్రమ్ వాల్ కట్టారెందుకు?
- వాటికన్నా ముందు ఇవి కడితే... ప్రవాహానికి కొట్టుకుపోతాయనే జ్ఞానం లేదా?

• టీడీపీలో నైరాశ్యం

బాబు మౌన రాగం

175 స్థానాల్లో పోటీపై నోరు మెదపని వైనం

- సీఎంను ఓడించడానికి అందరూ ఏకం కావాలంటూ గగ్గోలు
- 50 నియోజకవర్గాల్లో అభ్యర్థులే లేని దుస్థితి
- పలు స్థానాల్లో రెండో స్థానం కూడా సందేహమే
- చెప్పుకోవడానికి ఏమీ లేకే ఈ కొత్త రాగం
- ఈ మూడున్నరేళ్లలో జగన్ సర్కార్ డీబీటీ ద్వారా ప్రజల ఖాతాల్లోకి రూ.2 లక్షల కోట్లు
- సగటున 87 శాతం కుటుంబాలకు సంక్షేమ పథకాల ఫలాలు
- వీరంతా ఏకమైతే టీడీపీ స్థానం ఎక్కడ?



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 175 శాసనసభ స్థానాల్లో అభ్యర్థులనే ఎంపిక చేసుకోలేని దయనీయ స్థితిలో ఉన్న చంద్రబాబు.. 'అసలు సినిమా ముందుంది' అంటూ డాంబికాలు పలకడంపై రాజకీయ వర్గాల్లో విస్మయం వ్యక్తమవుతోంది. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపును చూసి.. ఇది ట్రైలర్ మాత్రమేనని చెబుతున్న చంద్రబాబు, సార్వత్రిక ఎన్నికల్లో 175 శాసనసభ స్థానాల్లో పోటీ చేసే సత్తా ఉందా.. అన్న వైఎస్సార్‌సీపీ సవాల్‌పై మాత్రం ఇప్పటిదాకా స్పందించనే లేదు. చెప్పుకోవడానికి ఏమీ లేక.. ఏం చేస్తారో కూడా చెప్పలేక సతమతమవుతున్న 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే వృద్ధ జంబూకం.. పార్టీ శ్రేణులు పూర్తిగా కకావికలం కాకూడదని సరికొత్త డ్రామాకు తెర తీసింది. అందరం కలిసి సీఎం జగన్‌ను ఓడిద్దాం.. రండంటూ పొత్తులపై ప్రాణాలు పెట్టుకుని రాజకీయం చేస్తున్నారు. నిజంగా అసలు సినిమా ముందున్నది చంద్రబాబుకే. ఎందుకంటే.. ఒక్కో పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం పరిధిలో 34 నుంచి 38 శాసనసభ

మిగతా 3వ పేజీలో ▶

అన్ని స్థానాల్లో సైకిల్ గుర్తు ఉంటుందా? 3లో

బాబుపై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి పేర్ని నాని

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

ఉదయం 8.45 నుంచి 9.30 వరకు లోపలకు అనుమతి

పకడ్బందీ ఏర్పాట్లు చేసిన పాఠశాల విద్యా శాఖ

- 3,349 కేంద్రాల్లో పరీక్షలు రాయనున్న 6.64 లక్షల మంది విద్యార్థులు
- పూర్తి స్థాయిలో ఫర్నీచర్, మంచి నీరు, ఇతర వసతుల కల్పన
- విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
- ఆరు పేపర్లలో పరీక్షలు
- సైన్స్‌కు ఒకే ప్రశ్నపత్రం, 2 ఆన్సర్ షీట్లు.. పేపర్ లీక్ అనేది లేకుండా పక్కా నిఘా
- 19 నుంచి 26వ తేదీ వరకు మూల్యాంకనం



సాక్షి, అమరావతి: రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. 3,349 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తున్నారు. 6,64,152 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. వీరిలో రెగ్యులర్ అభ్యర్థులు 6,09,070 మంది కాగా, మిగిలిన వారు ఓఎస్సెస్సీ రెగ్యులర్, సప్లిమెంటరీ అభ్యర్థులు. ఉదయం 8.45 నుంచి 9.30 గంటల వరకు మాత్రమే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఒక్కో గదిలో 24 మంది విద్యార్థులు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకున్నారు. అన్ని కేంద్రాల్లోనూ పూర్తి స్థాయిలో ఫర్నీచర్, మంచి నీరు వంటి సదుపాయాలు కల్పించామని ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి తెలిపారు. పరీక్ష సమయాలకు అనుగుణంగా విద్యార్థుల రాకపోకలకు సమస్య లేకుండా ఆర్టీసీ యాజమాన్యం తగినన్ని బస్సులు నడుపుతోందన్నారు. పరీక్షలు జరిగే రోజుల్లో టెన్త్ విద్యార్థులు హాల్ టికెట్ చూపించి, ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు.

ఏడు మాధ్యమాల్లో పరీక్షలు

తెలుగు, ఇంగ్లిష్, హిందీ, కన్నడ, తమిళం, ఒడియా, ఉర్దూ మాధ్యమాల్లో

మిగతా 14వ పేజీలో ▶

సమ్మేటివ్ 2 పరీక్షల సమయంలో మార్పు

- ఒంటిపూట బడుల కారణంగా మార్పులు చేసిన ఎస్సీఈఆర్టీ
- ఏప్రిల్ 20 నుంచి 29 వరకు నిర్వహణ 14లో
- 1–9 వరకు అన్ని తరగతులకు ఉదయమే పరీక్షలు
- 1 నుంచి 8 తరగతి వరకు ఉదయం 9 నుంచి 12 వరకు
- 9వ తరగతికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు

జేఈఈ మెయిన్ సిటీ ఇంటిమేషన్


లెటర్లు విడుదల

సెకండ్ సెషన్ లెటర్లు వెబ్‌సైట్‌లో పెట్టిన ఎన్‌టీఏ

- వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచన
- ఈనెల 6 నుంచి 12 వరకు ఆన్‌లైన్‌లో పరీక్షలు
- ఏపీలో 25 పట్టణాల్లో పరీక్షలు
- త్వరలో అడ్మిట్ కార్డుల విడుదల



సాక్షి, అమరావతి: ఐఐటీ, ఎన్‌ఐటీ, ఐఐఐటీ తదితర జాతీయ విద్యా సంస్థల్లో ప్రవేశానికి నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జేఈఈ) మెయిన్ -2023 సెకండ్ సెషన్ పరీక్షలకు సిటీ ఇంటిమేషన్ లెటర్లను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) విడుదల చేసింది. విద్యార్థులు ఎన్‌టీఏ వెబ్‌సైట్ 'https:// jee main. nta.nic.in/' నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. మెయిన్ సెకండ్ సెషన్ ఆన్‌లైన్ పరీక్షలు ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు జరుగుతాయి. దేశవ్యాప్తంగా 290 పట్టణాలతో పాటు విదేశాల్లోని 24 పట్టణాల్లో ఈ పరీక్షలు జరుగుతాయి. ఏపీలో 25 పట్టణాల్లో పరీక్ష కేంద్రాలను ఎన్‌టీఏ ఏర్పాటుచేసింది. విద్యార్థులు ఏ పట్టణంలో పరీక్ష రాయాలో తెలియజేసేలా ఎన్‌టీఏ ఈ సిటీ ఇంటిమేషన్ లెటర్లను ముందుగా విడుదల చేస్తుంది. విద్యార్థులు ముందుగా ఆయా కేంద్రాలను సందర్శించి, పరీక్షల రోజున ఎటువంటి ఇబ్బందులు లేకుండా సమయానికి చేరుకోవడానికి వీలుగా ఈ ఏర్పాట్లు చేసింది. విద్యార్థులు వారి దరఖాస్తు నంబరు, పుట్టిన తేదీని నమోదు చేయడం ద్వారా సిటీ ఇంటిమేషన్ లెటర్లను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ లెటర్లతో పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. పరీక్ష కేంద్రంలోకి ప్రవేశానికి అడ్మిట్ కార్డులు జారీ చేస్తారు. వీటిని కూడా త్వరలోనే ఎన్‌టీఏ విడుదల చేయనుంది. డౌన్‌లోడ్‌లో సమస్యలు ఏర్పడితే 011-40759000 ఫోన్ నెంబర్లో లేదా "jeemain@nta.ac.in.' ఈమెయిల్ ద్వారా సంప్రదించాలని ఎన్‌టీఏ సూచించింది. విద్యార్థులు ఎన్‌టీఏ అధికారక వెబ్‌సైట్లలో వచ్చే సూచనలను అనుసరించాలని సూచించింది.



దేశంలో కొత్తగా 3,824 కరోనా కేసులు

ఒక్కరోజులోనే భారీగా కోవిడ్ కేసులు నమోదు 6లో

మొత్తంగా 18,389కు చేరిన కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య

63,42,805 మందికి రూ. 1,747.88 కోట్లు

నేటి నుంచి పింఛన్ల పంపిణీ



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని అవ్వాతాతలు, వితంతు, దివ్యాంగ, వివిధ చేతివృత్తిదారులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు సోమవారం (3వ తేదీ) నుంచి పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఉప ముఖ్యమంత్రి (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి) బూడి ముత్యాల నాయుడు తెలిపారు. ఈ నెలకు రాష్ట్ర వ్యాప్తంగా 63,42,805 మంది లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీకి రూ. 1,747.88 కోట్లను ఖర్చు చేస్తున్నట్టు పేర్కొన్నారు. సీఎం జగన్ సంకల్పంలో భాగంగా వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వచ్చి పింఛన్లు పంపిణీ చేస్తారని తెలిపారు. ఐదు రోజుల్లో రాష్ట్రంలో 100% పింఛన్లు పంపిణీ పూర్తయ్యేలా వలంటీర్లకు సూచనలు చేసినట్టు వివరించారు. పింఛన్ల పంపిణీ పర్యవేక్షణకు జిల్లాల డీఆర్‌డీఏ కేంద్రాల్లో కాల్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

టీడీపీ సర్పంచ్ చేతిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సజీవ దహనం

- టీడీపీ అధినేత చంద్రబాబు అనుచరుడు, బ్రాహ్మణపల్లి సర్పంచ్ చాణక్య ప్రతాప్ ఘాతుకం


టీడీపీ నేత సోమిరెడ్డితో చాణక్య ప్రతాప్ సోదరుడు రుపంజయ

- రాజీ పేరుతో పిలిపించి కిరాతకంగా హత్య
- చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలంలో బరి తెగించిన టీడీపీ నేతలు
- నిందితులు టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అల్లుడు సంజీవ్ సోదరులే 14లో
- టీడీపీ సీనియర్ నేతలు సోమిరెడ్డి, పరిటాల శ్రీరామ్‌లతోనూ సన్నిహిత సంబంధాలు



'చల్లని' కబురు!

- ఈ ఏడాది వేసవి సాధారణమే
- 'సీమ' కంటే ఉత్తరాంధ్రలో ఉష్ణతాపం.. 4–6 రోజులే వడగాడ్పుల ప్రభావం
- ఏప్రిల్‌లో సాధారణానికి మించి వర్షపాతం 14లో
- వాతావరణ శాఖ అంచనా



మొక్కలు ఏడుస్తాయట!

బాధ కలిగితే మాట్లాడతాయి

శబ్దాలను రికార్డు చేసిన ఇజ్రాయెల్ శాస్త్రవేత్తలు 6లో

ఇదండీ సంగతి



.. ఓడిపోవడానికి కాదెహె!

పులులు గర్జిస్తున్నాయ్

టైగర్ ప్రాజెక్టుకు 50 ఏళ్లు.. 1973 నాటికి దేశంలో పులుల సంఖ్య 1,827

- 2006 నాటికి 1,411కు పడిపోయిన పులులు
- 2018 నాటికి పులుల సంఖ్య 2,967కు పెరుగుదల
- ప్రపంచం మొత్తం పులుల్లో 70 శాతం మన దేశంలోనే
- ఈ నెల 9న తాజా పులుల గణన వివరాలను విడుదల చేయనున్న ప్రధాని

సాక్షి, అమరావతి: మన జాతీయ జంతువు పులిని సంరక్షించేందుకు 'ప్రాజెక్టు టైగర్' ఏర్పాటై 50 ఏళ్లు పూర్తయింది. అంతరించిపోతున్న పులులను సంరక్షించేందుకు 1973 ఏప్రిల్ 1న అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ జిమ్ కార్బెట్ జాతీయ పార్కులో ప్రాజెక్ట్ టైగర్‌ను ప్రారంభించారు. 9 వేల చదరపు కిలోమీటర్లలో ఉన్న 9 టైగర్ రిజర్వు ఫారెస్టులతో ఈ ప్రాజెక్టు మొదలైంది. ఇప్పుడు 18 రాష్ట్రాల పరిధిలోని 75 వేల చదరపు కిలోమీటర్లలో 53 టైగర్ రిజర్వు ఫారెస్టులకు విస్తరించింది. 1973లో జరిగిన మొదటి పులుల గణనలో 1,827 పులులు ఉండగా.. 2018 గణన ప్రకారం ఆ సంఖ్య 2,967కి పెరిగింది. ప్రపంచంలోని ఉన్న మొత్తం పులుల సంఖ్యలో ఇప్పుడు 70 శాతం మన దేశంలోనే ఉన్నాయి. టైగర్ ప్రాజెక్టు విజయవంతమైందని చెప్పడానికి ఇవే నిదర్శనాలు.



పూర్వం 2 లక్షల పైనే ఉండేవి

జీవ వైవిధ్యంలో ఎంతో కీలకమైన పులుల జీవనానికి మన దేశం అత్యంత అనుకూలంగా ఉండేది. చాలా ఏళ్ల క్రితం దేశంలో 2 లక్షలకు పైగా పులులు ఉండేవి. కానీ.. చక్రవర్తులు, రాజులు పులుల్ని వేటాడటాన్ని ప్రవృత్తిగా ఎంచుకోవడంతో వాటిసంఖ్య

మిగతా 3వ పేజీలో ▶



ఏపీలో పులుల సంఖ్య ఇలా

ఏడాది	సంఖ్య
2016-17	46
2017-18	46
2018-19	48
2019-20	63
2020-22	75

సముద్ర జీవజాలానికి భూతాపం ముప్పు

- అంటార్కిటికాలో కరుగుతున్న మంచు
- సముద్రాల్లో అంతర్భాగాల్లో జల ప్రవాహాలకు ఆటంకం
- ఆక్సిజన్, పోషకాలు అంతరించిపోయే అవకాశం 6లో

కొత్త కెరటం వచ్చింది, నీట్ కోచింగులో సంచలనం సృష్టించింది

నీట్ 2022లో ఒక్క విజయవాడ నుండే అత్యధికంగా
1013 మెడికల్ సీట్లు సాధించిన ఏకైక విద్యాసంస్థ

శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ

నీట్ 2023లో కూడా ఒక్క విజయవాడ నుండే అత్యధికంగా 1500+
మెడికల్ సీట్లు సాధించే దిశగా అడుగులు వేస్తూ... తగ్గేదేలే

ఈ విద్యా సంవత్సరం నుండి భారతదేశంలోనే ప్రతిష్ఠాత్మకమైన
AIIMS, JIPMER లాంటి మెడికల్ కాలేజీలలో ప్రవేశానికి
శ్రీ గోసలైట్స్ ప్రవేశ పెడుతున్న ఛాలెంజింగ్ ప్రోగ్రాం **GOAL-100**



10వ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు ఆల్ ది బెస్ట్

Sri Gosalites GOAL-100
Gosalites Alpha Batch

AIIMS, JIPMER లాంటి ప్రతిష్ఠాత్మక మెడికల్ కాలేజీల్లో సీటు సాధించాలంటే NEETలో ఆల్ ఇండియా 100 లోపు ర్యాంకు రావాలి. టాప్ 100 లోపు ర్యాంకులు సాధించడానికై శ్రీ గోసలైట్స్ ప్రారంభిస్తున్న ప్రోగ్రాం GOAL-100.

ఎంపిక విధానం

- ఈ ఏడాది 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు మాత్రమే
- ఈ టెస్ట్ ద్వారా కేవలం 100 మంది విద్యార్థులను మాత్రమే ఎంపిక చేస్తారు.
- **Level-1** 10 వ తరగతి CBSE/ICSE విద్యార్థులు 10-04-02023 నుంచి 17-04-2023 తేదీల మధ్య, 10 వ తరగతి స్టేట్ బోర్డు విద్యార్థులు 20-04-2023 నుండి 25-04-2023 తేదీల మధ్య శ్రీ గోసలైట్స్ గంగూరు గర్ల్స్ క్యాంపస్, విజయవాడ నందు పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- **Level-2** Level-1 క్వాలిఫై అయిన విద్యార్థులు Level-2 పరీక్ష రాయవలసి ఉంటుంది ఈ పరీక్షలో మొదటి 100 మందిని ఈ బ్యాచ్‌కి ఎంపిక చేయడం జరుగుతుంది
- EXAM SYLLABUS మరియు EXAM PATTERN కొరకు మా వెబ్‌సైట్ చూడగలరు.

ఫీజు రాయితీ వివరాలు

Level-2 Rank	1-10	11-20	21-30	31-40	41-50	51-75	76-100
Concession	100%	80%	70%	60%	50%	40%	30%

Scan to Register OR Message 'Hi' on Whatsapp 81878 71115

Sri Gosalites GIFT
(Gosalites Intermediate Foundation Tuning Programme)

10వ తరగతి పూర్తి అయిన తరువాత డాక్టర్ అవ్వాలనే విద్యార్థుల కోసం Sri Gosalites 3 వారాల ఉచిత ఆన్‌లైన్ GIFT Programme (Gosalites Intermediate Foundation Tuning Programme) సిద్ధం చేసింది. డాక్టర్ అవ్వాలనే మీ లక్ష్యానికి ఇక్కడ తొలి అడుగు వేస్తే, మీ విజయం ఖాయం.

GIFT Programme ఎందుకు?

- 10 వ తరగతి వరకు సబ్జెక్టివ్ ఎగ్జామ్స్ మాత్రమే జరుగుతాయి, అందువలన విద్యార్థులు బట్టీకి అలవాటు పడి ఉంటారు.
- కానీ, నీట్ పరీక్షకు ఆబ్జెక్టివ్ విధానం ఉంటుంది. బేసిక్స్ మీద గ్రిప్, కాన్సెప్ట్స్‌పై అవగాహన, అప్లికేషన్ ఓరియెంటేషన్ కావాలి, దీనికి ప్రత్యేక శిక్షణ అవసరం.
- ఎన్నో సంవత్సరాల అనుభవం నుండి శ్రీ గోసలైట్స్ టీమ్, టెస్ట్ విధానానికి మరియు నీట్ ఎగ్జామ్‌కు అనుసంధానం చేయుస్తూ బేసిక్స్ మీద పూర్తిగా గ్రిప్ సాధించడానికి విద్యార్థులందరికీ GIFT Programme అందిస్తుంది.
- మీరు ఎక్కడ చదువుదామనుకున్నా, డాక్టర్ అవ్వాలనే మీ ఉన్నత ఆశయానికి మద్దతుగా మావంతు కృషిగా నీట్ పరీక్షకు మీరు ఈజీగా సన్నద్ధం కావడానికి GIFT Programme అందిస్తున్నాము.

ప్రోగ్రామ్ ప్రారంభించు తేదీలు
- CBSE/ICSE విద్యార్థులకు 10-04-2023 నుండి
- స్టేట్ బోర్డు విద్యార్థులకు 25-04-2023 నుండి

Scan to Register OR Message 'Hi' on Whatsapp 81878 71116

స్థాపించిన తొలి ఏడాదిలో 724, రెండో ఏడాదిలో 1,013 మెడికల్ సీట్లు సాధించేలా విద్యార్థులను తీర్చిదిద్దిన నార్త్ ఇండియన్ జీనియస్ టీచింగ్ టీమ్.

అమ్మలాంటి ప్రేమ.. నాన్నలాంటి బాధ్యత...

మారిన తరానికి అనుగుణంగా మార్పులు చేసి శ్రీ గోసలైట్స్ మెడికల్ అకాడమీ స్థాపించాము. ప్రారంభించిన మొదటిరోజు నుండి ఖర్చుకు వెనుకాడకుండా, ప్రతి క్లాస్ రూమును డిజిటలైజ్ చేసి, స్మార్ట్ బోర్డు ద్వారా బోధన కొనసాగిస్తూ, ఇరు తెలుగు రాష్ట్రాల్లో నూరు శాతం డిజిటలైజ్ చెయ్యబడిన ఏకైక విద్యాసంస్థ శ్రీ గోసలైట్స్ అని సగర్వంగా చెప్పగలము. స్థాపించిన తొలి ఏడాదిలోనే (నీట్-2021) 724 సీట్లు, రెండవ ఏడాదిలో (నీట్-2022) 1013 సీట్లు సాధించిన మా మెడికోలు అందరికీ అభినందనలు.

మా వెన్నుతట్టి, అడుగడుగునా మమ్మల్ని ప్రోత్సహించి, మా విజయాలకు మూలస్తంభాల్లా నిలబడిన మా శ్రేయోభిలాషులకు, విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు కృతజ్ఞతాభివందనాలు.

మీరే మా నమ్మకం,
మీరే మా బలం,
ముమ్మాటికీ ఇది మీ సంస్థ.

10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ తెలియజేస్తూ...
మీ నరేంద్ర బాబు, ఛైర్మన్



V NARENDRA BABU
Chairman
Smt. V USHA
Director



07-05-2023 NEET ఎగ్జామ్ అయిన తర్వాత మరి కొంతమంది నిష్ణాతులైన సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ మా గోసలైట్స్ టీచింగ్ టీంతో చేరబోతున్నారని తెలియజేయుటకు సంతోషిస్తున్నాము

నీట్-2022 ర్యాంకుల ఆధారంగా దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లోని ప్రముఖ వైద్య కళాశాలల్లో సీట్లు సాధించిన శ్రీగోసలైట్స్ విద్యార్థుల వివరాలు.

నీట్-2022 దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన AIIMS, JIPMER వంటి మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించిన శ్రీ గోసలైట్స్ టాప్ ర్యాంకర్లు



ANDHRA PRADESH MEDICAL COLLEGES

Sl. No.	NAME OF THE MEDICAL COLLEGE	Medico's
1	KMCK -Kurnool Medical College, Kurnool	64
2	NARN -Narayana Medical College, Nellore	57
3	SVMC -Sri Venkateswara Medical College, Tirupati	44
4	GMCG-Guntur Medical College, Guntur	42
5	AMCV-Andhra Medical College, Visakhapatnam	41
6	ASRA-Alluri Sitarama Raju Academy of Medical Sciences, Eluru	40
7	GSLR -GSL Medical College & General Hospital, Rajahmundry	32
8	NRIM -Nrim Medical College, Guntur	31
9	VMCK -Viswabharathi Medical College & General Hospital, Kurnool	30
10	GMCK-RIIMS, KADAPA	29
11	APLC-Apollo Institute of Medical Sciences & Research, Chittoor	29
12	MAHA -Maharajah's Institute Of Medical Sciences, Vizianagaram	27
13	GMCA-Government Medical College, Anantapur	26
14	PSIM -Dr.Pinnamaneni Siddhartha Institute of Medical Sciences & Research Foundation, Gannavaram	24
15	ACSR-ACSR Government Medical College, Nellore	23
16	KONA -Konaseema Institute of Medical Sciences, Amalapuram	23
17	NRVP -NRI Medical College, Vizag	23
18	PESK -PES. Institute of Medical Sciences and Research, Kuppam	22
19	PADT -Sri Padmavathi Medical College for Women (SVIMS), Tirupati	21
20	Sri Balaji Medical College & Hospital, Tirupati	21
21	RMCK -Rangaraya Medical College, Kakinada	20
22	SRMC -Santhiram Medical College, Nandyal	19
23	GEMS-Great Eastern Medical School & Hospital, Srikakulam	19
24	FIMS-Fathima Institute of Medical Sciences, Kadapa	17
25	SMCV -Siddhartha Medical College, Vijayawada	15
26	GVPT -Gayatri Vidya Parishad Medical College, Vizag	14
27	GMCS -RIIMS, SRIKAKULAM	12
28	KATR -Katuri Medical College & Hospital, Guntur	12
29	NIMR -Nimra Institute of Medical Sciences, Ibrahimpatnam	11
30	GMCO -RIIMS, Ongole	9
	TOTAL	797

TELANGANA MEDICAL COLLEGES

Sl. No.	NAME OF THE MEDICAL COLLEGE	Medico's
1	OMCH-Osmania Medical College, Hyderabad	18
2	GOVT MEDICAL COLLEGE, MAHABUBABAD	10
3	GOVT MEDICAL COLLEGE, BHADRADRI KOTHAGUDEM	9
4	PRTM-Prathima Institute of Medical Sciences, Karimnagar	8
5	GAND-Gandhi Medical College and Hospital, Secunderabad	6
6	TRRM-TRR Institute of Medical Sciences, Patancheru	6
7	MAHE-Maheshwara Medical College, Patancheruvu	7
8	GMSR-Government Medical college, Suryapet	5
9	GOVT MEDICAL COLLEGE, JAGITYAL	5
10	GOVT MEDICAL COLLEGE, RAMAGUNDAM	5
11	SVSM-SVS Medical College, Mahabubnagar	5
12	MHVR-Mahaveer Institute of Science & Technology, Vikarabad	6
13	SGMC-Government Medical College, Siddipet	4
14	KKTI-KMC Warangal - Kakatiya Medical College	4
15	RADL-RIIMS, Adilabad	4
16	GMNL-Government Medical College, Nalgonda	4
17	AYAN-Ayaan Institute of Medical Sciences, Moinabad	4
18	GVNZ-Government Medical college, Nizambad	3
19	GOVT MEDICAL COLLEGE, NAGARKURNOOL	3
20	GOVT MEDICAL COLLEGE, SANGAREDDY	3
21	GOVT MEDICAL COLLEGE, WANAPARTHY	3
22	MMTA-Mamata Medical College, Khammam	3
23	KMHD-Kamineni Academy of Medical Sciences and Research Centre, Hyderabad	4
24	CARK-C Anand Rao Institute of Medical Sciences, Karimnagar	3
25	APOLLO INSTITUTE OF MEDICAL SCIENCES, HYDERABAD	3
26	MAMATA ACADEMY OF MED SCI, BACHUPALLY	3
27	SURB-Surabhi Institute of Medical Sciences, Siddipet	2
28	MLRD-Malla Reddy Institute of Medical Sciences, Suraram	2
29	RVMC-RVM Institute of Medical Sciences and Research Center, Mulugu	2
30	GMCM-Government Medical College, Mahabubnagar	2
31	MRWN-Mallareddy Medical College For Women, Suraram	2
32	MNRS-MNR Medical College & Hospital, Sangareddy	2
32	MEDI-MediCiti Institute of Medical Sciences, Medchal	3
33	VRKW-Dr. VRK Women's Medical College, Aziznagar	2
34	DECCAN COLLEGE OF MEDICAL SCIENCES	2
35	BASK-Bhaskar Medical College, Moinabad	1
36	ESIM-ESIC Medical College, Hyderabad	1
37	SHDN-Shadan Institute of Medical Sciences, Chevella	1
38	DR PATNAM MAHENDER REDDY INST OF MED SCI, CHEVELLA	1
39	KMNI-KAMINENI INSTITUTE OF MED. SCI, NARKETPALLY	1
	TOTAL	162

NATIONAL MEDICAL COLLEGES

Sl. No.	NAME OF THE MEDICAL COLLEGE	Medico's
1	AIIMS Mangalagiri	6
2	AIIMS, Kalyani	2
3	AIIMS, Bhubaneswar	2
4	AIIMS, Bhopal	1
5	AIIMS, Nagpur	1
6	AIIMS, Bibi Nagar, Hyderabad	1
7	AIIMS, Raipur	1
8	JIPMER, PUDUCHERRY	1
9	JIPMER, KARAIKAL	1
10	Madras Medical College (MMC), Chennai	4
11	Stanely Medical College, Chennai	2
	TOTAL	22

OTHER STATE MEDICAL COLLEGES

Sl. No.	NAME OF THE MEDICAL COLLEGE	Medico's
1	TAMILNADU COLLEGES	9
2	KARNATAKA COLLEGES	9
3	ODISSA COLLEGES	6
4	HIMCHAL PRADESH COLLEGES	2
5	PUDUCHERRY COLLEGES	2
6	KERALA COLLEGES	2
7	MAHARASHTRA COLLEGES	1
8	GUJARAT COLLEGES	1
	TOTAL	32



Boys Campus (NEET Long Term & Inter)



Girls Campus (Inter)



Girls Campus (NEET Long Term)

Garuda Castle, Salipeta Road, Poranki (V), Penamaluru (M), VIJAYAWADA - 521 137
M: 98 582 18888, 98 583 18888, 98 584 18888
Suggestions welcome: official@gosalites.com E: gosalitesvja@gmail.com
www.gosalites.com /gosalites

Scan & Visit our Website

Sri Gosalites Medical Academy
...brand of future medicos

క్లుప్తంగా...

పారదర్శకంగా సీఏఎస్ పోస్టుల భర్తీ

ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ రామిరెడ్డి

సాక్షి, అమరావతి: వైద్య, ఆరోగ్య శాఖలో సివిల్ అసిస్టెంట్ సర్జన్(సీఏఎస్) పోస్టులను పారదర్శకంగా భర్తీ చేశామని ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ డాక్టర్ రామిరెడ్డి తెలిపారు. ఈ నియామకాల్లో భారీ స్కామ్ అంటూ పచ్చ పత్రికలో ప్రచురించిన కథనాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు డాక్టర్ రామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పోస్టుల భర్తీకి గత ఏడాది జూలైలో నోటిఫికేషన్ జారీ చేయగా, 4,083 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వివిధ కమిటీలను ఏర్పాటుచేసి దరఖాస్తులు పరిశీలించామని పేర్కొన్నారు. ఇప్పటి వరకూ 17 విడతలు అభ్యర్థుల ఎంపిక చేపట్టామన్నారు. 16వ విడత ఎంపిక జాబితాలో చిన్న పొరపాటు జరిగిందని, దాన్ని వెంటనే గుర్తించామన్నారు. ఇద్దరు అభ్యర్థులను ఈడబ్ల్యూఎస్ కోటాలో, ఒకరిని వేరే జోన్‌లో ఎంపిక చేయడం జరిగిందని, ఆ విషయాన్ని వెంటనే గుర్తించి చర్యలు తీసుకున్నామని వివరించారు. ఈ ముగ్గురు అభ్యర్థుల ఎంపికను రద్దు చేశామని స్పష్టంచేశారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టామన్నారు. ఎక్కడా నగదు లావాదేవీలు బయటపడలేదన్నారు. బాధ్యుడైన డీఈవోను ఉద్యోగం నుంచి తొలగించామని తెలిపారు.

చుక్కల భూముల సమస్యకు పరిష్కారం చూపిన సీఎం

మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు. చిత్రంలో మంత్రి కాకాణి

నెల్లూరు(సెంట్రల్): జిల్లాలో సుమారు వందేళ్ల నుంచి ఉన్న చుక్కల భూముల సమస్యలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శాశ్వత పరిష్కారం చూపుతూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. నెల్లూరులోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేల ఎకరాల్లో చుక్కల భూములు (డాటెడ్ ల్యాండ్స్) కింద అప్పట్లో బ్రిటిష్ అధికారులు నమోదు చేశారని, దీంతో రైతులకు భూమిపై పూర్తి హక్కు ఉన్నా అత్యవసర సమయంలో క్రయవిక్రయాలు చేసుకోలేని పరిస్థితి నెలకొందన్నారు. మరోవైపు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక నెలలోనే రెండు జీఓలను జారీ చేసి వేల మంది రైతులకు సంబంధించి భూములు ఎక్కడా క్రయవిక్రయాలు జరగకుండా నిషేధిత జాబితాలో చేర్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లాలోని రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా, పరిశీలించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు పూర్తిగా హక్కులు ఉన్న భూమిని నిషేధిత జాబితాలో చేర్చడం సరికాదని, తక్షణమే వాటిని తొలగించే ప్రక్రియ ప్రారంభించాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా గత నెల 31న 163 జీఓను విడుదల చేశారన్నారు. దీనివల్ల జిల్లాలో 23,023 మంది రైతులకు సంబంధించి 43,270 ఎకరాలకు శాశ్వత పరిష్కారం లభించిందని వివరించారు. సంబంధిత రైతులకు ఈ నెలలోనే సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని వివరించారు. చుక్కల భూముల విషయంలో తమ ఇబ్బందులను తొలగించిన సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి మంత్రి కాకాణి సమక్షంలో రైతులు క్షీరాభిషేకం నిర్వహించారు.

ఊరూరా ఆసరా



అనంతపురంలో మహిళలతో కలసి సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి



ఒంగోలులో డ్వాక్రా మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మేయర్ గంగాడ సుజాత తదితరులు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా గొల్లపాలెంలో డ్వాక్రా మహిళలకు చెక్కు అందిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణు



ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటలో మహిళలకు చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను



విజయనగరం జిల్లా వేపాడలో మహిళలకు చెక్కు అందిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు, ఎమ్మెల్యే కడుబండి, ఎమ్మెల్సీ రఘురాజు




పశ్చిమగోదావరి జిల్లా తణుకులో మహిళలకు చెక్కు అందిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకా రవీంద్రనాథ్

పులులు గర్జిస్తున్నాయ్

▶ మొదటి పేజీ తరువాయి

గణనీయంగా తగ్గిపోయింది. మొఘల్ చక్రవర్తుల కాలంలో పులుల వేట అత్యంత క్రూరంగా సాగింది. ఒక్కో రాజు పదులు, వందల సంఖ్యలో పులుల్ని చంపి.. తాము గొప్ప వీరులమని ప్రచారం చేసుకునేవారు. బ్రిటిష్ హయాంలోనూ వాటి వేట ఇష్టారాజ్యంగా కొనసాగింది. బ్రిటీషర్ల కాలంలోనే సాగు భూమి కోసం అడవుల్ని ఆక్రమించడంతో పులుల సంఖ్య తగ్గిపోయింది. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చే నాటికి 40 వేల పులులు మాత్రమే మిగిలినట్టు అంచనా. పులి అవయవాలన్నింటికీ డిమాండ్ ఉండటంతో ఆ తర్వాత కూడా వేట కొనసాగింది. ఫలితంగా క్రమేపీ అవి అంతరించే దశకు చేరుకున్నాయి.



వన్యప్రాణుల చట్టం రక్షించింది

1972లో వన్యప్రాణుల పరిరక్షణ చట్టం రావడం.. పర్యావరణంలో పులుల పాత్ర చాలా ముఖ్యమని భావించడంతో వాటి సంరక్షణకు బీజం పడింది. ఆ నేపథ్యంలోనే 1973లో ప్రాజెక్టు టైగర్ ఏర్పాటైంది. 1990వ దశకంలో పులుల ఆవాసాల సంరక్షణ ఇబ్బందిగా మారింది. 1993 నుంచి ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అంతచేసినా పులుల సంఖ్య పెరగలేదు. 2006 నాటికి దేశంలో పులులు సంఖ్య 1411కి పడిపోయింది. ఇలాగే వదిలేస్తే పులులు అంతరించే ప్రమాదం ఉందని గ్రహించిన కేంద్రం పులుల సంరక్షణకు ఎన్నో చర్యలు చేపట్టడంతోపాటు సంరక్షణ విధానాన్ని కూడా మార్చింది. వాటి ఆవాసాలను సంరక్షించడంతోపాటు వేటను చాలావరకు నియంత్రించింది. ఫలితంగా అంతరిస్తున్న పులుల సంఖ్య నెమ్మదిగా పెరిగి కొన్నేళ్లుగా స్థిరంగా ఉంటోంది. 1973లో టైగర్ ప్రాజెక్టు బడ్జెట్ రూ.4 కోట్లు కాగా.. ఇప్పుడు రూ.500 కోట్లు. ఇంతచేసినా రాజస్థాన్‌లోని సరిస్కా టైగర్ రిజర్వులో పులులు పూర్తిగా అంతరించిపోయాయి. కానీ.. మిగిలిన రిజర్వు ఫారెస్టులలో పులుల సంఖ్య గణనీయంగా పెరిగి 2,967కి చేరింది. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి జాతీయ స్థాయిలో పులుల సంఖ్యను లెక్కిస్తున్నారు. ఈ నెల 9న ప్రధాని మోదీ మైసూరులో 2022 పులుల గణన వివరాలను విడుదల చేయనున్నారు. ఈ గణనలో పులుల సంఖ్య పెరిగిందనే అంచనాలు వెలువడుతున్నాయి.

2018 గణాంకాల ప్రకారం వివిధ దేశాల్లో పులుల సంఖ్య ఇలా

భారతదేశం	రష్యా	నేపాల్
2,967	433	355
థాయ్‌లాండ్	ఇండోనేషియా	మలేషియా
149	371	120
	బంగ్లాదేశ్	భూటాన్
	106	103
	చైనా	మయన్మార్
	55	22



అద్భుత ప్రయాణం



ప్రాజెక్ట్ టైగర్ 50 ఏళ్లలో జరిగిన అద్భుతమైన ప్రయాణం. ప్రపంచంలోని అటవీ ప్రాంతాల్లో అమలు చేసిన ఉత్తమ పరిరక్షణ కార్యక్రమాల్లో ఇది ఒకటి. దేశంలోనే అతిపెద్ద టైగర్ రిజర్వ్ నాగార్జునసాగర్–శ్రీశైలం మన రాష్ట్రంలో ఉండటం గర్వకారణం. ఈ ప్రాంతం జీవవైవిధ్యంలో చాలా గొప్పది. అటవీ శాఖ, స్థానికుల గిరిజనుల వల్ల ఈ ప్రాంతంలో పులుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

– శాంతిప్రియ పాండే, ఏపీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్), ఏపీ అటవీ శాఖ

అమరావతిలో నిరుపేదలకు చోటు

- ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో 1,134.58 ఎకరాలు కేటాయింపు
- భూమిని రెవెన్యూ శాఖకు బదిలీ చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు
- ధరపై సీఆర్డీఏ అథారిటీ సూచనల మేరకు నిర్ణయం

సాక్షి, అమరావతి: సీఆర్డీఏ పరిధిలో నిరుపేదలకు ఇళ్ల స్థలాల కేటాయించేందుకు మార్గం సుగమమైంది. ఈమేరకు ఇళ్ల స్థలాల కోసం 1,134.58 ఎకరాలను రెవెన్యూ శాఖకు బదిలీ చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మి ఉత్తర్వులు (జీవో నం.45) జారీ చేశారు. దీనికి సంబంధించి 550.65 ఎకరాలను గుంటూరు కలెక్టర్‌కు, మరో 583.93 ఎకరాలను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌కు బదిలీ చేయాలని పేర్కొన్నారు. మొత్తం భూమికి రూ.1,162.95 కోట్లు ధరగా నిర్ణయించారు. సీఆర్డీఏ చట్టం నిబంధనల మేరకు 'ఆర్–5' జోన్‌ను ఏర్పాటు చేస్తూ ఇటీవల ఉత్తర్వులు వెలువడ్డ విషయం తెలిసిందే. తాజాగా భూమి బదలాయించేందుకు అనువుగా ఆదేశాలు జారీ చేశారు.

నేడు సీఆర్డీఏ అథారిటీ సమావేశం

ప్రజల సంక్షేమానికి కట్టుబడిన రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇళ్లు లేని అర్హులైన నిరుపేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వాలని నిర్ణయించింది. అందులో భాగంగా 'నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు' కార్యక్రమాన్ని పథకాన్ని అమలు చేస్తోంది. ఈమేరకు సీఆర్డీఏ పరిధిలోనూ నిరుపేదలకు చోటు కల్పించాలని గతంలోనే నిర్ణయించింది. అమరావతి ప్రాంతంలో సేకరించిన భూమిలో 5 శాతం పేదలకు కేటాయించాలని చట్టంలో కూడా ఉంది. ఈ నేపథ్యంలో నిబంధనలకు అనుగుణంగా ఆర్ 5 జోన్ ఏర్పాటైంది. పేదల కోసం ఉద్దేశించిన 1,134.58 ఎకరాలకు సంబంధించి ధర రూ.1162.95 కోట్లుగా నిర్ణయించి రెవెన్యూశాఖకు బదలాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఈ భూమి నిరుపేదల కోసం ఉద్దేశించిందని, అంత ధర వెచ్చించలేమని రెవెన్యూ శాఖ పేర్కొంది. దీంతో ఈ అభ్యర్థనను సీఆర్డీఏ అథారిటీకి నివేదించి తగిన నిర్ణయం తీసుకోవాలని సీఆర్డీఏ కమిషనర్‌ను ఆదేశిస్తూ తాజా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ అంశంపై చర్చించేందుకు ముఖ్యమంత్రి జగన్ అధ్యక్షతన అథారిటీ సోమవారం సమావేశం కానుంది.


వృద్ధులకు ఏడు ఫిజియోథెరపీ కేంద్రాలు

- ఏడాదిలో 12వేల మందికి పైగా సేవలు
- మరిన్ని సౌకర్యాల కోసం ఈ ఏడాది రూ.కోటి కేటాయింపు
- వయోవృద్ధుల కోసం 'ఎల్డర్ లైన్ 14567' టోల్ ఫ్రీ సేవలు

సాక్షి, అమరావతి: వృద్ధాప్యం కారణంగా కీళ్లు, కండరాల నొప్పులతో బాధపడేవారికి సేవలు అందించేందుకు రాష్ట్రంలో ఏడు ఫిజియోథెరపీ కేంద్రాలను ప్రభుత్వం నిర్వహిస్తోంది. వాటి పరిధిలో వృద్ధులకు మరింతగా సేవలు అందించేందుకు ప్రస్తుత బడ్జెట్‌లో ప్రభుత్వం రూ.కోటి నిధులను కేటాయించింది. రాష్ట్రంలోని విశాఖపట్నం కింగ్ జార్జ్ ఆస్పత్రి(కేజీహెచ్), విజయవాడ, తిరుపతి, కర్నూలు, కడప, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రుల్లో ఫిజియోథెరపీ కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడు కేంద్రాల్లో నిపుణులైన ఫిజియోథెరపిస్టులు, వైద్యులు సేవలు అందిస్తున్నారు. గడిచిన ఏడాదికాలంలో వీటి ద్వారా 12వేల మందికిపైగా వృద్ధులు ఫిజియోథెరపీ సేవలు పొందారు. వీటితో పాటు వృద్ధాప్యంలో వచ్చే సమస్యలు తెలుసుకుని వారికి తక్షణ వైద్యసేవలు అందించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో వయోవృద్ధులు ఎదుర్కొంటున్న ఆరోగ్య, మానసిక, వ్యక్తిగత సమస్యలు తెలుసుకుని వారికి తక్షణ సహాయం అందించేలా ఎల్డర్ లైన్–14567 టోల్ ఫ్రీ నంబర్‌తో జాతీయస్థాయిలో హెల్ప్‌లైన్‌ను నిర్వహిస్తోంది. రాష్ట్రంలోని 26 జిల్లాల్లోనూ ప్రత్యేక ఫీల్డ్ రెస్పాన్స్ టీమ్స్‌తో ఎల్డర్‌లైన్ హెల్ప్‌లైన్ విభాగం సమర్థంగా పనిచేస్తోంది. మరోవైపు వయోవృద్ధులకు చేతికర్రలు, వినికిడి యంత్రాలు, మూడుచక్రాల కుర్చీలు వంటి పరికరాలు అందిస్తోంది. రాష్ట్రంలో స్వచ్ఛంద సంస్థలు(ఎన్జీఓ) నిర్వహిస్తున్న 70 వృద్ధాశ్రమాలకు ప్రభుత్వం గ్రాంట్‌ను నేరుగా అందిస్తోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2019, జూన్ నుంచి వృద్ధాప్య పింఛనుకు వయోపరిమితిని 65 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు తగ్గించింది. ఫలితంగా వైఎస్సార్ పింఛను పథకం కింద సుమారు 35లక్షల మంది వృద్ధులు ప్రతి నెల పింఛను పొందుతున్నారు.

అన్ని స్థానాల్లో సైకిల్ గుర్తు ఉంటుందా?

- వైఎస్సార్‌సీపీని ఎలా ఓడిస్తావ్ బాబూ? • నిప్పులు చెరిగిన మాజీ మంత్రి పేర్ని నాని
- 38 నియోజకవర్గాల్లో అభ్యర్థులకే దిక్కు లేదు.. 175 స్థానాల్లో పోటీ చేస్తావా?
- పవన్ కళ్యాణ్‌కు ఎన్ని సీట్లు ఇస్తున్నావ్?..
- బీజేపీ ముసుగులో టీడీపీ జెండా మోస్తున్న సత్యకుమార్, ఆదినారాయణరెడ్డి, సుజనా చౌదరిలకు ఎన్ని సీట్లు ఇస్తున్నావ్?
- టీడీపీకి సీపీఐని తాకట్టు పెట్టిన నారాయణ, రామకృష్ణలకు సీట్లు ఇస్తావా?
- రాహుల్ గాంధీకి ఎన్ని సీట్లు ఇస్తావ్?
- కంగారు పడకుండా తొలుత వాటిపై స్పష్టత తెచ్చుకో



సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 175 శాసనసభ స్థానాల్లో వైఎస్సార్‌సీపీని ఓడిస్తానంటూ ఏప్రిల్ 1న (ఫూల్స్ డే) టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బీరాలు పలుకుతూ సీఎం వైఎస్ జగన్‌ను దూషిస్తూ అలౌకిక ఆనందాన్ని పొందాడని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) మండిపడ్డారు. అసలు 175 నియోజకవర్గాల్లో సైకిల్ గుర్తుపై అభ్యర్థులను పోటీకి పెడతావా? అంటూ నిలదీశారు. మూణ్నెల్ల క్రితం టీడీపీ నేతలతో సమావేశమై.. 38 నియోజకవర్గాలలో పార్టీకి ఇన్‌ఛార్జ్‌లే లేరంటూ వాపోయిన దిక్కుమాలిన స్థితి చంద్రబాబుదేనన్నారు. 'ముందు ఆ 38 నియోజకవర్గాలకు అభ్యర్థులను వెతుక్కో.. కంగారెందుకు? ఎన్నికలకు మరో ఏడాది ఉంది కదా' అంటూ చంద్రబాబుకు హితవు పలికారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

- 175 నియోజకవర్గాల్లో పవన్ కళ్యాణ్‌కు ఎన్ని ఇస్తున్నావ్? బీజేపీలో ఉంటూ టీడీపీ జెండా మోస్తున్న సత్యకుమార్, ఆదినారాయణరెడ్డి, సుజనా చౌదరి వంటి వారికి ఎన్ని సీట్లు ఇస్తున్నావ్?
- పేరుకేమో ఎర్ర జెండా. దాన్ని పసుపు రంగులో ముంచి భుజాన వేసుకుని తిరుగుతూ.. టీడీపీకి సీపీఐని తాకట్టు పెట్టిన నారాయణ, రామకృష్ణలకే సీట్లు ఇస్తావా? ఇంకెవరికైనా ఇస్తావా? ఇంకా రాహుల్ గాంధీకి ఎన్ని సీట్లు ఇస్తావ్? వీటిపై నీకు స్పష్టత ఉందా?
- ఇంత మందిని పోగేసుకుంటే కానీ సీఎం వైఎస్ జగన్‌పై పోటీకి వచ్చే ధైర్యం చంద్రబాబుకు లేదు. అయినా 75 ఏళ్ల వయసులో ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారు. ఇంకా అబద్ధాలు, అసత్యాలు, మసిపూసి మారేడుకాయ చేయడం, ఏమార్చటాలు.. ఈ వయసులోనూ చంద్రబాబు వీడ లేదు.
- 175 చోట్లా పోటీ చేసే దమ్ము లేదు. స్థోమతా లేదు. పది మందిని కలుపుకుంటేగానీ సీఎం వైఎస్ జగన్‌పై పోటీ చేసే సాహసం చేయలేని దుస్థితి. కొడుకు కలిసి రాడు. జనం మెచ్చుకోరు. అందుకే దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, బావమరిది బాలకృష్ణతో తిరిగి.. సినిమా డైలాగ్‌లు రాయించుకుని పంచ్ డైలాగులు వదులుతున్నాడు.
- చంద్రబాబు ఎన్ని పార్టీలను పోగేసుకొని వచ్చినా, ప్రజల హృదయాల నుంచి సీఎం వైఎస్ జగన్‌ను ఇసుమంత కూడా తొలగించలేరు. 2024 ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీదే విజయం.

కుప్పంలో కార్యకర్త చేతిలో ఓడటం ఎందుకు?

- 'వైనాట్ పులివెందుల?' అంటున్నారు కదా.. అలా అనే వారందరినీ నేను ఆహ్వానిస్తున్నాను. పులివెందులలో జగన్ గారు ఓడిపోతారని కలలు కనే వారంతా వచ్చి పోటీ చేయండి. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్.. ఎవరైనా సరే పులివెందులలో పోటీ చేయొచ్చు. కుప్పంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల చేతిలో ఓడిపోవడం ఎందుకు? పులివెందులలోనే పోటీ చేయండి. అక్కడే ఇద్దరూ పోటీ చేసినా ఫరవాలేదు. మీరో.. మేమో తేలిపోతుంది.
- మొత్తం 21 ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరిగితే చంద్రబాబు గెలిచింది కేవలం నాలుగు. గ్రాడ్యుయేట్స్‌లో మూడు, ఎమ్మెల్యే కోటాలో ఒకటి.. దానికే చంకలు గుద్దుకోవడం ఏమిటో? ప్రపంచాన్ని జయించినట్లు, ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహించినట్లు ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నాడు.

కర్నూలు డిక్లరేషన్ ఏమైంది?

- మందడంలో అమరావతి దీక్ష శిబిరం రోజూ ఖాళీగానే ఉంటుంది. వందో.. ఐదు వందల రోజు వంటి ఫ్యాన్సీ నంబర్ వచ్చినప్పుడు మాత్రం అక్కడికి చంద్రబాబు అద్దె మైక్‌గాళ్లను చంద్రబాబు పంపి.. సీఎం వైఎస్ జగన్‌పై కారుకూతలు కూయించడం ధర్మమా?
- పది దొడ్లు మారి చేరిన వారు నిజంగా బీజేపీ వాళ్లేనా? రాయలసీమలో రెండో రాజధాని పెట్టాలంటూ 2018లో బీజేపీ చేసిన కర్నూలు డిక్లరేషన్ ఏమైంది? కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేస్తామని 2019 ఎన్నికల మేనిఫెస్టోలో బీజేపీ చెప్పిన మాటలు ఏమయ్యాయి?
- తన మనసుకైతే తమ ప్రభుత్వం వస్తే కర్నూలే రాజధాని అని ఆ నగర పర్యటనలో పవన్ కళ్యాణ్ అన్నాడు. అలాగే విశాఖ వెళ్లి ఈ ప్రాంతం రాజధాని కావడానికి అన్ని అర్హతలు ఉన్న నగరం అన్నాడు. ఇప్పుడు బీజేపీ నేతలకు, పవన్ కళ్యాణ్‌కు సిగ్గు శరం లేవా?
- అమరావతి ప్రాంతంలో 54 వేల మంది నిరుపేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ఉద్యమం చేస్తోన్న బహుజన పరిరక్షణ సమితి నేతృత్వంలోని దళితులపై బీజేపీ ముసుగులో టీడీపీ జెండా మోస్తున్న సత్యకుమార్, ఆదినారాయణరెడ్డి చేసిన దాడిని ఖండిస్తున్నాం. చంద్రబాబు పంచన ఉన్నప్పుడు ఆదినారాయణరెడ్డి దళితులను ఎలా అవమానించాడో అందరికీ గుర్తుంది.

బాబు మౌన రాగం

▶ మొదటి పేజీ తరువాయి

స్థానాలు ఉంటాయి. వాటి పరిధిలో సుమారు 80 లక్షల మంది ఓటర్లు ఉంటారు. ఇందులో సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పథకాల ద్వారా 87 శాతం కుటుంబాలకు చెందిన ఓటర్లకు ప్రయోజనం చేకూరింది. సంవత్సర ఆదాయం పట్టణాల్లో రూ.12 వేలు.. గ్రామాల్లో రూ.10 వేలలోపు ఉంటే ఆ కుటుంబాలను దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్నట్లుగా గుర్తిస్తారు. ఆ కుటుంబాలకే సంక్షేమ పథకాలను వర్తింపజేస్తారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానంలో ఓటర్లు సుమారు 2.50 లక్షల నుంచి మూడు లక్షల వరకు ఉంటారు. ఇందులో 80 శాతం ఓటర్లు సంక్షేమ పథకాల పరిధిలోకి వచ్చే అవకాశం లేదు. అలాంటి ఓటర్ల ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో.. అదీ వామపక్షాలు, పీడీఎఫ్, యూనియన్లతో ఒప్పందం చేసుకుని గట్టెక్కడం అన్నది బలం కానే కాదని, వాపు అని అందరికంటే చంద్రబాబుకే బాగా తెలుసు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు కాని మహిళలు, మిగతా వారంతా రేపటి సార్వత్రిక ఎన్నికల్లో తమకు మేలు చేస్తున్న ప్రభుత్వం కోసం ఏకమైతే టీడీపీ స్థానం ఎక్కడుంటుందో ప్రత్యేకించి చెప్పాల్సిన పనిలేదు. నిజంగా 50కి పైగా నియోజకవర్గాల్లో ఇప్పటికీ అభ్యర్థులే లేరు. మొత్తం 175 స్థానాల్లో టీడీపీకి రెండో స్థానం కూడా సందేహమేనని ఆ పార్టీ నేతలే బాహాటంగా చెబుతున్నారు. ఈ విషయంపై ప్రజల్లో ఎక్కువ చర్చ జరిగితే టీడీపీ పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని పక్కదోవ పట్టిస్తూ సరికొత్త రాజకీయ డ్రామాకు తెరలేపారు. ఇందుకు ఎల్లో మీడియా వంత పాడుతోంది.

వైఎస్సార్‌సీపీ ప్రయోగాత్మకంగా పోటీ

- పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సాధారణంగా వామపక్షాలు, పీడీఎఫ్, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు పోటీ చేసేవి. వాటికి ప్రధాన రాజకీయ పార్టీలు మద్దతు ఇచ్చేవి. ప్రధానంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల నమోదు నుంచే వామపక్షాలు, పీడీఎఫ్, బీజేపీ, యూనియన్‌లు క్రియాశీలకంగా పని చేస్తాయి. కొన్ని దశాబ్దాలుగా తమ ప్రభావం ఉన్న వర్గాలనే ఎంచుకుని ఓటర్లుగా చేర్పిస్తున్నాయి.
- అయితే ఇటీవల జరిగిన పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రయోగాత్మకంగా వైఎస్సార్‌సీపీ పోటీ చేసింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయపతాక ఎగురవేసింది. మూడు పట్టభద్రుల స్థానాల్లో పోటీ చేసిన టీడీపీ.. ప్రథమ ప్రాధాన్యత ఓట్లతో ఎక్కడా గెలవలేదు. కేవలం పీడీఎఫ్, సీపీఐ తదితర పక్షాలతో ఓట్ల బదిలీ ఒప్పందం కుదిరిన మేరకు.. ఆ వర్గాలు వేసిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లతో గట్టెక్కింది.
- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలను అన్ని వర్గాల ప్రజల అభిప్రాయంగా భావించడానికి ఏమాత్రం వీల్లేదని, ఒకవేళ అలా భావిస్తే తనను తాను మోసం చేసుకోవడమేనన్నది చంద్రబాబుకు కూడా తెలుసని రాజకీయ పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. కేవలం టీడీపీ శ్రేణుల్లో నైతిక స్థైర్యాన్ని నింపడానికే.. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల గెలుపు ట్రైలర్ మాత్రమేనంటూ చంద్రబాబు బీరాలు పలుకుతున్నారని విశ్లేషిస్తున్నారు.
- బాబుకు ఎల్లో మీడియా వంతపాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై సోమవారం సీఎం జగన్.. ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌ఛార్జ్‌లు, ప్రాంతీయ సమన్వయకర్తలతో సమావేశం నిర్వహిస్తున్నారంటూ వక్రభాష్యం చెబుతోంది. కొద్ది నెలలుగా ఈ కార్యక్రమం కొనసాగుతోందనే నిజాన్ని దాస్తోంది.

రూ.2 లక్షల కోట్లతో ఇంటింటికీ లబ్ధి


- రాష్ట్రంలో 2019 సార్వత్రిక ఎన్నికల్లో 50 శాతం ఓట్లతో 151 శాసనసభ, 22 లోక్‌సభ స్థానాలను దక్కించుకుని వైఎస్సార్‌సీపీ చారిత్రక విజయాన్ని సాధించింది. టీడీపీ 23 స్థానాలకే పరిమితమైంది. సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు స్వీకరించాక సంక్షేమ పథకాలు.. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు.
- అధికారంలోకి వచ్చి నాలుగేళ్లు కూడా పూర్తవ్వక ముందే సీఎం జగన్ సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ (ప్రత్యక్ష నగదు బదిలీ) రూపంలో లబ్ధిదారుల ఖాతాల్లో ఏకంగా రూ.రెండు లక్షల కోట్లు జమ చేశారు. దేశ చరిత్రలో ఇదో రికార్డుగా రాజకీయ పరిశీలకులు అభివర్ణిస్తున్నారు.
- గ్రామ, వార్డు సచివాలయాలు, 13 జిల్లాలను 26 జిల్లాలుగా పునర్ వ్యవస్థీకరించడం ద్వారా పరిపాలనను వికేంద్రీకరించి.. ప్రజల గుమ్మం వద్దకే ప్రభుత్వాన్ని తీసుకెళ్లి సుపరిపాలన అందిస్తున్నారు. కరోనా కష్టకాలంలో, ఆర్థిక ఇబ్బందుల్లోనూ ఏ ఒక్క సంక్షేమ పథకాన్ని ఆపకుండా సీఎం అమలు చేశారు. ఇది ప్రజల్లో వైఎస్సార్‌సీపీకి నానాటికీ ఆదరణ పెరగడానికి దోహదం చేస్తోందని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.
- అందువల్లే 2019 ఎన్నికల తర్వాత జరిగిన పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ ఎన్నికలు.. తిరుపతి లోక్‌సభ, బద్వేలు, ఆత్మకూరు శాసనసభ స్థానాల ఉప ఎన్నికలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించడాన్ని వారు గుర్తు చేస్తున్నారు. రికార్డు విజయాలతో వైఎస్సార్‌సీపీ తిరుగులేని శక్తిగా ఆవిర్భవిస్తే.. వరుస ఓటములతో టీడీపీ శ్రేణులు జవసత్వాలు కోల్పోయాయి.

పంచాయతీరాజ్ శాఖలో ఇక అంతా ఆన్‌లైన్‌లోనే

సాక్షి, అమరావతి: పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ విభాగం చేపట్టే రోడ్లు, ఇతర ప్రభుత్వ పనుల్లో పూర్తి పారదర్శకత తీసుకొచ్చి అక్రమాలను అరికట్టేందుకు ఆ శాఖ ఆన్‌లైన్ విధానాన్ని అందుబాటులోకి తెస్తోంది. పనులకు సంబంధించి ముందస్తు అంచనాల (ఎస్టిమేట్స్) తయారీ, టెండర్లు, జరిగిన పనికి ఎం –బుక్ నిర్వహణ అంతా ఆన్‌లైన్ విధానంలోకి తేనుంది. ఇందుకోసం పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తోంది. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఈఎన్‌సీ బాలూనాయక్, ముఖ్య ఇంజనీరింగ్ అధికారులతోపాటు రాష్ట్రవ్యాప్తంగా అనుభవం, నైపుణ్యం ఉన్న కొందరు అధికారులు బృందాలుగా ఏర్పడి ఈ సాఫ్ట్‌వేర్ ఎలా ఉండాలో నివేదికను కూడా సిద్ధం చేశారు. నూతన సాఫ్ట్‌వేర్‌తో పనుల అంచనాల రూపకల్పన, టెండర్ల ప్రక్రియ, ఎం–బుక్ నిర్వహణలో పారదర్శకత ఉంటుందని, అక్రమాలకు పూర్తిగా అడ్డుకట్ట పడుతుందని ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు వెల్లడించారు. పనుల్లో నాణ్యత కూడా పెరుగుతుందని తెలిపారు.

నేటి భవితలో..

- **స్కిల్ డవలప్‌మెంట్: సెంట్రల్ బ్యాంక్‌లో అప్రెంటీస్!** బ్యాంకింగ్ రంగమంటే యువతకు ఎంతో క్రేజ్! బ్యాంకు కొలువులో చేరాలని.. ఉజ్వల కెరీర్ సొంతం చేసుకోవాలని కోరుకుంటారు. ఇలాంటి వారు బ్యాంకింగ్ రంగంలో క్షేత్ర నైపుణ్యాలు సొంతం చేసుకొని.. భవిష్యత్తులో కొలువుల సాధనలో ముందంజలో నిలిచే అవకాశం కల్పిస్తోంది.. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా! ఆన్ జాబ్ ట్రైనింగ్ పేరుతో..బ్యాంకుల్లోని పనితీరుపై శిక్షణ అందిస్తోంది. ఇందుకోసం తాజాగా అయిదు వేల అప్రెంటీస్ ట్రైనీ నియామకాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో.. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా.. అప్రెంటీస్ ట్రైనీ నోటిఫికేషన్, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు...
- **గ్రూప్స్ ప్రత్యేకం-కరెంట్ అఫైర్స్:** పోటీ పరీక్షల అభ్యర్థులకు ఉపయోగపడేలా.. అంతర్జాతీయం, జాతీయం, రాష్ట్రీయం, వార్తల్లో వ్యక్తులు, క్రీడలు తదితర ముఖ్యాంశాలతో వీక్లీ కరెంట్ అఫైర్స్ రౌండప్
- విద్య, ఉద్యోగ సమాచారం



నేటి భవిత పేజీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

సాక్షి
సోమవారం, ఏప్రిల్, 3

మాటా మంచీ

మనుషులకున్నదీ, ఇతర ప్రాణులకు లేనిదీ ఒక్క ఆలోచనాశక్తే కాదు, మాట కూడా! మాట శ్రుతిమించితే వివాదమవుతుంది, అతి అయితే వాచలత అవుతుంది, అదుపులో ఉంటే విజ్ఞతవుతుంది, రసాత్మకమైతే కవిత్వమవుతుంది, జనహితైషి అయిన ఒక మహనీయుని అంతరంగపు లోతుల్లోంచి ఉబికి వచ్చినప్పుడు అశేషజనావళిని కదిలించే మంత్రమవుతుంది. మాట అనేది మంచి, చెడుల కలబోత, రెండంచుల కత్తి! మనిషిని మనుషుల్లోకి తెచ్చి సామాజికుణ్ణి చేసినదీ, సంభాషణకు ఉపక్రమింపజేసినదీ, ఆ సంభాషణ నుంచి సంఘటిత కార్యంవైపు నడిపించినదీ, అందుకు అవసరమైన వ్యవస్థల అభివృద్ధికి దోహదమైనదీ, మాటే. ఆ క్రమంలోనే మాటకు వ్యాక రణం పుట్టింది, ఉచితానుచితాలనే హద్దులు ఏర్పడ్డాయి, ఆ హద్దుల నుంచి నాగరికత వచ్చింది. మనిషి చరిత్రలో ఇంతటి మహత్తర పాత్ర వహించిన మాట విలువ రానురాను పాతాళమట్టానికి పడిపోవడం నేటికాలపు విషాదం. ఏ రంగంలో చూసినా అసత్యాలు, అర్ధసత్యాల స్వైరవిహారం మాట విలువను దిగజార్చివేసింది.

దుస్సాధ్యమని చెప్పదలచుకున్నప్పుడు 'మాటలు కా'దంటూ మాటను చులకన చేస్తాం. మన కన్నా ప్రాచీనులే మాటను ముత్యాలమూటగా నెత్తిన పెట్టుకుని గౌరవించారు. బహుముఖమైన దాని విలువను గుర్తించి మహత్తును ఆపాదించారు. దానినుంచే మాంత్రికత, వరాలు, శాపాలు పుట్టాయి. మామూలు మాట కన్నా ముందు కవితాత్మక వాక్కు పుట్టిందని మానవ పరిణామ శాస్త్రవేత్తలు తేల్చారు. కొన్ని సమాజాల్లో మామూలు సంభాషణ కూడా కవితాత్మకంగా ఉండేదని ప్రముఖ పురాచరిత్ర అధ్యయనవేత్త జార్జి థామ్సన్ అంటూ, ఐరిష్ సమాజాన్ని ఉదహరిస్తాడు.


రాత వచ్చాకే మాట తలరాత మారింది. మాట మంచిని, మర్యాదను, పొదుపును, అర్థవంతతను పదే పదే బోధించే అవసరం తలెత్తింది. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది, కాలు జారితే తీసుకోగలం కానీ, మాట జారితే తీసుకోలేం, పెదవి దాటితే పృథివి దాటుతుంది – వంటి సామెతలు, నుడికారాలు, సూక్తులు ప్రతి వాఙ్మయంలోనూ కొల్లలు. 'మనిషికి మాటే గొప్ప అలంకారం, మిగతా అలంకారాలన్నీ నశించిపోయేవే'నని హెచ్చరిస్తాడు భర్తృహరి. మాటను అబద్ధంతో కలుషితం చేయడానికి నిరాకరించి రాజ్యాన్ని, ఆలుబిడ్డలను సైతం కోల్పోవడానికి హరిశ్చంద్రుడు సిద్ధపడ్డాడు. మహాత్మాగాంధీకి స్ఫూర్తినిచ్చిన కథలలో అదొకటి. గయుడు కృష్ణుని ఆగ్రహానికి గురైన సంగతి తెలియక రక్షిస్తానని అతనికి మాట ఇచ్చిన అర్జునుడు, దానిని నిల బెట్టుకోడానికి తన బహిఃప్రాణమైన కృష్ణునితోనే యుద్ధం చేశాడు.

లిఖిత సంప్రదాయం ఏర్పడని, లేదా పూర్తిగా వేళ్లూనుకొనని రోజుల్లో నోటిమాటగానే అన్ని వ్యవహారాలూ జరిగేవి. ఆర్థికమైన లావాదేవీలలో మాటే వేయి ప్రామిసరీ నోట్ల విలువను సంతరించుకునేది. అలెగ్జాండర్ దండయాత్ర కాలంలో మనదేశాన్ని సందర్శించిన ఒక గ్రీకు చరిత్రకారుడు, ఇక్కడ ఋణసంబంధమైన అన్ని ఒప్పందాలూ నోటిమాటగా జరగడం చూసి ఆశ్చర్యపోయాడు. పురాణ, ఇతిహాసాలలో మాట నిలకడతోపాటు, మాటసొంపుకు, నేర్పుకే ప్రాధాన్యం. రామాయణంలోని హనుమంతుడు అటువంటి సుగుణాలరాశి. రాముడికీ, సుగ్రీవుడికీ స్నేహసంధానం చేసింది అతనే. అతని వాక్చతురతను ఉగ్గడించడానికే కాబోలు, వ్యాకరణ పండితుణ్ణి చేశారు.

దాదాపు ప్రతి దేశమూ, ప్రతి ఇతర దేశంతోనూ పాటించే దౌత్యనీతికి మాటే గుండెకాయ. దౌత్యచతురత ఇప్పుడు ఒక ప్రత్యేకవిద్యగా అభివృద్ధి చెందింది. మహాభారతాన్నే చూస్తే, వివిధ సందర్భాలలో ద్రుపదుని పురోహితుడు, విదురుడు, సంజయుడు, కృష్ణుడు కురుపాండవుల మధ్య రాయబారం నెరిపారు. రాజనీతి కుశలతే కాక, అవతలి పక్షానికి సూటిగా తేటగా, ఎక్కువ తక్కు వలు కాకుండా సందేశాన్ని చేరవేసే మాటనేర్పే అందుకు వారి అర్హత. ధృతరాష్ట్రునికి గాంధారి నిచ్చి పెళ్లి చేయాలన్న ప్రతిపాదనను భీష్ముడు ఒక మాటకారితోనే గాంధారరాజు సుబలుడికి పంపుతాడు. కుండిన నగరానికి వచ్చి రాక్షస పద్ధతిలో తనను ఎత్తుకెళ్లి వివాహమాడమన్న సందేశాన్ని అగ్నిద్యోతనుడనే పురోహితుని ద్వారా రుక్మిణి కృష్ణునికి పంపుతుంది. రాజ్యం కోల్పోయి అడవుల పాలైన తన భర్త నలుని జాడ కనిపెట్టడానికి దమయంతి, అతనికి మాత్రమే అర్థమయ్యే ఒక సందే శమిచ్చి దానిని సమర్థంగా అందించగల వ్యక్తినే పంపుతుంది. పర్షియన్లకు, గ్రీకులకు యుద్ధం వచ్చినప్పుడు స్పార్టాన్ల సాయాన్ని అర్థిస్తూ గ్రీకులు ఫిలిప్పైడ్స్ అనే వ్యక్తిని దూతగా పంపుతారు. మాట నేర్పుతోపాటు వేగంగా నడవగలిగిన ఫిలిప్పైడ్స్ కొండలు, గుట్టలవెంట మైళ్ళ దూరం నడిచి వెళ్ళి స్పార్టాన్లకు ఆ సందేశం అందించి తిరిగి వచ్చి యుద్ధంలో పాల్గొంటాడు. విచిత్రంగా ఇతనికీ, సముద్రాన్ని లంఘించి లంకకు వెళ్ళి సీతను చూసొచ్చిన హనుమంతుడికీ పోలికలు కనిపిస్తాయి.

మాటల మహాసముద్రంలో సాహిత్యం, శాస్త్రవిజ్ఞానం వగైరా అనర్ఘరత్నాలే కాదు; మనుషుల మధ్యా, మతాల మధ్యా విరోధం పెంచి విధ్వంసం వైపు నడిపించే తిమింగలాలూ ఉంటాయి. మంచి, మర్యాద, విజ్ఞత, వివేకం ఉట్టిపడేలా నిరంతరం తీర్చిదిద్దుకునే మాటతోనే వాటిని తరిమి కొట్టగలం. రకరకాల కాలుష్యాల నుంచి మాటను విడిపించి తిరిగి మంత్రపూతం, అర్థవంతం చేయడం కూడా ఒక తరహా పర్యావరణ ఉద్యమమే. నూరు అబద్ధాల మధ్య ఒక నిజం కూడా అబద్ధంగా మారిపోయే దుఃస్థితి నుంచి మాటను రక్షించకపోతే ఇంతటి మానవ ప్రగతీ అబద్ధమైపోతుంది.

ఏది నిజం?



ఇంకెన్నాళ్లీ కలంకూట విషం?

- మీకు కమీషన్లే ముఖ్యం తప్ప... పోలవరం పూర్తి చేయాలనే ధ్యాసెక్కడుంది?
- దేనికైనా సై... అనేలా 2012-14 నాటి ధరలిస్తే చాలని కూడా ఒప్పేసుకున్నారు
- నాడు ఆమోదించిన కేబినెట్లో మీ ఎంపీలూ మంత్రులుగా ఉన్నారు కదా?
- పోలవరం వ్యయం పెరిగితే.. దానికి తగ్గట్టుగా ఇవ్వాలని ఎందుకు చెప్పలేదు?
- ఏళ్లు గడుస్తున్నకొద్దీ ఏ ప్రాజెక్టు వ్యయమైనా పెరగకుండా ఉంటుందా?
- స్పిల్ వే, స్పిల్ ఛానెల్, అప్రోచ్ చానెల్, పైలట్ చానెల్ పూర్తి చేసింది ఈ ప్రభుత్వమేగా?
- కాఫర్ డ్యామ్‌లలో ఖాళీలు వదిలేస్తే... పునరావాసం కల్పించి పూర్తిచేసిందెవరు?
- దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్‌ను ఏం చేయాలో నిపుణులు చెప్పాల్సిన పనిలేదా?
- ఇప్పుడు చెప్పారు కాబట్టి... ఆ పనులూ ఈ ప్రభుత్వమే చేపట్టింది; పూర్తి చేస్తోంది
- ఈ వాస్తవాలు ఎన్నడూ చెప్పరెందుకు రామోజీ? ఇంకెన్నాళ్లీ అబద్ధాలు?

మీ 'దోచుకో- పంచుకో- తినుకో' వల్లే పోలవరం అస్తవ్యస్తమయిందని తెలియనిదెవరికి?

- రామోజీరావు వియ్యంకుడితో కలిసి పోలవరంలో ప్రజాధనాన్ని దోచేసిన చంద్రబాబు
- ఆ పాపాల వల్లే దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్.. పోలవరం పనుల్లో జాప్యానికి అదే కారణం
- డీపీటీకి అడ్డుకట్ట పడిందనే అక్కసు.. తన్మదీయుడు పూర్తి చేస్తున్నారనే కడుపుమంటతో వైఎస్ జగన్ ప్రభుత్వంపై పదే పదే విషం చిమ్ముతున్న రామోజీ
- చంద్రబాబు పాపాల వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ పోలవరాన్ని వడివడిగా పూర్తి చేసే దిశగా సీఎం వైఎస్ జగన్ అడుగులు

తప్పు ఎవరు చేసినా దాన్ని ఎత్తిచూపడం నిఖార్సయిన జర్నలిజం. అస్మదీయుడైన చంద్రబాబు చేసిన తప్పును తస్మదీయుడైన సీఎం వైఎస్ జగన్‌పై నెట్టేసి.. అదే నిజమని ప్రజలను నమ్మించడానికి పదే పదే విషం చిమ్మడం 'ఈనాడు' రామోజీరావు మార్క్ పాత్రికేయం.

కమీషన్ల కక్కుర్తితో కేంద్రమే కట్టాల్సిన పోలవరం నిర్మాణ బాధ్యతలను 2016లో దక్కించుకున్న తక్షణమే... రామోజీ వియ్యంకుడి సంస్థ నవయుగకు రూ.2,917.78 కోట్లు విలువైన పనులను నామినేషన్‌పై కట్టబెట్టేశారు చంద్రబాబు. మిగిలిన కొన్ని పనులను యనమల బావమరిది సుధాకర్ యాదవ్‌కు పంచేశారు. దేశ చరిత్రలో ఇదో రికార్డు.

సులభంగా చేయగలిగి... త్వరగా అధిక లాభాలు మిగిలే పనులనే చేపట్టిన చంద్రబాబు... రామోజీరావు, ఆయన వియ్యంకుడితో కలిసి ప్రజాధనాన్ని డీపీటీ(దోచుకో పంచుకో తినుకో) విధానంలో కాజేశారు. పోలవరం చంద్రబాబుకు ఏటీఎంగా మారిపోయిందని సాక్షాత్తూ ప్రధాని నరేంద్ర మోదీయే అన్నారంటే.. వీళ్లెంతకు బరితెగించారో అర్థం చేసుకోవచ్చు. ఈ దోపిడీ వల్లే డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో నాలుగు చోట్ల భారీ అగాధాలు ఏర్పడ్డాయి. ఇదే పోలవరం పనుల్లో తీవ్ర జాప్యం జరగడానికి కారణమైంది. మానవతప్పిదం వల్లే డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్నదని సాక్షాత్తూ ఎన్‌హెచ్‌పీసీ, ఐఐటీ, డీడీఆర్పీ నిపుణులే తేల్చి చెప్పారు. ఆ మానవుడు చంద్రబాబేనని కూడా అందరికీ తెలుసు. కానీ రామోజీరావు మాత్రం ఒక్క ముక్క కూడా రాయరు. ఎందుకంటే తన వియ్యంకుడి పేరు బయటికొస్తుంది కాబట్టి!!. పైపెచ్చు తప్పంతా వైఎస్ జగన్ ప్రభుత్వానిదేనన్నట్లుగా పదే పదే విషపు రాతలు!!. మరీ ఇంత దుర్మార్గమా?

> చంద్రబాబు పాపాల వల్ల ఎదురవుతున్న సవాళ్లను అధిగమిస్తూ.. ప్రణాళికాయుతంగా పోలవరాన్ని పూర్తి చేయడానికి వడివడిగా అడుగులేస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను పనిగట్టుకుని మరీ విమర్శిస్తున్న 'ఈనాడు' కథనంలో డొల్లతనం ఇదిగో...

రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చుక్కానిలా నిలిచే పోలవరం బహుళార్థక సాధక జాతీయ ప్రాజెక్టు పనుల్లో చంద్రబాబు చేసిన పాపాలు అన్నీ ఇన్నీ కావు. ప్రాజెక్టు పూర్తి చేయటంకన్నా జేబులు నింపుకోవటం పైనే దృష్టిపెట్టిన బాబు గ్యాంగ్ వైఖరితో ప్రాజెక్టు అస్తవ్యస్తమయింది. పరిస్థితిని చక్కదిద్దుతూ... ఆ సవాళ్లను అధిగమిస్తూ ప్రణాళికాబద్ధంగా సీఎం వైఎస్ జగన్ అడుగులేస్తుండటం రామోజీరావుకు మింగుడుపడటం లేదు. అభూత కల్పనలు, అవాస్తవాలతో పదే పదే 'కలం'కూట విషం చిమ్ముతున్నారు. నిజానికి ఈ రాతలను జాగ్రత్తగా చూస్తే... తమ డీపీటీ విధానానికి విఘాతం కలిగిందనే అక్కసు తప్ప మరోటి కన్పించదు. చంద్రబాబు చేసిన పాపాల వల్ల పోలవరం పనుల్లో జాప్యం చోటుచేసుకున్న వైనాన్ని ఇటీవల శాసనసభలో ఆధారాలతో సహా సీఎం జగన్ వివరించారు. చంద్రబాబు పాపాల వల్ల దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్‌ను సరిదిద్దడం, ఎన్‌హెచ్‌పీసీ, డీడీఆర్పీ మార్గదర్శకాల మేరకు అగాధాలను పూడ్చడానికి రూ.2,022 కోట్లు వ్యయమవుతుందని.. ఇదంతా ప్రాజెక్టుపై అదనపు భారమేనని స్పష్టం చేశారు.

పోలవరాన్ని ఏటీఎంగా మార్చుకున్న చంద్రబాబు

- విభజన చట్టం ప్రకారం పోలవరం ప్రాజెక్టును కేంద్రమే నిర్మించాలి. కానీ.. నాటి టీడీపీ ఎంపీ రాయపాటిని అడ్డంపెట్టుకుని పోలవరంలో ప్రజాధనాన్ని దోచేయడానికి స్కెచ్ వేసిన చంద్రబాబు, నిర్మాణ బాధ్యతలను రాష్ట్రానికి అప్పగించాలని కోరుతూ వచ్చారు. ప్రత్యేక హోదాను తాకట్టు పెట్టేందుకు సిద్ధపడటంతో 2016, సెప్టెంబరు 7న అర్ధరాత్రి పోలవరం నిర్మాణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం అప్పగించింది.
- ఆ వెంటనే పోలవరం హెడ్ వర్క్స్‌లో రాయపాటికి చెందిన ట్రాన్స్‌ట్రాయ్ సంస్థ కాంట్రాక్టు ఒప్పంద విలువ రూ.4,054 కోట్లను.. ఈపీసీ నిబంధనలకు విరుద్ధంగా రూ.5,386 కోట్లకు పెంచేసి.. అనుచితంగా రూ.1,332 కోట్ల ప్రయోజనం చేకూర్చారు చంద్రబాబు. ఆ తర్వాత 2016, డిసెంబర్ 30న పనులు ప్రారంభించారు. ట్రాన్స్‌ట్రాయ్‌ని అడ్డుపెట్టుకుని పనులన్నీ సబ్ కాంట్రాక్టర్లకు అప్పగించి.. ప్రతి సోమవారాన్ని పోలవారంగా మార్చుకుని చంద్రబాబు కమీషన్లు వసూలు చేసుకున్నారు.
- ఈ క్రమంలో ట్రాన్స్‌ట్రాయ్ నుంచి రూ.2917.78 కోట్ల పనులను తప్పించి.. నిబంధలనకు విరుద్ధంగా లంప్సమ్ విధానంలో వాటిని నామినేషన్ పద్ధతిపై రామోజీ వియ్యంకుడికి చెందిన నవయుగకు కట్టబెట్టారు. సులభంగా చేయగలిగి.. అధికంగా లాభాలు వచ్చే స్పిల్ వే పునాది, స్పిల్ ఛానల్ కాంక్రీట్ వంటి మాస్ కాంక్రీట్ పనులను చేపట్టి.. నవయుగకు రూ.1675 కోట్ల బిల్లులు చెల్లించేసి.. భారీ ఎత్తున కమీషన్లు పంచుకు తిన్నారు.
- పోలవరం ఎడమ కాలువ ఐదో ప్యాకేజీలో రూ.71 కోట్ల విలువైన పనుల వ్యయాన్ని రూ.182 కోట్లకు పెంచేసి... దాన్ని యనమల వియ్యంకుడు పుట్టా సుధాకర్ యాదవ్‌కు నామినేషన్‌పై ఇచ్చేశారు చంద్రబాబు. ఇదీ కథ.

జీవచ్ఛవంగా మార్చిన చంద్రబాబు.. జీవనాడిగా రూపునిస్తోన్న వైఎస్ జగన్

సాధారణంగా ఏ నీటిపారుదల ప్రాజెక్టులోనైనా... వరద నీటిని దిగువకు విడుదల చేసే స్పిల్ వేను నదికి అడ్డంగా కడతారు. నీటిని నిల్వ చేసే మట్టికట్టను నదికి ఆవల నిర్మిస్తారు. కానీ.. పోలవరం అలా కాదు. దీని నిర్మాణ ప్రాంతంలో ఉన్న భూభౌగోళిక పరిస్థితులను పరిగణలోకి తీసుకున్న కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ)... 194.6 టీఎంసీలను నిల్వచేసే ప్రధాన డ్యామ్ అయిన రాతిమట్టికట్ట(ఎర్త్ కమ్ రాక్ ఫిల్- ఈసీఆర్ఎఫ్ డ్యామ్)ను నదికి అడ్డంగానూ.... నదీ తీరానికి ఆవల కుడి వైపున స్పిల్ వేను నిర్మించేలా డిజైన్‌ను రూపొందించింది. మరి ఈ ప్రాజెక్టును ఎలా నిర్మించాలి? కానీ చంద్రబాబు ఎలా నిర్మించారు? దానివల్ల జరిగిన నష్టమేంటి? ఆ నష్టాన్ని పూడుస్తూ ప్రాజెక్టును పూర్తి చేయడానికి సీఎం వైఎస్ జగన్ ఏం చేస్తున్నారు? అనేవి ఒకసారి చూద్దాం...

స్పిల్ వే

గోదావరికి అడ్డంగా ప్రధాన డ్యామ్ నిర్మించాలంటే తొలుత గోదావరి తీరానికి ఆవల కుడి వైపున 45.72 మీటర్ల గరిష్ఠ నీటి మట్టంతో స్పిల్ వే నిర్మించాలి. 20 మీటర్ల ఎత్తు, 16 మీటర్ల వెడల్పుతో 48 గేట్లను దానికి ఏర్పాటుచేయాలి. 50 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినా సులభంగా దిగువకు విడుదల చేసేలా హైడ్రాలిక్ హాయిస్ట్ సిలిండర్ వ్యవస్థను గేట్లకు ఏర్పాటు చేయాలి. తొలుత ఈ పనులు పూర్తి చేయాలి. అలా చేస్తే ఎంత వరద వచ్చినా ఇబ్బంది ఉండేది కాదు.

కానీ.. 2016, డిసెంబర్ నుంచి 2019, మే మధ్య కేవలం పునాది స్థాయికి మాత్రమే చంద్రబాబు దీని పనులు చేశారు. ఇందులో ఎక్కువ కమీషన్లు రావని... అక్కడితో వదిలేసి, సులువుగా పూర్తయ్యే... ఎక్కువ కమీషన్లు వచ్చే మిగతా పనులపై ఫోకస్ పెట్టారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక కరోనా ప్రతికూల పరిస్థితుల్లోనూ.. కేంద్రం నిధులు ఇవ్వడంలో జాప్యం చేస్తున్నా... రాష్ట్ర ఖజానా నుంచే ఖర్చు చేసి 2021, జూన్ నాటికి 48 గేట్లతో సహా స్పిల్ వేను నూరుశాతం పూర్తి చేశారు.

స్పిల్ చానెల్

స్పిల్ వే నుంచి దిగువకు విడుదలయ్యే వరద నీటికి నదిలోకి కలపడానికి 2.764 కి.మీ.ల పొడవున.. 1100 మీటర్ల వెడల్పుతో స్పిల్ చానెల్‌ను నిర్మించాలి. స్పిల్ వే పూర్తయ్యేలోగా ఈ పనులు కూడా పూర్తి చేయాలి. 2016, డిసెంబర్ నుంచి 2019, మే మధ్య స్పిల్ చానెల్‌లో కాంక్రీట్‌ను కుప్పగా పోసే పనులను చంద్రబాబు చేపట్టారు. కాంక్రీట్ పోసినందుకు ఘనపుటడుగుల చొప్పున కాంట్రాక్టరుకు బిల్లు చెల్లించవచ్చు కనక ఎక్కువ కమీషన్లొస్తాయి. ఈజీ ప్లస్ లాభాలెక్కువ. అందుకే కాంక్రీట్ పోశారు తప్ప... ఇందులో కష్టతరమైన డౌన్‌స్ట్రీమ్ కటాఫ్ వంటి పనులు వదిలేశారు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక స్పిల్ చానెల్‌ను నూరుశాతం పూర్తి చేశారు.

పైలట్ చానెల్

స్పిల్ చానెల్ మీదుగా వచ్చే వరద జలాలను నదిలోకి మళ్లించేందుకు 1.026 కిమీల పొడవున పైలట్ చానెల్ తవ్వాలి. ఈ పనులు కూడా చంద్రబాబు ముట్టుకోలేదు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక అప్రోచ్ చానెల్, స్పిల్ వే, స్పిల్ చానెల్, పైలట్ చానెల్‌లను పూర్తి చేసి.. 2021, జూన్ 11న 6.1 కిమీల పొడవున గోదావరి ప్రవాహాన్ని మళ్లించారు. ప్రపంచ చరిత్రలో నదీ సహజ ప్రవాహ దిశను ఇంత భారీ ఎత్తున మళ్లించడం ఇదే తొలి సారి.

ఎగువ కాఫర్ డ్యామ్

ప్రధాన డ్యామ్‌ను నిర్మించడానికి వీలుగా దానికి ఎగువన గోదావరికి అడ్డంగా 2480 మీటర్ల పొడవు, 42.5 మీటర్ల ఎత్తుతో కాఫర్ డ్యామ్ (మట్టి కట్ట) నిర్మించాలి. ఇది నిర్మిస్తే నీరు నిలుస్తుంది. ఇలా నిలవటం వల్ల పలు గ్రామాలు మునిగిపోతాయి. అందుకే ఈ ఎగువ కాఫర్ డ్యామ్ పూర్తయ్యేలోగా 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని ముంపు గ్రామాల నిర్వాసితులైన 20,946 కుటుంబాలకు పునరావాసం కల్పించాల్సి ఉంది. 2018లో ఎగువ కాఫర్ డ్యామ్ పనులు చేపట్టిన చంద్రబాబు... కేవలం రూ.484 కోట్లతో 3,110 కుటుంబాలకే పునరావాసం కల్పించారు. మిగతా 17,836 కుటుంబాలకు పునరావాసం కల్పించలేక.. ఈ మట్టికట్టకు కుడి వైపున 400 మీటర్లు, ఎడమ వైపున 400 మీటర్లు గ్యాప్‌లు వదిలేశారు. అలా... ఎగువ కాఫర్ డ్యామ్‌ను గాలికొదిలేశారు. అయితే సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక 41.15 మీటర్ల కాంటూర్ పరిధిలోని 8,567 కుటుంబాలకు రూ.1,677 కోట్లతో పునరావాసం కల్పించి.. 2021 నాటికే ఎగువ కాఫర్ డ్యామ్‌ను పూర్తి చేశారు.

దిగువ కాఫర్ డ్యామ్

ప్రధాన డ్యామ్ నిర్మాణానికి వీలుగా స్పిల్ వే నుంచి దిగువకు విడుదల చేసిన వరద నీరు ఎగదన్నకుండా అడ్డుకోవడానికి.. ప్రధాన డ్యామ్ నిర్మాణానికి దిగువన 1,655 మీటర్ల పొడవు... 30.5 మీటర్ల ఎత్తుతో లోయర్ కాఫర్ డ్యామ్ నిర్మించాలి. 2018లో చేపట్టిన చంద్రబాబు.. కుడి వైపు 680 మీటర్ల వెడల్పున ఖాళీ వదిలేశారు. 2019లో ఎగువ కాఫర్ డ్యామ్ గ్యాప్‌ల గుండా అధిక ఉద్ధృతితో గోదావరి ప్రవహించడం వల్ల దిగువ కాఫర్ డ్యామ్‌లో 0 నుంచి 680 మీటర్ల మధ్య ప్రాంతం కోతకు గురై 36 మీటర్ల లోతున భారీ అగాధం ఏర్పడింది. సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక.. సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ మార్గదర్శకాల మేరకు జియోమెంబ్రేన్ బ్యాగ్‌లలో ఇసుకను నింపి.. వాటిని అగాధంలో వేసి పూడ్చుతూ వైబ్రో కాంపాక్షన్ ద్వారా యథాస్థితికి తెచ్చి.. ఫిబ్రవరి 15 నాటికి దిగువ కాఫర్ డ్యామ్ పనులను పూర్తి చేశారు.

అప్రోచ్ చానెల్

నదీ ప్రవాహాన్ని స్పిల్ వే వైపు మళ్లించేలా 550 మీటర్ల వెడల్పుతో 2.310 కిమీల పొడవున అప్రోచ్ చానెల్ తవ్వాలి. స్పిల్ వే, స్పిల్ చానెల్ పూర్తయ్యే నాటికి ఈ పనులు పూర్తి చేయాలి. కానీ.. ఐదేళ్లలో అప్రోచ్ చానెల్ పనుల్లో చంద్రబాబు తట్టెడు మట్టి కూడా ఎత్తించలేదు. సీఎం వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చాక ఈ పనులు నూరుశాతం పూర్తి చేశారు.

ఈసీఆర్ఎఫ్ డ్యామ్ (ప్రధాన డ్యామ్)

దీన్ని మూడు భాగాలుగా... 2474.5 మీటర్ల పొడవున (గ్యాప్-1లో 584.5 మీటర్లు, గ్యాప్-2లో 1750 మీటర్లు, గ్యాప్-3లో 140 మీటర్ల పొడవు) 45.72 మీటర్ల గరిష్ఠ నీటి మట్టంతో నిర్మించాలి. దీన్ని నిర్మించాలంటే గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా అంటే.. అప్రోచ్ చానెల్, స్పిల్ వే, స్పిల్ ఛానెల్, పైలట్ చానెల్.. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పూర్తి చేశాక... డ్యామ్‌కు పునాది అయిన డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించాలి. దానిపై ప్రధాన డ్యామ్ పనులు చేపట్టాలి. కానీ.. చంద్రబాబు వరదను మళ్లించే పనులు పూర్తి చేయకుండా గ్యాప్-2లో 1396 మీటర్ల పొడవున డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించే పనులను బావర్ సంస్థకు నామినేషన్‌పై అప్పగించి... 2018 నాటికే పూర్తి చేసేశారు. 2019లో గోదావరికి భారీ వరదలు రావడం.. 2400 మీటర్ల వెడల్పుతో ప్రవహించాల్సిన గోదావరి ఎగువ కాఫర్ డ్యామ్ అడ్డంకిగా మారడం వల్ల.. దాని గ్యాప్‌ల గుండా 800 మీటర్లకు కుంచించుకుపోయి ప్రవహించడం వల్ల వరద ఉద్ధృతి పెరిగింది. ఆ ఉద్ధృతికి గోదావరి గర్భం కోతకు గురై.. డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. ప్రధాన డ్యామ్ నిర్మాణ ప్రాంతంలో నాలుగు చోట్ల గరిష్ఠంగా 35 మీటర్లు.. కనిష్ఠంగా 22 మీటర్ల లోతుతో భారీ అగాధాలు ఏర్పడ్డాయి. ప్రపంచంలో ఎక్కడా డయాఫ్రమ్ వాల్ దెబ్బతిన్న దాఖలాలు లేవు. చంద్రబాబు కక్కుర్తి కారణంగా తొలిసారి ఈ దారుణం చోటుచేసుకుంది. దీంతో డయాఫ్రమ్ వాల్ నష్టాన్ని పూడ్చడానికి నిపుణుల అధ్యయనం అవసరమైంది. ఒక వైపు డయాఫ్రమ్ వాల్‌ను సరిదిద్దడం, అగాధాలను పూడ్చడంపై సీడబ్ల్యూసీ, డీడీఆర్పీ, ఎన్‌హెచ్‌పీసీ, ఐఐటీలతో సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మేధోమథనం జరుపుతూనే... గ్యాప్-2లో 393 మీటర్ల పొడవున డయాఫ్రమ్ వాల్‌ను పూర్తి చేసింది. గ్యాప్-3లో 140 మీటర్ల పొడవున కాంక్రీట్ డ్యామ్‌ను సైతం పూర్తి చేసింది. గతనెల (మార్చి) 5న డయాఫ్రమ్‌వాల్‌ను సరిదిద్దడం, అగాధాలను పూడ్చటంపై డీడీఆర్పీ, సీడబ్ల్యూసీ కొన్ని మార్గదర్శకాలివ్వటంతో... వాటి ప్రకారం పనులు ఆరంభించి, ప్రధాన డ్యామ్‌ను పూర్తి చేసే దిశగా ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది.

రూ.20,398.61 కోట్లతోనే పూర్తి చేయడం ఎలా?

- పోలవరం నిర్మాణ బాధ్యతలను దక్కించుకున్న క్రమంలో చంద్రబాబు చేసిన ఇంకో ఘోరమైన తప్పిదమేంటంటే... 2013–14 నాటి ధరల ప్రకారం నిధులిస్తే చాలని 2016, సెప్టెంబరు 7న అంగీకరించడం.
- 2016, సెప్టెంబరు 26న పోలవరానికి నాబార్డు నుంచి రూ.1981.54 కోట్ల రుణాన్ని విడుదల చేస్తూ.. ఇకపై బడ్జెట్ ద్వారా కాకుండా నాబార్డు రుణం రూపంలోనే నిధులు విడుదల చేస్తామని కేంద్రం పెట్టిన మెలికకు తల ఊపింది కూడా చంద్రబాబే.
- 2016, సెప్టెంబరు 30న కేంద్ర ఆర్థిక శాఖ.. కేంద్ర జలశక్తి శాఖకు పంపిన మెమోరాండంలో 2014, ఏప్రిల్ 1 నాటికి నాటికి పోలవరం ప్రాజెక్టులో మిగిలిపోయిన నీటిపారుదల విభాగం పనులకయ్యే వ్యయాన్ని మాత్రమే చెల్లిస్తామని పునరుద్ఘాటించింది. పునరావాసాన్ని గాలికొదిలేసింది. ఈ నిర్ణయం తీసుకున్న కేంద్ర కేబినెట్ సమావేశంలో టీడీపీకి చెందిన మంత్రులు అశోక్ గజపతిరాజు, సుజనా చౌదరి కూడా ఉన్నా నోరు మెదపలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.
- ఇదే విషయాన్ని 2017, మే 8న రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర జల్ శక్తి శాఖ లేఖ ద్వారా తెలిపింది. కానీ దానికి చంద్రబాబు స్పందించలేదు.
- 2013–14 ధరల ప్రకారం సీడబ్ల్యూసీ ఆమోదించిన నీటిపారుదల విభాగం వ్యయం రూ.20,398.61 కోట్లు. ఇందులో ఏప్రిల్ 1, 2014 నాటికి చేసిన వ్యయం రూ.4,730.71 కోట్లను మినహాయిస్తే కేవలం రూ.15,667 కోట్లే ఇస్తామని కేంద్రం స్పష్టం చేసినా.. చంద్రబాబు దానికి అంగీకరించారు. 2017–18 ధరల ప్రకారం భూసేకరణ, నిర్వాసితుల పునరావాస వ్యయమే రూ.33,168.23 ఓట్లు. అలాంటిది కమీషన్ల మాయలో పడి కేవలం రూ.20,398 కోట్లిస్తే పూర్తి చేస్తామని చంద్రబాబు అంగీకరించటమే ప్రాజెక్టుకు శాపంగా మారింది.
- నిజానికి ఏ ప్రాజెక్టయినా కాలం గడుస్తున్న కొద్దీ ముందుగా అంచనా వేసిన వ్యయం పెరుగుతుంది. అది నాగార్జున సాగర్కైనా.. శ్రీశైలానికైనా కూడా!!. పోలవరానికీ అంతే. 2013–14లో ఉన్న ధరలు ఇప్పుడెందుకు ఉంటాయి? అన్నిరకాల సామగ్రి, లేబర్ చార్జీలు అప్పటితో పోలిస్తే రెట్టింపుకన్నా ఎక్కువే పెరిగాయి. కానీ చంద్రబాబు నాటి ధరల ప్రకారం నిధులిస్తే చాలని ఏకంగా లేఖ రాసేయటంతో... ఇప్పుడు తాజా ధరల ప్రకారం నిధులడిగిన ప్రతిసారీ కేంద్రం నాటి లేఖ ప్రస్తావనే తెస్తోంది. సవాలక్ష కొర్రీలు పెడుతోంది. ఇలా చంద్రబాబు చేసిన ద్రోహాన్ని... 'ఈనాడు' ఏనాడూ ప్రస్తావించకపోవటం అంతకన్నా పెద్ద ద్రోహం కాదా రామోజీ?
- 2017–18 ధరల ప్రకారం సీడబ్ల్యూసీ టీఏసీ ఆమోదించిన సవరించిన అంచనా వ్యయం రూ.55,656.87 కోట్లకు ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ ఇచ్చి.. నిధులు విడుదల చేయాలని గత 45 నెలలుగా ప్రధాని మోదీని, కేంద్ర ఆర్థిక శాఖ, జల్ శక్తి శాఖ మంత్రులను సీఎం వైఎస్ జగన్ కోరుతూ వస్తున్నారు.

క్లుప్తంగా...

నృసింహుని సేవలో హైకోర్టు సీజే



హైకోర్టు సీజే ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులకు స్వాగతం పలుకుతున్న అర్చకుడు

మంగళగిరి: మంగళగిరిలోని శ్రీలక్ష్మీ నృసింహ స్వామిని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశాంత్‌కుమార్ మిశ్రా దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలుత వీరికి ఆలయ ఈవో ఎ.రామకోటిరెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద ఆశీర్వచనాలు అందజేశారు.

ఏపీ నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా చలపతిరావు



ఆకుల చలపతిరావు



కె.వి.నరసింహారెడ్డి

సాక్షి, అమరావతి/లబ్బీపేట (విజయవాడ తూర్పు): ఆంధ్రప్రదేశ్ నర్సరీ గ్రోయర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా విశాఖపట్నానికి చెందిన ఆకుల చలపతిరావు ఎన్నికయ్యారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన నర్సరీ రంగ ప్రతినిధులు 110 మంది ఆదివారం విజయవాడలో సమావేశమయ్యారు. అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా పి.హరికృష్ణ(రైల్వే కోడూరు), కార్యదర్శిగా కె.వి.నరసింహారెడ్డి(దర్శి), సహాయ కార్యదర్శులుగా బి.రామారావు(కాకినాడ), ఎం.మన్మధరావు (పలాస), కోశాధికారిగా మన్నె శ్రీనివాసరావు(విజయవాడ), కో–ఆర్డినేటర్‌గా ఎంసీహెచ్.కాశేశ్వరరావు(కర్నూలు), ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా బి.అప్పారావు(విశాఖపట్నం), ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా కె.శారదావాణి(విజయవాడ), సీహెచ్.బ్రహ్మయ్య చౌదరి(గుంటూరు), బాల రవి (తిరుపతి), పీఆర్వోగా ఎస్.రాజ్‌కుమార్(విజయవాడ) ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు గోపాలం రవీంద్ర వ్యవహరించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆకుల చలపతిరావు మాట్లాడుతూ కార్యవర్గం మూడేళ్లు కొనసాగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో నర్సరీ రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. రెండు నెలల్లో పశ్చిమ బెంగాల్, తమిళనాడు ప్రాంతాలకు వన విజ్ఞాన యాత్రలు చేస్తామని, నర్సరీ రైతాంగానికి మేలు చేసేందుకు ఇంటిగ్రేటెడ్ నర్సరీ మార్కెట్ ఏర్పాటుకు కృషి చేస్తామని వివరించారు.

శ్రీవారి దర్శనానికి 30 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శనివారం అర్ధరాత్రి వరకు 75,510 మంది స్వామివారిని దర్శించుకున్నారు. హుండీలో రూ.3.69 కోట్లు సమర్పించారు. దర్శన టికెట్లు లేని భక్తులకు 30 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుల్లో సత్తా ఉంది

- విజయవాడలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేస్తా
- ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష



పీటీ ఉషను సన్మానిస్తున్న ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రతినిధులు

విజయవాడ స్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్‌లోని క్రీడాకారుల్లో పతకాలు సాధించే సత్తా పుష్కలంగా ఉందని ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐఓఏ) అధ్యక్షురాలు, రాజ్యసభ్య సభ్యురాలు పీటీ ఉష అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన పీటీ ఉష, శ్రీనివాస్ దంపతులను ఆదివారం ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్స్ అసోసియేషన్(ఏపీఏఏ) ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఏపీఏఏ కార్యదర్శి ఆకుల హైమ ఆధ్వర్యాన నోవాటెల్ హోటల్లో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పీటీ ఉష మాట్లాడుతూ విజయవాడలో సింథటిక్ ట్రాక్ లేకపోవడంతో ఇక్కడి క్రీడాకారులు శిక్షణ కోసం హైదరాబాద్, ఇతర ప్రాంతాలకు వెళ్తున్నారన్నారు. విజయవాడలో సింథటిక్ ట్రాక్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. సింథటిక్ ట్రాక్‌పై ప్రాక్టీస్ లేకపోవడం వల్లే మాస్కో ఒలింపిక్స్‌లో మెడల్‌ను చేజార్చుకున్నానని, తన పరిస్థితి నేటి తరం క్రీడాకారులకు రాకూడదని పీటీ ఉష అన్నారు. బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా మాజీ ఉపాధ్యక్షుడు కరణం పున్నయ్యచౌదరి, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సహాయ కార్యదర్శి ఆకుల రాఘవేంద్రరావు, ఏపీ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ, జూడో అసోసియేషన్ ప్రతినిధి నామిశెట్టి వెంకట్, సీనియర్ అథ్లెట్ సత్యగీత, పలు క్రీడాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సింహ వాహనంపై సీతాపతి

వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో వైభవంగా వార్షిక బ్రహ్మోత్సవాలు



సింహ వాహనంపై ఊరేగుతున్న సీతాపతికి నమస్కరిస్తున్న భక్తులు



సింహ వాహనంపై శ్రీరాముడు

ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట మండలం ఏకశిలానగరిలోని శ్రీకోదండ రామాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మూడవ రోజైన ఆదివారం వటపత్రశాయి అలంకారంలో కోదండ రాముడు భక్తులకు దర్శనమిచ్చారు. కేరళ వాయిద్యాలు, కోలాటాల నడుమ వేణుగాన నాథుడి గ్రామోత్సవం ఉత్సాహంగా సాగింది. రాత్రి 8 గంటల నుంచి 9.30 గంటల వరకు సింహ వాహనంపై సీతాపతి విహరించారు. భారీగా తరలివచ్చిన భక్తులకు అభయమిచ్చారు. టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరిపారు.

నేడు నవనీత కృష్ణాలంకారం :

శ్రీకోదండ రామాలయంలో సోమవారం ఉదయం 8.00 గంటలకు నవనీత కృష్ణాలంకారంలో స్వామి భక్తులకు దర్శనమివ్వనున్నారు. రాత్రికి హనుమంత వాహనంపై కోదండ రాముడు ఒంటిమిట్ట పుర వీధుల్లో ఊరేగనున్నారు.

పిట్టంత పిపీలికం

చీమ.. ఓ అల్పజీవి. కానీ.. ఒకప్పుడు పరిమాణంలో హమ్మింగ్ బర్డ్ అంత పెద్ద చీమలు పిపీలిక సామ్రాజ్యాన్ని ఏలాయట. ఇటీవల లభించిన చీమ శిలాజాన్ని బట్టి 47 మిలియన్ ఏళ్ల కిందట మహా భారీ చీమలు ఉండేవని శాస్త్రవేత్తలు తేల్చారు. చీమ జాతుల్లో ఏకంగా 30 ఏళ్లు జీవించేవి కూడా ఉండటం విశేషమే. కాగా.. చీమలు వేడి వాతావరణంలోనే జీవించడానికి ఇష్టపడతాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. వర్షాకాలం, శీతాకాలంలో చలికి తట్టుకోలేక మన ఇళ్లల్లోకి చొరబడి తలదాచుకుంటాయని.. వంటింట్లోని ఆహార పదార్థాలను దోచుకుపోతాయని వెల్లడించారు.

హమ్మింగ్ బర్డ్ సైజులో ఉండే చీమ శిలాజం గుర్తింపు

- డైనోసార్ల కాలం నుంచి చీమల జాతి మనుగడ
- డెన్మార్క్‌లో 99 మిలియన్ ఏళ్ల కిందటి చీమ నమూనా గుర్తింపు
- వెచ్చని వాతావరణమే వాటికి ఇష్టం
- చలికాలంలో ఇళ్లల్లోకి చొరబడి ఆహార అన్వేషణ
- నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జర్నల్ ప్రొసీడింగ్స్‌లో ప్రచురణ
- భూమిపై ప్రతి వ్యక్తికి 2.50 మిలియన్ల చీమలు
- రాణీ చీమ జీవిత కాలం 30 ఏళ్లు
- ఐరోపా, జపాన్, అమెరికాలలో అతిపెద్ద చీమల కాలనీ



హమ్మింగ్ బర్డ్ సైజులో ఉండే చీమ శిలాజం గుర్తింపు



సాక్షి, అమరావతి: అమెరికాలోని వయోమింగ్ రాష్ట్రంలో 47 మిలియన్ ఏళ్ల కిందట భారీ మాంసాహార చీమలు అక్కడి కాలనీలను పాలించినట్టు శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. హమ్మింగ్ బర్డ్ పరిమాణంలో ఉండే రాణి చీమ శిలాజాన్ని 2011లో కనుగొన్నారు. రెండు అంగుళాలకు పైగా సైజులో ఉన్న ఈ శిలాజాన్ని డెన్వర్ మ్యూజియం ఆఫ్ నేచర్ సైన్సెస్‌లో భద్రపరిచారు. అంతకు ముందు టైటానోమైర్మా జాతికి (2 అంగుళాల పొడవు, 16 సెంటీమీటర్ల రెక్కలు) చెందిన చీమ శిలాజాన్ని జర్మనీలో గుర్తించారు. చీమలు చల్లటి రక్తం (కోల్డ్ బ్లడెడ్) కలిగిన జాతికి చెందినవి. వాటి శరీర ఉష్ణోగ్రత పర్యావరణంలోని సూర్యరశ్మిపైనే ఆధారపడి ఉంటుంది. అందుకే.. అవి వెచ్చని వాతావరణంలో ఉండటానికే ఇష్టపడతాయి. గ్లోబల్ వార్మింగ్ చీమ జాతిని భయపెడుతున్నా.. కొంచెం తేమ ఉన్న ప్రాంతాల్లోనూ ఇవి మనుగడ సాగించగలుతున్నాయి. అందుకే శీతాకాలంలో (డిసెంబర్–జనవరి మధ్య) బయట చీమలు కనిపించవు. ఆహార పదార్థాలు ఉండే ఇళ్లలోకి చొరబడి జీవనం సాగిస్తాయి.

డైనోసార్లు అంతరించినా.. ఇవి బతికే ఉన్నాయ్

జీవుల్లో అత్యంత సంపన్నమైన (సోషల్ ఇంజనీరింగ్), శక్తివంతమైన సమూహాలలో చీమలకు ప్రత్యేక స్థానం ఉంది. భూగ్రహంపై డైనోసార్లు అంతరించిపోయినా.. వాటితో కలిసి జీవించిన చీమ జాతులు మాత్రం ఇప్పటికీ మనుగడ సాగిస్తున్నాయి. చీమలకు 130 మిలియన్ సంవత్సరాల చరిత్ర ఉందని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. మూడేళ్ల కిందట మయన్మార్‌లో 99 మిలియన్ సంవత్సరాల క్రితం 'హెల్ యాంట్' పేరుతో జీవించిన చీమ నమూనాను గుర్తించారు. ఇదే క్రమంలో భూమిపై చీమల సంఖ్యపై హాంకాంగ్ విశ్వవిద్యాలయం, జర్మనీలోని వుర్జ్‌బర్గ్‌లోని జూలియస్ మాక్సిమిలియన్ విశ్వవిద్యాలయ పరిశోధకులు అధ్యయనం చేశారు. ఇందులో భూమిపై 20 క్వాడ్రిలియన్ (20 వేల ట్రిలియన్) చీమలు ఉన్నట్టు నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జర్నల్ ప్రొసీడింగ్స్‌లో ప్రచురించింది. వీటి సంఖ్య గతంలో కంటే రెండు నుంచి 20 రెట్లు పెరిగినట్టు పేర్కొంది. ప్రపంచంలో ప్రతి వ్యక్తికి 2.5 మిలియన్ చీమల జనాభా ఉండటం గమనార్హం.

వీటి బరువు 12 మిలియన్ టన్నులు

ప్రపంచంలో సుమారు 12 వేల నుంచి 15 వేలకు పైగా రకాల చీమ జాతులను శాస్త్రవేత్తలు కనుగొన్నారు. అడవి పక్షులు, క్షీరదాల కంటే చీమల బరువు (చీమల బయోమాస్ 12 మిలియన్లు) ఎక్కువగా ఉంటుంది. ఇది మానవుల బయోమాస్‌లో దాదాపు 20 శాతం. బయోమాస్ అనేది జీవుల్లోని కర్బనాల మొత్తం బరువుగా కొలుస్తారు. చీమలు మొక్కల విత్తనాల పంపిణీలో నిర్ణయాత్మక పాత్ర పోషిస్తాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మానవ సంచార ప్రాంతాలతో పోలిస్తే అడవుల్లో, ఆశ్చర్యకరంగా శుష్క ప్రాంతాల్లో చీమలు సమృద్ధిగా పెరుగుతున్నాయి.

30 ఏళ్ల జీవన కాలం

చీమలు కందిరీగల నుంచి ఉద్భవించినట్టు పలు పరిశోధనల్లో తేలింది. పరిమాణంలో 0.07–2 అంగుళాల మధ్యలో ఉండే చీమలు అంటార్కిటికా, ఐస్‌ల్యాండ్, గ్రీన్‌ల్యాండ్ మినహా ప్రపంచంలోని ప్రతిచోట కనిపిస్తున్నాయి. మగ కార్మిక చీమల జీవిత కాలం మూడేళ్లలోపు (కొన్ని కార్మిక చీమలు స్వల్పకాలమే జీవిస్తాయి) ఉంటుంది. చీమల్లో కూడా తేనెటీగల మాదిరిగానే రాణీ చీమ కాలనీ స్థాపకురాలు. రాణి ఫలదీకరణం చేసిన తర్వాత కాలక్రమేణా మిలియన్ల గుడ్లు పెట్టగలదు. అమెరికాలోని ఇడాహోలోని తన సహజ నిర్మాణంలో ఓ రాణి చీమ 30 ఏళ్లపాటు నివసించింది. క్వీన్ బ్లాక్ గార్డెన్ చీమలు ల్యాబ్ సెట్టింగ్‌లలో 28 సంవత్సరాల వరకు జీవించినట్టు గుర్తించారు. మారికోపా హార్వెస్టర్ చీమకు 12 తేనెటీగలు కలిసి కఠినంగా కుట్టగలిగే సామర్థ్యం ఉంది. ఇది ప్రపంచంలోనే అత్యంత విషపూరితమైనదిగా భావిస్తారు. చీమల్లో ఆశ్చర్యకరంగా రెండు పొట్టలు ఉంటాయి. ఒకటి తన ఆహారం తీసుకోవడానికి, రెండోది ఇతర చీమలను పోషించడానికి (ట్రోఫాలాక్సిస్ ప్రక్రియ) ఉపయోగిస్తాయి.

ఏడాదిలో 50 టన్నుల మట్టి తరలింపు

చీమలు తమ శరీర బరువు కంటే 50 రెట్లు ఎక్కువ బరువును మోయగలవని అంచనా. చీమల జట్టు ఒక సంవత్సర వ్యవధిలో 50 టన్నుల మట్టిని ఒక ప్రదేశం నుంచి మరొక ప్రదేశానికి తరలిస్తుంది. ఇది ప్రకృతికి మేలు చేయడంలో వానపాముల కంటే ఎక్కువ ప్రాముఖ్యతను కలిగిఉందని పర్యావరణ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. చీమలకు ఊపిరితిత్తులు, సాధారణ శ్వాసకోశ వ్యవస్థ లేదు. శరీరంలోని రంధ్రాల వ్యవస్థను (స్పిరకిల్స్) శ్వాస పీల్చుకునేందుకు ఉపయోగిస్తాయి. అందుకే ఇవి నీటి అడుగులో 24 గంటల పాటు జీవించగలవు.

ఇదే అతిపెద్ద చీమల కాలనీ

ఐరోపా, జపాన్, అమెరికా అంతటా అతిపెద్ద చీమల కాలనీ వ్యాపించింది. తొలుత వీటిని మూడు ప్రత్యేక కాలనీలుగా భావించారు. ఇక్కడ అర్జెంటీనా చీమ జాతి ఒక్కటే ఉండటంతో మనుగడ కోసం ఒకదానితో మరొకటి పోరాడుకోవడానికి నిరాకరించడంతో కాలనీ చాలా పెద్దదిగా పెరిగినట్టు భావిస్తున్నారు. ఈ కాలనీ 3,750 మైళ్ల మేర విస్తరించి ఉందని.. అందులో 370 మిలియన్ చీమలు ఉన్నట్టు అంచనా వేస్తున్నారు.

అడుగున్నర అందాల పెయ్యదూడ



పుంగనూరు దూడతో స్వర్ణ కపిల ఆవు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట మండలం మోడేకుర్రు శివారు గొలకోటివారిపాలెం గ్రామానికి చెందిన గొలకోటి మాధవరావు ఇంట అడుగున్నర అందాల పెయ్యదూడ శనివారం రాత్రి జన్మించింది. ఫంక్షన్ సెట్టింగ్స్ ఆర్టిస్టు అయిన మాధవరావు వివిధ జాతుల ఆవులను పెంచుతుంటారు. 2019 అక్టోబర్ 28న ఓ కపిల ఆవుకు అరుదుగా ఉండే స్వర్ణ కపిల పెయ్య దూడ జన్మించి వార్తల్లోకి ఎక్కింది. ఆ స్వర్ణ కపిల ఆవు ఇప్పుడు 18 అంగుళాల పుంగనూరు పెయ్యదూడకు జన్మనిచ్చింది. ఈ అడుగున్నర అందాల పెయ్యదూడ అందర్నీ ఆకట్టుకుంటోంది.

–కొత్తపేట

వామ్మో.. 35 నాగులు!

- భయంతో చంపేసిన గ్రామస్తులు



దేగానిపల్లెలో గ్రామస్తులు చంపేసిన పాములు

బి.కొత్తకోట (అన్నమయ్య జిల్లా): ఇంటిముందు అరుగు బండ కింద 35 పాములు బయటపడ్డాయి. వీటిని చూసిన గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురై వాటిని చంపేశారు. ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. అన్నమయ్య జిల్లా బి.కొత్తకోట సమీపంలోని దేగానిపల్లెలో మంజు ఇంటివద్ద పొడవాటి అరుగు బండ ఉంది. దాని అడుగు నుంచి ఓ పాము బయటకు రాగా.. గమనించిన గ్రామస్తులు భయంతో చంపేశారు. ఆ తరువాత ఒకదాని వెంట మరొకటిగా పాములు రావడంతో గ్రామస్తులు బండను తొలగించి చూడగా.. మొత్తం 35 పాములు కనిపించడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. నివాస గృహాల మధ్య అరుగు బండకింద పాము గుడ్లు పెట్టగా.. వాటి నుంచి పిల్లలు బయటకొచ్చాయి. ఇవన్నీ నాగుపాము జాతికి చెందినవని గ్రామస్తులు తెలిపారు.

కర్నూలులో వాల్మీకుల భారీ ర్యాలీ

- తమను ఎస్టీలుగా గుర్తిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడంపై సీఎంకు కృతజ్ఞతలు



కర్నూలులో ప్రదర్శన చేస్తున్న వాల్మీకులు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రానికి క్షీరాభిషేకం చేస్తున్న మంత్రి గుమ్మనూరు, వాల్మీకులు

కర్నూలు (అర్బన్): వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేయడంపై కర్నూలు, నంద్యాల జిల్లాలోని వాల్మీకులు ఆదివారం సీఎంకి కృతజ్ఞతలు చెప్పేందుకు భారీగా ర్యాలీని నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ నుంచి జీజీ హాస్పిటల్ ఎదురుగా ఉన్న మహర్షి వాల్మీకి విగ్రహం వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అక్కడ సభలో మంత్రి గుమ్మనూరు జయరాం మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల అభివృద్ధిని ఆకాంక్షిస్తూ సీఎం జగన్ పాలన సాగుతుందన్నారు. 14 ఏళ్ల పాలనలో చంద్రబాబు వాల్మీకులకు చేసింది ఏమి లేదన్నారు. నాలుగేళ్ల పాలనలోనే ఎవ్వరూ తీసుకోని సాహసోపేతమైన నిర్ణయం తీసుకొని వాల్మీకులను ఎస్టీలుగా గుర్తిస్తూ అసెంబ్లీలో సీఎం జగన్ తీర్మానం చేశారని గుర్తు చేశారు. ఇందుకు వాల్మీకులందరూ ఆయనకు రుణపడి ఉంటారన్నారు. తనతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా పలువురు వాల్మీకి నేతలను వివిధ రకాల పదవుల్లో నియమించి రాజకీయంగా ఆ సామాజిక వర్గానికి గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, నగర మేయర్ బీవై రామయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్ర బోస్ తదితరులు పాల్గొన్నారు.

సందడిగా సింహాద్రి అప్పన్న కల్యాణం

- హాజరైన స్వరూపానందేంద్ర సరస్వతి



రథోత్సవంలో పాల్గొన్న స్వరూపానందేంద్ర సరస్వతి

సింహాచలం: చైత్రశుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి (సింహాద్రి అప్పన్న) వార్షిక కల్యాణోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. సింహగిరిపై నృసింహ మండపంలో ఏర్పాటు చేసిన భారీ వేదికపై కల్యాణ మహోత్సవాన్ని విశేషంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ముత్యాల తలంబ్రాలు, ప్రసాదాన్ని అందజేశారు. అంతకుముందు సింహగిరి మాడ వీధుల్లో స్వామివారి రథోత్సవాన్ని నిర్వహించారు. రథంలో వేంజేసిన స్వామిని విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దర్శించుకున్నారు. వారికి ఈవో వి.త్రినాథరావు స్వాగతం పలికారు. అనంతరం స్వరూపానందేంద్ర సరస్వతి మాట్లాడుతూ.. కరోనా తర్వాత శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేసి వార్షిక కల్యాణోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. ఈ నెల 23న జరిగే చందనోత్సవానికి కూడా లక్షలాది మంది భక్తులు వస్తారని.. ఈ కార్యక్రమాన్ని కూడా విజయవంతంగా నిర్వహించాలని సూచించారు.

గిరి బిడ్డల చెంతకే విద్య, పౌష్టికాహారం

- సత్ఫలితాలు ఇస్తున్న ఎన్ఆర్ఎస్‌టీ సెంటర్లు
- డ్రాపౌట్స్ మళ్లీ చదువు కొనసాగించేలా బ్రిడ్జ్ స్కూల్స్
- నెల్లూరు ఐటీడీఏ పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు

సాక్షి, అమరావతి: ప్రతి చిన్నారికి విద్య, పౌష్టికాహారం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. ముఖ్యంగా గిరిజన బిడ్డలకు చదువును చేరువ చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. ఇందులో భాగంగా గిరిజన సంక్షేమ శాఖ నాన్ రెసిడెన్షియల్ స్టూడెంట్ ట్రెనింగ్(ఎన్ఆర్ఎస్‌టీ) కార్యక్రమాన్ని రూపొందించింది. దీనిద్వారా మారుమూల గిరిజన కాలనీల్లోని పిల్లల చెంతకే వెళ్లి విద్యను బోధిస్తున్నారు. పౌష్టికాహారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని నెల్లూరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా గిరిజన కాలనీల్లో డ్రాపౌట్స్, బడి ఈడు పిల్లలు బడికి వెళ్లకపోవడం వంటి వివరాలు సేకరించారు. వారికోసం ప్రత్యేకంగా సమగ్ర శిక్ష సహకారంతో ఎన్ఆర్ఎస్‌టీ సెంటర్లు ఏర్పాటు చేశారు. నాలుగు గిరిజన కాలనీల్లో ఎన్ఆర్ఎస్‌టీ సెంటర్ల ద్వారా 96 మంది గిరిజన పిల్లలకు బ్రిడ్జి స్కూల్స్ నిర్వహిస్తున్నారు. ఆరు గిరిజన కాలనీల్లో 127 మంది పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నారు. ఈ కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తోందని గిరిజన సంక్షేమ అధికారులు చెబుతున్నారు.

అక్షరాస్యతకు ప్రాధాన్యం



గిరిజనుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తోంది. గిరిజన బిడ్డలకు చదువును చేరువ చేయడంపై ప్రత్యేక దృష్టిసారించింది. ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించేలా సమగ్రశిక్ష సహకారంతో ఎన్ఆర్ఎస్‌టీలను ఏర్పాటు చేశాం. గిరిజన కాలనీల్లో బడి ఈడు పిల్లలు, ప్రీ స్కూల్ పిల్లలను గుర్తించి వారి కాలనీల్లోనే ఎన్ఆర్ఎస్‌టీ సెంటర్లు ఏర్పాటు చేసి విద్యను బోధిస్తున్నాం. పౌష్టికాహారం అందిస్తున్నాం. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు డ్రాపౌట్ పిల్లలను గుర్తించి వారికి బ్రిడ్జి స్కూల్ నిర్వహిస్తున్నాం.

– డాక్టర్ రాణి మంద, ఐటీడీఏ ప్రాజెక్ట్ ఆఫీసర్, నెల్లూరు



నెల్లూరు ఐటీడీఏ పరిధిలో ఎన్ఆర్ఎస్‌టీ సెంటర్

గిరిజన ప్రాంతాల్లో ఎన్ఆర్ఎస్‌టీలు, లబ్ధిపొందుతున్న పిల్లల వివరాలు

మండలం	గ్రామం	పిల్లల సంఖ్య
వెంకటాచలం	కురిచెర్లపాడు	24
కొడవలూరు	తాళ్లమిట్ట	21
కొడవలూరు	వినాయకనగర్‌కాలనీ	15
నెల్లూరు రూరల్	సాత్ మోపూరు	22
నెల్లూరు రూరల్	ముళ్లమూడి	24
టి.పి.గూడూరు	కొత్తకోడూరు రోడ్డు	21

సరదాగా..

గూగుల్‌లో సౌకర్యాలు కట్..!

న్యూఢిల్లీ: గూగుల్‌లో ఉద్యోగమంటే ఎవరైనా ఎగిరి గెంతేస్తారు. అక్కడిచ్చే జీతం కంటే ఇతర సౌకర్యాల కోసం ఉద్యోగులు ఎగబడతారు. ఒక్కసారి ఆఫీసులోకి అడుగుపెడితే అన్నీ ఫ్రీయే. టీ, కాఫీ, కూల్‌డ్రింక్స్‌తో పాటు స్నాక్స్, లాండ్రీ సర్వీసు, మసాజ్ పార్లర్‌లే కాదు, తరచుగా కంపెనీ లంచ్‌లు కూడా ఉంటాయి. ఇప్పుడు ఆ సౌకర్యాలకి గూగుల్ కోత విధించింది. ఇక నుంచి స్నాక్స్, లంచ్‌లు, లాండ్రీ, మసాజ్ సర్వీసులు ఆఫీసులో ఉండవని ప్రకటించింది. ఇలా ఆదా చేసిన డబ్బుల్ని మరిన్ని కీలకమైన పరిశోధనలకు ఖర్చు పెడతామని గూగుల్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రూత్ పోరట్ చెప్పారు. ఇప్పటికే ఈ ఏడాది 12 వేల మంది ఉద్యోగులను తొలగిస్తామన్న గూగుల్ ఇప్పుడు ఇలా సౌకర్యాలు కూడా కట్ చేస్తూ ఉండడంతో ఉద్యోగుల్లో నిరాశ నెలకొంది.

చైనా కాలేజీల్లో 'లవ్ బ్రేక్'



బీజింగ్: వేసవి సెలవులు, పండగ సెలవులు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు వస్తే కాలేజీలకు సెలవులు ఇవ్వడం సర్వసాధారణం. కానీ చైనాలో కాలేజీలు విద్యార్థులు ప్రేమలో మునిగి తేలడానికి సెలవులు ఇచ్చారు. అవును.. నిజమే.. చైనాలో యువ జనాభా తగ్గిపోతున్న విషయం తెలిసిందే కదా. దశాబ్దాల తరబడి అయితే ఒక్కరు లేదంటే వద్దు అన్న ఆంక్షల చట్రంలో గడిపిన చైనీయులు ఇప్పుడు ప్రేమ, పెళ్లి, పిల్లలు అన్న పదాల పట్ల విముఖంగా ఉన్నారు. అందుకే నేటి తరంలో కాస్తయినా ప్రేమ భావనలు మొలకెత్తడానికి కొన్ని కళాశాలలు ఈ కొత్త ఆలోచన చేశాయి. ఏప్రిల్ అంటే వసంత కాలం. ఈ కాలంలో చెట్లన్నీ విరబూసి వాతావరణం అత్యంత ఆహ్లాదంగా ఉంటుంది. స్ప్రింగ్ సీజన్‌ని ఎంజాయ్ చేయడంతో పాటు లవ్‌లో కూడా పడండి అంటూ ఒక వారం రోజులు సెలవులు ప్రకటించాయి చైనా కాలేజీలు. ''ప్రకృతిని ప్రేమించండి. . ప్రేమిస్తే ఎంత కొత్తగా వింతగా ఉంటుందో అనుభూతి చెందండి.లైఫ్ ఎలా ఎంజాయ్ చేయాలో తెలుసుకోండి'' అని యువతకి ప్రేమించుకోవడానికి కొన్ని కాలేజీలు హాలీడేస్ ప్రకటించాయి. అలా ప్రేమలో పడ్డ జంటలైనా ఒక్కటై పిల్లల్ని కంటారని ప్రభుత్వం ఆశగా ఎదురు చూస్తోంది.


పుష్పవిలాపం...

మొక్కలు ఏడుస్తాయట! ● బాధ కలిగితే మాట్లాడకుంటాయట

నేనొక పూల మొక్క కడ నిల్చి చివాలున కొమ్మవంచి గోరానెడు నంతలోన విరులన్నియు జాలిగ నోళ్లు విప్పి మా ప్రాణము తీతువాయనుచు బావురుమన్నవి...

అని కరుణశ్రీ జంధ్యాల పాపయశాస్త్రి పుష్పవిలాపాన్ని ఆవేదనాభరితంగా పలికిన ఘంటసాల స్వరం హృదయాన్ని మెలిపెడుతుంది. సుందర సుకుమారమైన పూలను తాకడానికి కూడా మనసు రాదు. ఇప్పుడీ కొత్త అధ్యయన ఫలితాలు తెలుసుకుంటే చివాలున కొమ్మ కూడా వంచాలనిపించదు. ఎందుకంటే ఏదైనా బాధ కలిగితే మొక్కలు కూడా ఏడుస్తాయట. అంటే, బాధతో మూలుగుతాయి. తోటి మొక్కలతో ఆ బాధను పంచుకుంటాయి. మొక్కలకి ప్రాణం ఉంటుందని మనకిప్పటికే తెలుసు. మొక్కలకు ప్రాణం ఉంటుందని, వేడికి, చలికి, కాంతికి, శబ్దానికి, గాయానికి స్పందిస్తాయని ప్రఖ్యాత భారతీయ శాస్త్రవేత్త జగదీశ్ చంద్రబోస్ ప్రపంచానికి తొలిసారిగా వెల్లడించారు. అయితే మొక్కలు ఏడుస్తాయని, తమకే తెలిసిన భాషలో ఇతర మొక్కలతో మాట్లాడతాయని, బాధని పంచుకుంటాయని ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్ యూనివర్సిటీకి చెందిన శాస్త్రవేత్తల అధ్యయనంలో వెల్లడైంది. మొక్కలు చేసే ఈ శబ్దాలను కూడా శాస్త్రవేత్తలు మొట్టమొదటిసారిగా రికార్డు చేశారు. ఆ శబ్దం 'క్లిక్' మాదిరిగా ఉంటుంది. ఇంచుమించుగా పాప్‌కార్న్ వేయించేటప్పుడు చిటాపటా పేలుతూ ఉంటే వచ్చే శబ్దాల మాదిరిగా ఉంటాయి. అయితే ఈ శబ్దాలు చాలా హై ఫ్రీక్వెన్సీలో ఉండటం వల్ల వాటిని మనం నేరుగా వినలేం. అధ్యయన ఫలితాలను సైన్స్ జర్నల్ సెల్‌లో ప్రచురించారు. ''టొమాటో, పొగాకు వంటి మొక్కల నుంచి వచ్చే హై ఫ్రీక్వెన్సీ అల్ట్రాసోనిక్ శబ్దాలను రికార్డు చేశాం. గ్రీన్‌హౌస్ మొక్కల పెంపకంలో వాటి సైకలాజికల్ పారామీటర్లపై అధ్యయనం చేస్తూ ఈ శబ్దాలను కూడా రికార్డు చేశాం'' అని టెల్ అవీవ్‌లో మొక్కలపై అధ్యయనం చేసే ప్రొఫెసర్ లిలాచ్ హదానీ తాజా నివేదికలో వెల్లడించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్



నివేదిక ఏమి చెప్పిందంటే...

- టొమాటో, పొగాకు, గోధుమ, మొక్కజొన్న, కాక్టస్ వంటి మొక్కల నుంచి వచ్చే శబ్దాలను రికార్డు చేశారు.
- మొక్కలకి ఏదో ఒక బాధ కలిగిన సమయంలో ఎక్కువగా శబ్దాలు చేశాయి. కొన్ని మొక్కలకు ఐదు రోజులుగా నీళ్లు పొయ్యకపోతే, మరికొన్ని మొక్కల కాండం కత్తిరించినప్పుడు... ఇలా వాటికేదైనా బాధ కలిగినప్పుడే శబ్దాలు చేశాయి.
- బయట నుంచి ఎలాంటి శబ్దాలూ వినిపించని ఒక బాక్స్‌లో మొక్కల్ని ఉంచారు. వాటి నుంచి వెలువడే శబ్దాలను రికార్డు చేయడానికి అల్ట్రాసోనిక్ మైక్రోఫోన్లు, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, అల్గరిథమ్ టెక్నాలజీ వాడారు.
- మొక్కల నుంచి శబ్దాలు 20–250 కిలోహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీలో రికార్డయ్యాయి. కొన్నింటినుంచి శబ్దాలు 40–80 ఫ్రీక్వెన్సీలో కూడా వస్తున్నాయి. మనం 16 కిలోహెర్ట్జ్ ఫ్రీక్వెన్సీ శబ్దాలే వినగలం.
- మొక్కల శబ్దాలను గబ్బిలాలు, కీటకాలు వినగలవు.
- ఏ బాధా లేని మొక్కల నుంచి సగటున గంటకో శబ్దం వెలువడుతోంది. నీళ్లు లేక ఎండిపోతున్న, గాయపడ్డ మొక్కల నుంచి, కొమ్మలు విరిచేసి కాండాన్ని ముక్కలు చేసినప్పుడు గంటకు డజన్ల కొద్దీ శబ్దాలు వచ్చాయి.




ప్రయోగ రాకెట్ ల్యాండ్ అయిన దృశ్యం

ఆర్‌ఎల్‌వీ పరీక్ష విజయవంతం

సూళ్లూరుపేట/సాక్షి బెంగళూరు: గగన్‌యాన్ ప్రాజెక్టు పరిశోధనా పరీక్షల్లో భాగంగా రీయూజబుల్ లాంచ్ వెహికల్ అటనామస్ ల్యాండింగ్ మిషన్(ఆర్‌ఎల్‌వీ–ఎల్‌ఈఎక్స్) రాకెట్ ప్రయోగ పరీక్షలను భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) ఆదివారం విజయవంతంగా నిర్వహించింది. కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గ జిల్లా కుందాపురం సమీపంలోని ఏరోనాటికల్ టెస్ట్ రేంజ్(ఏటీఆర్)లో ఈ పరీక్ష చేపట్టారు. భారత వైమానిక దళానికి సంబంధించిన చినోక్ అనే హెలికాప్టర్ సహాయంతో ఆర్‌ఎల్‌వీ రాకెట్‌ను ఉదయం 7.10 గంటలకు సముద్ర మట్టానికి 4.5 కిలోమీటర్ల ఎత్తుకు తీసుకెళ్లి వదిలిపెట్టారు. ఆర్‌ఎల్‌వీ–ఎల్‌ఈఎక్స్‌లోని మిషన్ మేనేజ్‌మెంట్ కంప్యూటర్ కమాండ్ ఆధారంగా రాకెట్ తిరిగి 7.40 గంటలకు భూమిపై నిర్దేశిత ప్రాంతంలో క్షేమంగా ల్యాండయ్యింది. ముందస్తుగా సిద్ధం చేసి రూపొందించిన నేవిగేషన్, గైడెన్స్, నియంత్రణ వ్యవస్థల సహాయంతో ఈ మానవ రహిత లాంచింగ్ వాహనం ఎలాంటి ఆటంకం లేకుండా భూమిపైకి చేరింది. ఈ ప్రయోగంలో ఇస్రోతోపాటు డీఆర్‌డీవో, భారత వైమానిక దళం కూడా భాగస్వామిగా మారింది. ప్రపంచంలోనే మొదటిసారిగా హెలికాప్టర్ సహాయంతో ఆర్‌ఎల్‌వీ లాంటి రాకెట్‌ను ఆకాశంలో వదిలి, తిరిగి విజయవంతంగా భూమి మీదకు చేర్చిన ఘనత ఇస్రో శాస్త్రవేత్తలకే దక్కిందని ఇస్రో చైర్మన్ సోమనాథ్ వెల్లడించారు. ఆర్‌ఎల్‌వీ ప్రాజెక్టు నిర్వహణ బృందాన్ని ఆయన అభినందించారు. 2016 మే 23న ఆర్‌ఎల్‌వీ–టీడీ పేరుతో నిర్వహించిన ప్రయోగాత్మక పరీక్ష విజయవంతమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో 2024 ఆఖరుకు గగన్‌యాన్ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. పరీక్షను విజయవంతంగా నిర్వహించిన ఇస్రోకు ప్రధాని నరేంద్ర మోదీ అభినందనలు తెలియజేశారు.

కొత్తగా 3,824 కరోనా కేసులు



న్యూఢిల్లీ: దేశంలో కరోనా ఉధృతి మళ్లీ పెరుగుతోంది. ఆదివారం ఒక్కరోజే కొత్తగా 3,824 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. గత ఆరు నెలల్లో ఇవే ఒకరోజు అత్యధిక కేసులు కావడం గమనార్హం. కేంద్ర ఆరోగ్య శాఖ గణాంకాల ప్రకారం దేశంలో కరోనా యాక్టివ్ కేసుల సంఖ్య ప్రస్తుతం 18,389కు చేరుకుంది. దేశవ్యాప్తంగా ఇప్పటి దాకా 4,47,22,605 కరోనా పాజిటివ్ కేసులు రికార్డయ్యాయి. 5,30,881 మంది ఈ మహమ్మారి కాటుకు బలయ్యారు. మరోవైపు రికవరీ రేటు 98.77 శాతంగా ఉంది. 4,41,73,335 మంది కరోనా బారిన పడి, చికిత్సతో పూర్తిగా కోలుకున్నారు. కరోనా సంబంధిత మరణాల రేటు 1.19 శాతంగా రికార్డయ్యింది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు 220.66 కోట్ల కోవిడ్–19 వ్యాక్సిన్ డోసులను ప్రజలకు పంపిణీ చేసింది.



డేటా లీకేజీ ఉదంతం...

చాట్‌జీపీటీపై ఇటలీ నిషేధం

పారిస్: ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ చాట్‌బాట్ చాట్‌జీపీటీపై తాత్కాలిక నిషేధం విధిస్తూ ఇటలీ సంచలన నిర్ణయం తీసుకుంది. కఠినమైన యూరోపియన్ యూనియన్ డేటా పరిరక్షణ నియమాలను ఉల్లంఘించినందుకు ఈ చర్య తీసుకున్నట్టు సమాచారం. చాట్‌జీపీటీపై ఇలాంటి చర్య తీసుకున్న తొలి దేశం ఇటలీయే.

ఎందుకు?

యూజర్ల సంభాషణలు, చందాదారుల చెల్లింపులకు సంబంధించిన డేటా చాట్‌జీపీటీ ద్వారా లీకైందని ఇటలీ డేటా ప్రొటెక్షన్ అథారిటీ పేర్కొంది. అందుకే దాన్ని బ్లాక్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొంది. డేటా గోప్యతను చాట్‌జీపీటీ పూర్తిస్థాయిలో గౌరవించేదాకా నిషేధం కొనసాగుతుందని తెలిపింది. దాని మాతృసంస్థ ఓపెన్‌ఏఐ ఎలాంటి చట్టపరమైన ఆధారమూ లేకుండానే భారీ పరిమాణంలో వ్యక్తిగత డేటాను సేకరించి ప్రాసెస్ చేస్తోందంటూ విస్మయం వ్యక్తం చేసింది. ''పైగా డేటా సేకరిస్తున్న యూజర్లకు ఈ విషయాన్ని నోటిపై చేయడం లేదు. పైగా చాట్‌జీపీటీ కొన్నిసార్లు వ్యక్తులను గురించిన తప్పుడు సమాచారాన్ని పుట్టించి స్టోర్ చేస్తోంది. అంతేకాదు, యూజర్ల వయసును నిర్ధారించుకునే వ్యవస్థేదీ చాట్‌జీపీటీలో లేదు. కనుక అభ్యంతరకర కంటెంట్ పిల్లల కంటపడే రిస్కుంది. పైగా 13 ఏళ్ల కంటే తక్కువ వయసు చిన్నారుల కోసం ఫిల్టర్లేవీ లేకపోవడం తీవ్ర అభ్యంతరకరం'' అంటూ ఆక్షేపించింది. చాట్‌జీపీటీలో సాంకేతిక సమస్యలు కొత్తేమీ కాదు ఇతర యూజర్ల సబ్జెక్ట్ లైన్లు, చాట్ హిస్టరీ తదితరాలను కొందరు యూజర్లు చూసేందుకు వీలు కలుగుతుండటంతో సమస్యను సరిచేసేందుకు చాట్‌జీపీటీని కొంత కాలం ఆఫ్‌లైన్ చేస్తున్నట్టు మార్చి 20న ఓపెన్‌ఏఐ ప్రకటించడం తెలిసిందే. 1.2 శాతం మంది యూజర్లకు ఈ యాక్సెస్ లభించినట్టు విచారణలో తేలిందని సంస్థ పేర్కొంది.

20 రోజుల్లో నివేదించాలి

నిషేధం నేపథ్యంలో యూజర్ల డేటా గోప్యత పరిరక్షణకు ఏం చర్యలు తీసుకున్నదీ ఓపెన్‌ఏఐ నివేదించాల్సి ఉంటుంది. లేదంటే 2.2 కోట్ల డాలర్లు/మొత్తం వార్షికాదాయంలో 4 శాతం జరిమానాగా చెల్లించాల్సి ఉంటుంది. విద్యార్థుల్లో అలసత్వానికి కారణమవుతుందంటూ ప్రపంచ వ్యాప్తంగా పలు ప్రభుత్వ పాఠశాలలు, యూనివర్సిటీలు ఇప్పటికే చాట్‌జీపీటీని నిషేధించాయి.

పిట్ట కొంచెం రాత ఘనం

పుస్తకాన్ని రాసి ప్రచురించిన నాలుగేళ్ల బాలుడు ● గిన్నిస్ రికార్డులకెక్కిన సయీద్ రషీద్



అబుదాబి: పిట్ట కొంచెం కూత ఘనం అని సామెత. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కి చెందిన ఈ నాలుగేళ్ల బాలుడిని చూస్తే పిట్ట కొంచెం రాత ఘనం అని సామెత మార్చుకోవాలి. అబుధాబిలో ఉండే సయీద్ రషీద్ అనే నాలుగేళ్ల వయసున్న బాలుడు ఒక పుస్తకాన్ని రాయడంతో పాటు దానిని ప్రచురించి గిన్నిస్ వరల్డ్ రికార్డులకెక్కాడు. ఒక ఏనుగుకి, ఎలుగుబంటికి మధ్య ఏర్పడిన స్నేహానుబంధాన్ని కథగా మలిచాడు. ఆ పుస్తకం వెయ్యి కాపీల వరకు అమ్ముడైంది. గిన్నిస్ వరల్డ్ రికార్డు అధికారులు ఈ ఘనత సాధించిన అతి పిన్న వయస్కుడిగా సయీద్ రికార్డులకెక్కినట్టుగా ప్రకటించారు. సయీద్ ఈ పుస్తకం రాయడానికి ఎనిమిదేళ్ల వయసున్న అతని అక్క అయిదాబీ స్ఫూర్తిగా నిలిచిందని ఖలీజా టైమ్స్ వెల్లడించింది. ఇప్పటికే అయిదాబీ ఒక ప్రచురణ సంస్థను కూడా నడుపుతూ రికార్డులు సాధించింది. మొత్తమ్మీద ఫ్యామిలీలో అందరికీ పుస్తకాలంటే ఎంతో ఇష్టం కావడంతో ఈ అరుదైన ఘనత సాధించగలిగాడు.

సముద్ర జీవజాలానికి భూతాపం ముప్పు

- అంటార్కిటికాలో శరవేగంగా కరుగుతున్న మంచు
- సముద్రాల్లో అంతర్భాగాల్లో జల ప్రవాహాలకు ఆటంకం
- ఆక్సిజన్, పోషకాలు అంతరించిపోయే అవకాశం



ఆధునిక యుగంలో ప్రపంచవ్యాప్తంగా పెచ్చరిల్లుతున్న శిలాజ ఇంధనాల వినియోగం.. తద్వారా నానాటికీ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలు, భూతాపం. వీటివల్ల భూగోళంపై మానవాళి మనుగడకు ముప్పు ముంచుకొస్తోందని పరిశోధకులు హెచ్చరిస్తున్న సంగతి తెలిసిందే. కేవలం భూమిపై ఉన్న జీవజాలమే కాదు, సముద్రాల్లోని జీవులు సైతం అంతరించిపోయే ప్రమాదం ఉందని ఆస్ట్రేలియా సైంటిస్టులు నిర్వహించిన తాజా అధ్యయనంలో తేలింది. ఈ వివరాలను 'నేచర్' పత్రికలో ప్రచురించారు.

- ✔ ప్రపంచవ్యాప్తంగా కర్బన ఉద్గారాలు, ఉష్ణోగ్రతలు పెరిగిపోవడం అనేది యథాతథంగా కొనసాగితే అంటార్కిటికాలో మంచు మరింత కరిగి, ఆ మంచినీరంతా సముద్రాల్లోకి చేరుతుంది.
- ✔ కొత్త నీటి రాకతో సముద్రాల ఉపరితల జలంలో లవణీయత, సాంద్రత తగ్గిపోతుంది. ఈ పరిణామం సముద్ర ఉపరితలం నుంచి అంతర్భాగంలోకి జల ప్రవాహాన్ని నిరోధిస్తుందని పరిశోధకులు తేల్చారు. సాధారణంగా సముద్రాల్లో పైభాగం నుంచి లోపలి భాగంలోకి నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అంతర్భాగంలో కూడా ఒకచోటు నుంచి మరోచోటుకి జల ప్రవాహాలు నిరంతరం కొనసాగుతూ ఉంటాయి.
- ✔ మంచు కరిగి, కొత్త నీరు వస్తే సముద్రాల పైభాగం నుంచి 4,000 మీటర్ల(4 కిలోమీటర్ల) దిగువన నీటి ప్రవాహాలు తొలుత నెమ్మదిస్తాయి. ఆ తర్వాత పూర్తిగా స్తంభించిపోతాయి. ఎక్కడి నీరు అక్కడే నిలిచిపోతుంది.
- ✔ నీటి ప్రవాహం స్తంభిస్తే సముద్రాల్లో లోతున ఉండే ప్రాణవాయువు(ఆక్సిజన్), ఇతర పోషకాలు సైతం అంతమైపోతాయని సైంటిస్టు ప్రొఫెసర్ మాథ్యూ ఇంగ్లాండ్ చెప్పారు. దీంతో సముద్రాల్లోని జీవుల మనగడకు అవసరమైన వనరుల కొరత ఏర్పడుతుందని తెలిపారు. వాటి మనుగడ ప్రమాదంలో పడుతుందని వివరించారు. ఇదంతా మొత్తం సముద్ర జీవావరణ వ్యవస్థను దెబ్బతీస్తుందని వారు వెల్లడించారు.
- ✔ సముద్రాల్లో జలమట్టం పెరిగితే ఉపరితలంపై కొత్త నీటి పొరలు ఏర్పడుతాయి. దానివల్ల సముద్రాలు కార్బన్ డయాక్సైడ్‌ను శోషించుకోలేవు. అంతేకాకుండా తమలోని కార్బన్ డయాక్సైడ్‌ను వాతావరణంలోకి విడుదల చేస్తాయి. సముద్రాల నుంచి కర్బన ఉద్గారాలు ఉధృతమవుతాయి. ఫలితంగా భూగోళం మరింత వేడెక్కుతుంది.
- ✔ అంటార్కిటికాలో ప్రతిఏటా 250 ట్రిలియన్ టన్నుల చల్లని, ఉప్పు, ఆక్సిజన్‌తో కూడిన నీరు చేరుతుంది. ఇది ఉత్తర దిశగా విస్తరిస్తుంది. హిందూ, పసిఫిక్, అట్లాంటిక్ మహాసముద్రాల్లోకి ఆక్సిజన్‌ను చేరుస్తుంది. రానున్న రోజుల్లో అంటార్కిటికా నుంచి విస్తరించే ఆక్సిజన్ పరిమాణం తగ్గనుందని అంచనా వేస్తున్నారు.

+ ప్రపంచ కర్బన ఉద్గారాలను సమర్థంగా నియంత్రించకపోతే రాబోయే 40 సంవత్సరాల్లో అంటార్కిటికాలోని సముద్రాల కింది భాగంలో జల ప్రవాహం ఆగిపోతుందని, సముద్ర జీవుల మనుగడ ప్రశ్నార్థకమవుతుందని సైంటిస్టులు నిర్ధారించారు.

– సాక్షి, నేషనల్ డెస్క్

రెండేళ్ల జైలు శిక్షపై నేడు రాహుల్ అపీల్

సూరత్: పరువునష్టం కేసులో రెండేళ్ల జైలు శిక్షను కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ సవాలు చేయనున్నారు. సూరత్ మెట్రోపాలిటన్ కోర్టు తీర్పుపై స్థానిక సెషన్స్ కోర్టులో సోమవారం అపీలు దాఖలు చేయనున్నారు. 'మోదీ ఇంటిపేరు' వ్యాఖ్యలపై రాహుల్‌ను దోషిగా ఖరారు చేస్తూ చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ హెచ్‌హెచ్ వర్మ మార్చి 23న తీర్పు వెలువరించడం తెలిసిందే. వెంటనే బెయిల్ మంజూరు చేయడంతో పాటు తీర్పుపై అపీలుకు 30 రోజుల గడువు కూడా ఇచ్చారు. ఈ తీర్పు నేపథ్యంలో రాహుల్ లోక్‌సభ సభ్యత్వం కూడా రద్దవడం తెలిసిందే.

అల్లర్లకు పాల్పడ్డవారిని తలకిందులుగా ఉరి తీస్తాం

నితీశ్‌ది 'బ్యాడ్' సర్కారు ● బిహార్‌లో గెలిచేది మేమే: అమిత్ షా



హిసువా (బిహార్): బిహార్లో నితీశ్ కుమార్ సారథ్యంలోని మహా ఘట్‌బంధన్ సంకీర్ణాన్ని 'బ్యాడ్' (భ్రష్టాచార్–అవినీతి, అరాచకం, దమన్–అణచివేతలకు పాల్పడుతున్న) సర్కారుగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా అభివర్ణించారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ అనైతిక సంకీర్ణాన్ని బీజేపీ ఓడించి తీరుతుందని ధీమా వెలిబుచ్చారు. ఆదివారం బిహార్‌లోని నవడా జిల్లాలో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బిహార్‌లో మత హింసకు నితీశే కారకుడంటూ దుయ్యబట్టారు. రాష్ట్రంలో అరాచకం ప్రబలుతుంటే చూస్తూ ఊరుకోబోనన్నారు. ''పరిస్థితిపై నేను గవర్నర్‌తో మాట్లాడటాన్ని జేడీ(యూ) చీఫ్ లాలన్‌సింగ్ తప్పుబడుతున్నారు. నేను కేంద్ర హోం మంత్రినని ఆయన మర్చిపోవద్దు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో, తర్వాత రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ నెగ్గాక ఈ అల్లర్లకు పాల్పడ్డవారిని తలకిందులుగా ఉరి తీస్తాం'' అని హెచ్చరించారు.

77 మంది అదుపులో

బిహార్లో పలుచోట్ల మత ఘర్షణలు కొనసాగుతున్నట్టు సమాచారం. రామనవమి ఉత్సవాల సందర్భంగా నలంద జిల్లాలోని బిహార్ షరీఫ్‌లో జరిగిన హింసాకాండకు సంబంధించి ఇప్పటిదాకా 77 మందిని అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. పరిస్థితి అదుపులో ఉందన్నారు. శనివారం రాత్రి మరోసారి ఘర్షణలు తలెత్తిన నేపథ్యంలో 144 సెక్షన్ అమల్లోనే ఉన్నట్టు చెప్పారు. ససారాంలో శనివారం 45 మందిని అరెస్టు చేశారు.

మోదీ డిగ్రీలపై మరిన్ని అనుమానాలు: ఆప్

న్యూఢిల్లీ: ప్రధాని మోదీ విద్యార్హతలపై ఆమ్ ఆద్మీ పార్టీ ప్రశ్నల పరంపర కొనసాగుతూనే ఉంది. ఆయన డిగ్రీ సర్టిఫికెట్లు నిజమైనవో కాదో చెప్పాలని పార్టీ ఎంపీ సంజయ్‌సింగ్ ఆదివారం మరోసారి డిమాండ్ చేశారు. ''మోదీ విద్యార్హతలపై విచారణ జరిగి, అవి నకిలీవని తేలితే లోక్‌సభ సభ్యత్వం కోల్పోతారు. ఈసీకి తప్పుడు సమాచారం ఇచ్చినందుకు ఎన్నికల్లో పోటీకి అనర్హుడవుతారు'' అని గుర్తు చేశారు. ''ఈ అంశాన్ని ఆప్ తెరపైకి తెచ్చినప్పటి నుంచీ బీజేపీకి ఊపిరాడటం లేదు. మోదీ డిగ్రీలు నకిలీవి కావని నిరూపించేందుకు పడరాని పాట్లు పడుతోంది'' అంటూ ఎద్దేవా చేశారు. ''గుజరాత్ యూనివర్సిటీ నుంచి మోదీ ఎమ్మే పూర్తి చేశారంటూ సదరు డిగ్రీని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అప్పట్లో మీడియాకు చూపించారు. కానీ అందులో యూనివర్సిటీ స్పెలింగ్ యూనిబర్సిటీ అని తప్పుగా ఉంది. పైగా దానిపై మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ అని రాసిన ఫాంట్‌ను 1992లో ప్రవేశపెట్టారు. 1983లో ఎమ్మే పూర్తి చేసిన మోదీ సర్టిఫికెట్లపై అదెలా వచ్చినట్టు?'' అని ప్రశ్నించారు. స్కూలు చదువుతోనే ఆపేశానని గుజరాత్ సీఎంగా ఉండగా మోదీ చెప్పిన వీడియోను సింగ్ ప్రదర్శించారు.

అమెరికాలో మళ్లీ తుపాకీ గర్జన

నలుగురి మృతి.. ఆరుగురికి గాయాలు

ఒక్లహోమా: అమెరికాలో మళ్లీ తుపాకీ గర్జించింది. రెండు వేర్వేరు ఘటనల్లో నలుగురు మృత్యువాత పడ్డారు. ఆరుగురు గాయాల పాలయ్యారు. శనివారం రాత్రి సౌత్‌వెస్ట్ ఒక్లహోమా సిటీలో ఓ దుండగుని కాల్పుల్లో ముగ్గురు మరణించారు. లాస్ ఏంజెలెస్‌లో ఓ షాపింగ్ సెంటర్ బయట జరిగిన కాల్పుల్లో ఒకరు మృతిచెందారు.

ఈ గాలి.. ఈ నేల...

బాల్య స్మృతుల్లో కమలా హ్యారిస్



లుసాకా: అమెరికా ఉపాధ్యక్షురాలు కమల హ్యారిస్ జాంబియా వెళ్లి తన బాల్య స్మృతుల్లో మునిగిపోయారు. తన తాత, భారత్‌కు చెందిన పి.వి.గోపాలన్ ఇంట్లో చిన్నప్పుడు వారితో గడిపిన రోజుల్ని గుర్తు చేసుకున్నారు. 1960 దశకంలో కమల హ్యారిస్ తాత చెన్నై నుంచి జాంబియా రాజధాని లుసాకా వెళ్లి అక్కడ ఇండియన్ ఫారెన్ సర్వీసు అధికారిగా సేవలందించారు. అప్పట్లో తాము నివసించిన ఇల్లు ఇప్పుడు లేకపోయినా ఆ ప్రాంతానికి వెళ్లిన కమల అక్కడ మట్టి పరిమళాన్ని ఆస్వాదించారు. ''నా చిన్నతనంలో మా తాతయ్యతో గడిపిన రోజులు నాకెంతో విలువైనవి. ఈ ప్రాంతంలో నా బాల్యం గడిచింది. ఇప్పుడు మళ్లీ అక్కడే ఉన్నానన్న ఊహ ఎంతో మధురంగా ఉంది.బాల్య జ్ఞాపకాలు ఎప్పుడూ ఒక ఉద్వేగాన్ని ఇస్తాయి. ఇక్కడ్నుంచి మా కుటుంబం తరఫున ప్రతీ ఒక్కరికీ హాయ్ చెబుతున్నాను'' అని అంటూ కమలా హ్యారిస్ ఉద్విగ్నతకు లోనయ్యారు.

ఆన్సర్‌షీట్‌లో బాలీవుడ్ పాటలు ..!

చండీగఢ్: పరీక్షలు రాయడానికి కూర్చున్న ఆ స్టూడెంట్‌కు క్వశ్చన్ పేపర్ చూడగానే పగలే చుక్కలన్నీ కట్టకట్టుకుని కన్పించాయి. ఒక్కదానికీ ఆన్సర్ తెలియదు! ఏం చేయడమా అని తల పట్టుకున్నాడు. బాగా ఆలోచించి... బాలీవుడ్ పాటలన్నీ తీరుబడిగా ఒకదాని తర్వాత ఒకటి రాస్తూ పోయాడు. అలా ఆన్సర్ షీటు నిండా జవాబులకు బదులుగా పాటలే రాసేసి ఇచ్చాడు. చండీగఢ్‌లో ఒక స్కూలులో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన ఆన్సర్ షీట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సదరు విద్యార్థి ఆమిర్ ఖాన్ నటించిన సూపర్ హిట్ బాలీవుడ్ సినిమాలు త్రీ ఇడియట్స్‌లోని 'గివ్ మి సమ్ సన్‌షైన్...', పీకేలోని 'భగవాన్ హే కహా రే తూ...' అంటూ తన అవస్థకు అద్దం పట్టే పాటలే రాశాడు! దాంతో పేపర్‌ను దిద్దిన టీచర్ సున్నా మార్కులిచ్చింది. అయితే, 'మరిన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సింది' అంటూ చివరి పేజీలో సరదా కామెంట్ రాయడంతో నెటిజన్లు హాయిగా నవ్వుకుంటున్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో దీనిని విస్తృతంగా షేర్ చేస్తున్నారు.



కర్ణాటకలో దక్షిణ ప్రయాగగా పేరొందిన నంజనగూడు పట్టణంలో శ్రీకంఠేశ్వర ఆలయంలో ఆదివారం వార్షిక రథోత్సవంలో పాల్గొన్న వేలాది మంది భక్తులు

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
సోమవారం। 3। ఏప్రిల్। 2023



నేడు సబ్ స్టేషన్ ప్రారంభం

విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో నిర్మించిన కంటైనర్ సబ్‌స్టేషన్‌ను సోమవారం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. -8లో▸



దుర్గమ్మ సేవలో పీటీ ఉష

ఇంద్రకీలాద్రి: ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షురాలు పీటీ ఉష ఆదివారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈవో భ్రమరాంబ అమ్మవారి ప్రసాదాలు, పట్టువస్త్రాలను బహూకరించారు.

నేడు స్పందన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కలెక్టరేట్‌లో సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమం ప్రారంభమవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీ రావు తెలిపారు. మండల, డివిజన్ స్థాయిలోనూ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (సోమ)	సహరి (మంగళ)
విజయవాడ	6.20	4.48
మచిలీపట్నం	6.24	4.41
జగ్గయ్యపేట	6.28	4.41

న్యూస్‌రీల్

23 నుంచి కూచిపూడిలో శిక్షణ



విజయవాడ కల్చరల్: సేవ్ కూచిపూడి ఆర్టిస్ట్ సేవా సంస్థ, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 23 నుంచి ఐదు రోజులపాటు కూచిపూడి సంప్రదాయం అంశంగా శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు సేవ్ కూచిపూడి వ్యవస్థాపకురాలు పెద్దప్రోలు భావన తెలిపారు. శనివారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కూచిపూడిలోని సిద్ధేంద్రయోగి కళాక్షేత్రంలో నిర్వహించే శిబిరంలో సినీనటి, ప్రఖ్యాత కూచిపూడి నృత్య కళాకారిణి మంజూ భార్గవి తన సేవలను అందిస్తారన్నారు. కూచిపూడి సిద్ధేంద్రయోగి కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి మాట్లాడుతూ భావితరాలకు కూచిపూడి నాట్య సంప్రదాయ విలువలను తెలియజేయడానికి శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమాచార పోస్టర్‌ను రామలింగశాస్త్రి ఆవిష్కరించారు. మరిన్ని వివరాలకు 9676109017, 98490 78707లో సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి ఒంటిపూట బడులు

చిలకలపూడి(మచిలీపట్నం): పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు సోమవారం నుంచి 30వ తేదీ వరకు పాఠశాలలకు ఒంటిపూట బడులు నిర్వహించాలని డీఈవో తాహెరాసుల్తానా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించాలన్నారు. పదోతరగతి పరీక్ష కేంద్రాలు ఉన్న పాఠశాలల్లో తరగతులు ఉండవని తెలిపారు. ఈ పాఠశాలలు ప్రభుత్వ సెలవు దినాల్లో ఆరు రోజుల పాటు తరగతులు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. జిల్లాలోని డీవైఈవోలు, మండల విద్యాశాఖాధికారులు ఒంటిపూట బడులు నిర్వహించేలా పర్యవేక్షించాలని డీఈవో సూచించారు.

10న అప్రెంటిస్ మేళా

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): అప్రెంటిస్ మేళాను ఈ నెల 10వ తేదీన ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎం. కనకారావు తెలిపారు. అన్ని ప్రముఖ కంపెనీలకు చెందిన ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొని వారి పరిశ్రమల్లో అప్రెంటిస్‌ను పూర్తి చేసేందుకు అభ్యర్థులకు అవకాశం కల్పిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో అన్ని ట్రేడుల్లో ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటుగా ఒక సెట్ జిరాక్స్ పత్రాలు, పాస్‌ఫోర్ట్ ఫొటోతో 10వ తేదీ ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రమేష్ ఆస్పత్రి రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ఆవరణలో జరిగే మేళాకు నేరుగా హాజరు కావాల్సిందిగా కోరారు. ఇతర వివరాలకు 0866-2475575, 83094 42698, 77804 29468 నంబర్లలో సంప్రదించాల్సిందిగా ఆయన సూచించారు.

దుర్గమ్మ సేవలో జయేంద్రపురి స్వామిజీ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): బెంగళూరు శ్రీ కైలాస ఆశ్రమ మహాసంస్థానం పీఠాధిపతి జయేంద్రపురి మహా స్వామిజీ ఆదివారం ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన స్వామిజీకి ఆలయ ఈఓ భ్రమరాంబ, ఆలయ అర్చకులు సాదరంగా స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితులు స్వామిజీకి వేదస్వస్తి పలుకగా, ఆలయ ఈవో భ్రమరాంబ అమ్మవారి వస్త్ర ప్రసాదం, ప్రసాదాలను సమర్పించారు.

ప్రగతి ప్రస్థానం

- వెనువెంటనే పరిష్కారమవుతున్న సమస్యలు
- పల్లె చెంతకు సకల సౌకర్యాలు
- విద్య, వైద్యాభివృద్ధికి రాష్ట్ర సర్కారు పెద్దపీట
- రేపు రెండో వసంతంలోకి కొత్త జిల్లా



విజయవాడ స్వరాజ్య మైదానంలో శరవేగంగా జరుగుతున్న అంబేద్కర్ స్మృతివనం పనులు

చేరువైన పాలనతో అభివృద్ధి పరుగులు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ప్రజలకు మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాల పునర్విభజన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. 2022 ఏప్రిల్ 4వ తేదీన 50 మండలాలు ఉన్న ఉమ్మడి కృష్ణాజిల్లాను మూడు జిల్లాలుగా విభజించారు. 20 మండలాలతో ఎన్టీఆర్ జిల్లాను ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పడిన జిల్లా అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తోంది. ఇప్పటికే వాణిజ్య నగరంగా గుర్తింపు పొందిన విజయవాడ నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. గతంలో నగరంలో ఉన్నతాధికారుల క్యాంపు కార్యాలయాలు మాత్రమే ఉండేవి. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం మచిలీపట్నం వెళ్లాల్సి వచ్చేది. విజయవాడలో వీవీపీల తాకిడికి తోడు, సమావేశాలు ఇక్కడే జరుగుతుండటంతో అధికారులు అందుబాటులో ఉండేవారుకాదు.

అందుబాటులోకి జిల్లా కేంద్రం..

ప్రధానంగా తిరువూరు, మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గ ప్రజలకు గతంలో మచిలీపట్నం జిల్లా కేంద్రం చాలా దూరంలో ఉండేది.ఉదాహరణకు తిరువూరు నియోజకవర్గంలోని గంపలగూడెం మండల ప్రజలు మచిలీపట్నం వెళ్లాలంటే దాదాపు 180 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సి వచ్చేది. ప్రస్తుతం ఎన్టీఆర్ జిల్లా కేంద్రం విజయవాడ ఏర్పాటు చేయడంతో ప్రజలకు పాలన చేరువ అయ్యింది.

అసాధారణ నిర్ణయం..

వైఎస్ జగన్ ప్రజాసంకల్పయాత్రలో భాగంగా 2018 ఏప్రిల్ 30న దివంగత ఎన్టీ రామారావు స్వస్థలం కృష్ణా జిల్లా నిమ్మకూరులో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఎన్టీఆర్ జిల్లాగా పేరు పెడతానని చెప్పారు. ఎన్టీ రామారావు వైఎస్సార్ సీపీ నేత కాదు, ఆయన స్థాపించిన తెలుగుదేశం పార్టీతో ఇప్పుడు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ఢీ కొడుతున్నారు. అయినప్పటికీ కృష్ణా జిల్లాలో పుట్టిన ఎన్టీఆర్ సినీ రంగంలోనూ, రాజకీయాల్లోను వెలుగొందారు. అందుకే రాజకీయాలకతీతంగా జిల్లాకు ఆయన పేరు పెట్టడం సముచితమని భావించి సీఎం ఆ ప్రకటన చేశారు. దానిని అమలు చేసి చూపించారు.



విజయవాడ కృష్ణలంకలో రెండో దశ రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు

జిల్లా జనాభా	: 22.18లక్షలు
విస్తీర్ణం	: 3,316 చ.కి.మీ.
మండలాల సంఖ్య	: 20
గ్రామాలు	: 321
కార్పొరేషన్	: 01 (విజయవాడ)
మున్సిపాలిటీలు	: 05
పంచాయతీలు	: 288
ఓటర్లు	: 16,31,883
పురుష ఓటర్లు	: 8,11,573
స్త్రీలు	: 8,35,850

పర్యాటకంపై ఫోకస్..

ఎన్టీఆర్ జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధిపైన ప్రత్యేక దృష్టి సారించారు. మూలపాడు వద్ద బటర్‌ఫ్లై పార్కును అందంగా తీర్చిదిద్దారు. ఇక్కడ 52 రకాల సీతాకోక చిలుకలు ఉన్నట్లు గుర్తించారు. పర్యాటకులకు ఆహ్లాదం పంచే విధంగా నక్షత్ర వనాలు, మౌలిక వసతులు కల్పించారు. కొండపల్లి బొమ్మల పరిశ్రమకు మరింత ప్రాచుర్యం లభించేలా చర్యలు తీసుకున్నారు. స్వరాజ్య మైదానంలో 18.18 ఎకరాల్లో రూ.248 కోట్లతో అంబేడ్కర్ స్మృతి వనం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఇందులో ఏర్పాటు చేసే 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలువనుంది.

జాతీయ రహదారుల పనులు వేగంగా..

విజయవాడ వెస్ట్ బైపాస్‌కు సంబంధించి చిన్న అవుటుపల్లి-గొల్లపూడి మధ్య పనులు శరవేగంగా సాగుతున్నాయి. కృష్ణా నదిపై వంతెన పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. హైదరాబాద్ హైవేకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పనులు తుది దశకు చేరాయి. గ్రీన్‌ఫీల్డ్ హైవే (విజయవాడ-ఖమ్మం) కు సంబంధించి భూసేకరణను వేగవంతం చేశాం. తూర్పు బైపాస్‌కు సంబంధించి డీపీఆర్ సిద్ధం చేస్తున్నారు.

పేదలందరికీ ఇళ్లు..

జిల్లాలో తొలిదశలో 83,723 మంది పేద లబ్ధిదారులకు ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 21,954 ఇళ్లు పురోగతిలో ఉన్నాయి. 12,264 ఇళ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయి. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యం మేరకు పనులు 97శాతం మేర పూర్తయ్యాయి. నాడు-నేడు కింద రూ.257 కోట్లతో 598 పనులు చేపట్టారు. ఆస్పత్రులకు సంబంధించి రూ. 46.31కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. 1084 ప్రభుత్వ భవన నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. జిల్లాలో 29 గ్రామాల్లో రీ సర్వే పూర్తి చేశారు.

ముంపు కష్టాలకు చెక్..

విజయవాడ వాసులను కృష్ణానది ముంపు బారి నుంచి రక్షించేందుకు వీలుగా రక్షణ గోడలు నిర్మించారు. వారధినుంచి కోటి నగర్ వరకు రూ.123 కోట్లతో రిటైనింగ్ వాల్ పనులు పూర్తి చేశారు. వారధి నుంచి పద్మావతి ఘాట్ వరకు రక్షణ గోడ నిర్మాణం రూ.135 కోట్లతో శరవేగంగా జరుగుతున్నాయి. ప్రకాశం బ్యారేజీ ఎగువ ప్రాంతంలో రూ.102 కోట్లతో డ్రెడ్జింగ్ పనులు చేపట్టాం. రూ.62 కోట్లతో మునేరు కాల్వల ఆధునికీకరణ పనులు చేపట్టారు.విజయవాడలో కాలువలపై రూ.31కోట్లతో ఏడు బ్రిడ్జిలను నిర్మించారు.

మాలాంటి వారికి ఎంతో ప్రయోజనం..



కొత్త జిల్లాల ఏర్పాటు కారణంగా మాలాంటి మధ్యతరగతి వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంది. గతంలో జిల్లా కార్యాలయంలో పని ఉంటే నందిగామ ప్రాంతం నుంచి మచిలీపట్నం వెళ్లవలసి వచ్చేది. ప్రస్తుతం కొత్త జిల్లా ఏర్పాటుతోపాటు, నందిగామను డివిజన్‌గా ఏర్పాటు చేశారు. ఇప్పుడు డివిజన్ కార్యాలయానికి వెళ్తే సరిపోతుంది.

– దేవినేని నాగేశ్వరరావు, కొండూరు, నందిగామ మండలం

దూరాభారం తగ్గింది..



ఎన్టీఆర్ జిల్లాగా ఏర్పడడంతో దూరం భారం బాగా తగ్గింది. గతంలో ఉమ్మడి కృష్ణాజిల్లాగా ఉన్నప్పుడు పనులు కోసం జిల్లా కేంద్రం మచిలీపట్నం వెళ్లాల్సి వచ్చేది. జగ్గయ్యపేట నుంచి సుమారు 150 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేయాల్సి వచ్చేది. జిల్లాల విభజన తరువాత అటువంటి పరిస్థితులు లేవు. విజయవాడ వెళ్తే సరిపోతుంది. సమయం ఆదాతోపాటు శ్రమ కూడా తగ్గింది.

– కనగాల రమేష్, మక్కపేట

ప్రజలకు మరింత చేరువగా..



కొత్త జిల్లా ఏర్పాటుతో ప్రజలకు పాలన మరింత చేరువైంది. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరిస్తున్నాం. ప్రధానంగా రెవెన్యూ సమస్యలపై ఫోకస్ పెట్టాం. ప్రజలకు స్నేహ పూర్వక వాతావరణం కల్పిస్తున్నాం. గ్రామ సచివాలయాలు కూడా బాగా ఉపయోగపడుతున్నాయి. స్పందన, జగనన్న గృహ నిర్మాణాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం.

– ఎస్. ఢిల్లీరావు, కలెక్టర్, ఎన్టీఆర్ జిల్లా

నృత్యోత్సవం.. నయనమనోహరం



నాట్యం చేస్తున్న చిన్నారులు

విజయవాడ కల్చరల్: భారతీయ సంప్రదాయ నృత్యరీతులు కనువిందు చేశాయి. భరతనాట్యం, కూచిపూడి, జానపదం నృత్యాలను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. జయహో భారతీయం, లింక్‌ఫీడ్స్ ఆధ్వర్యంలో తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆదివారం పది గంటలపాటు చిన్నారులు అనేక సంప్రదాయ నృత్యరీతులను ప్రదర్శించారు. ఉభయ తెలుగు రాష్ట్రాలోని 70 బృందాలు, 600 మంది కళాకారులు నృత్యోత్సవంలో పాల్గొన్నాయి. నాట్యాచార్యులు ఘంటసాల పవన్‌కుమార్, అంతర్జాతీయ నాట్యాచార్యుడు సప్పా శివకుమార్, మోహన్‌రాజు, యల్లాజోస్యుల అనూరాధ, వెంకటలక్ష్మి, రంగమణి, తూనుగుంట్ల శైలజ బృందాలతోపాటు అనేక బృందాలు పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఏపీ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ డాక్టర్ పీపీకే రామాచార్యులు, ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రక్షణ దళం కమాండెంట్ డాక్టర్ కేఎస్ రావు, పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు తదితరులు ప్రసంగించారు. నృత్యోత్సవంలో పాల్గొన్న చిన్నారులకు నాట్యసిరి పురస్కారాలు, నాట్యాచార్యులకు నాట్యరత్న పురస్కారాలతో సత్కరించారు.

200 మంది జైభీం దీక్ష స్వీకరణ



డీసీపీ సత్తిబాబు సమక్షంలో జైభీం దీక్ష ధారులు

అవనిగడ్డ: అంబేడ్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి దళితవాడలో జైభీం దీక్షలు చేపట్టేలా చైతన్యం తీసుకురావాలని విజయవాడ డీసీపీ మోకా సత్తిబాబు సూచించారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ మండలంలోని పాత ఎడ్లంకలో మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ ఆధ్వర్యంలో 200 మంది ఆదివారం జైభీం దీక్ష స్వీకరించారు. భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బేతాల సుదర్శనం వారికి పంచశీల కండువాలు కప్పి దీక్షలు ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డీసీపీ సత్తిబాబు మాట్లాడుతూ.. అంబేడ్కర్ జీవితం అన్ని వర్గాలకు ఆదర్శనీయమని, ఎన్నో కష్టాలు ఎదుర్కొన్నా, ఎన్ని ఒడుదొడుకులు వచ్చినా నైతిక విలువలతో జీవితం సాగించారని పేర్కొన్నారు. జైభీం దీక్ష తీసుకున్న వారంతా అంబేడ్కర్ సూచించిన మార్గంలో పయనించి సమాజానికి ఆదర్శనీయంగా నిలవాలన్నారు. మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బేతాల శరత్, రిటైర్డ్ ఈఓపీఆర్‌డీ దాసి సీతారామరాజు పాల్గొన్నారు.

జయోత్సాహం



క్రైస్తవుల జయోత్సాహ నినాదాలతో వీధులు మార్మోగాయి. హోసన్నా జయం.. రాజుల రాజుకే జయం.. క్రీస్తు రాజుకే జయం అంటూ ఈత మట్టలతో ర్యాలీలు నిర్వహించారు. ఏసుక్రీస్తు తాను సిలువపై ప్రాణార్పణ చేయడానికి ముందు ఇశ్రాయేలు దేశంలోని జెరూషలేంలో ప్రవేశించిన రోజును స్మరిస్తూ క్రైస్తవులు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టారు. చర్చిల్లో ప్రార్థనలు చేశారు. అనంతరం పిల్లలు పెద్దలు వీధుల్లో ఈత మట్టలు, ప్లకార్డులు చేత పట్టుకొని ర్యాలీ నిర్వహించారు. విజయవాడ బందరురోడ్డులో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులను చిత్రంలో చూడొచ్చు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

నేటి నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

నందిగామ: జిల్లాలో ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు జిల్లా కో ఆర్డినేటర్ నక్కా బాబూరావు తెలిపారు. సోమవారం నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఆదివారం పట్టణంలోని పలు పరీక్షా కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓపెన్ టెన్త్ కోసం ఎన్టీఆర్ జిల్లాలో 8 పరీక్ష కేంద్రాలు, ఇంటర్ కోసం జిల్లాలో 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల్లో ఓపెన్ టెన్త్ 1625 మంది, ఇంటర్‌కు 3102 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షలు మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు జరుగుతాయన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం ముందు జాగ్రత్తగా అవసరమైన అన్ని చర్యలు తీసుకుందని చెప్పారు. నందిగామలో ఓపెన్ టెన్త్ కోసం రెండు సెంటర్లు, ఇంటర్ విద్యార్థుల కోసం మూడు సెంటర్లు ఏర్పాటు చేశామన్నారు. జగ్గయ్యపేటలో పదో తరగతి విద్యార్థులకు ఒకటి, ఓపెన్ ఇంటర్ విద్యార్థులకు 3, పెనుగంచిప్రోలులో ఓపెన్ టెన్త్ విద్యార్థులకు ఒకటి , ఇంటర్ విద్యార్థుల కోసం ఒకటి చొప్పున సెంటర్లో ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఆయా కేంద్రాలకు అవసరమైన సిబ్బందిని సిద్ధం చేశామన్నారు.

ఉత్సాహంగా 'అహింసా రన్'



రన్‌ని ప్రారంభిస్తున్న పీటీ ఉష, చిత్రంలో ఎమ్మెల్యే వెలంపల్లి, మేయర్ భాగ్యలక్ష్మి తదితరులు

విజయవాడ స్పోర్ట్స్: జైన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఆర్గనైజేషన్(జితో) నిర్వహించిన 'అహింసా రన్' ఉత్సాహభరితంగా సాగింది. విజయవాడ ఇందిరాగాంధీ మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియంలో ఆదివారం ఉదయం జరిగిన ఈ రన్‌ను ఇండియన్ ఒలింపిక్ అసోసియేషన్ (ఐవోఏ) అధ్యక్షురాలు, రాజ్యసభ సభ్యురాలు పి.టి.ఉష ప్రారంభించారు. పలు వయసుల కేటగిరీలలో స్త్రీ, పురుషులకు జరిగిన 3కే, 5కే, 10కే రన్‌కు కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల నుంచి 1,950 మంది క్రీడాకారులు, క్రీడాభిమానులు ప్రాతినిధ్యం వహించారు. ఐజీఎంసీ స్టేడియం నుంచి బెంజిసర్కిల్‌కు చేరుకుని అక్కడ యూటర్న్ తీసుకుని తిరిగి బందరు రోడ్డు వెంబడి పీసీఆర్ జంక్షన్, వినాయకుడి గుడి వద్దకు చేరుకుని మరలా అక్కడ యూ టర్న్ తీసుకుని బందరు రోడ్డు వెంబడి ఐజీఎంసీ స్టేడియం వరకు ఈ రన్ సాగింది. ఈ పోటీల్లో విజేతలకు పి.టి.ఉష, రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని, ఎమ్మెల్యే మల్లాది విష్ణు ట్రోఫీలు, నగదు బహుమతులు అందజేశారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్, వీఎంసీ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా, డీసీపీలు మేరీ ప్రశాంతి, విశాల్‌గున్ని పాల్గొన్నారు. జితో విజయవాడ చాప్టర్ ఫౌండర్ చైర్మన్ రమేష్‌జైన్, విజయవాడ చాప్టర్ చైర్మన్ అశోక్, కార్యదర్శి మనీష్ దోషి, ఆంధ్రప్రదేశ్ అథ్లెటిక్ అసోసియేషన్ కార్యదర్శి ఆకుల హైమ, అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సహాయ కార్యదర్శి ఆకుల రాఘవేంద్రరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



రన్ లో పాల్గొన్న ఔత్సాహికులు

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన రెండు జిల్లాల అధికారులు
- కృష్ణా జిల్లాలో హాజరుకానున్న 22,636 మంది విద్యార్థులు
- 143 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- ఎన్టీఆర్ జిల్లాలో హాజరుకానున్న 30,134 మంది విద్యార్థులు
- 154 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు

పరీక్షా సమయం



కంకిపాడు పరీక్ష కేంద్రంలో బెంచీలపై స్టిక్కర్లు అంటించి నంబర్లను రాస్తున్న ఉపాధ్యాయిలు

కంకిపాడు(పెనమలూరు): పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పరీక్షల నిర్వహణకు విద్యాశాఖ సర్వం సిద్ధం చేసింది. పరీక్ష కేంద్రాలను సిద్ధం చేయటంతో పాటుగా, మౌలిక వసతుల కల్పించి విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టింది. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థుల రోల్ నంబర్ల ఆధారంగా స్టిక్కర్లను అంటించి టేబుల్స్‌ను సిద్ధం చేశారు. పాఠశాల గోడలపై ఉన్న సాంఘిక శాస్త్రం, సామాన్యశాస్త్రం, రసాయనశాస్త్రాలకు సంబంధించిన మ్యాప్‌లు కనిపించకుండా పేపర్లతో మూసివేశారు.

నిమిషం ఆలస్యమైనా..

కృష్ణాజిల్లా వ్యాప్తంగా 143 పరీక్ష కేంద్రాలు, ఎన్టీఆర్ జిల్లాలో 154 పరీక్ష కేంద్రాలను పరీక్షల నిర్వహణకు సిద్ధం చేశారు. కృష్ణా జిల్లాలో 22,636 మంది విద్యార్థులు, ఎన్టీఆర్ జిల్లాలో 30,134 మంది పరీక్షలకు హాజరుకానున్నారు. రెండు జిల్లాల్లో 2,918 మంది సిబ్బందిని నియమించారు. విద్యార్థులను ఉదయం 8.45 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తారు. 9.30 గంటల తరువాత ఒక్క నిమిషం ఆలస్యం అయినా పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు.

మెరుగైన ఫలితాల సాధనకు ప్రత్యేక ప్రణాళిక..

ఈ విద్యాసంవత్సరం మెరుగైన ఫలితాలను సాధించేందుకు విద్యాశాఖ ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్లింది. 2019-20లో కోవిడ్ కారణంగా విద్యార్థులను పూర్తి స్థాయిలో ఉత్తీర్ణులను చేశారు. 2020-21లోనూ ఇదే కొనసాగింది. 2021-22 విద్యాసంవత్సరంలో 54,666 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 35647 మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణత 65.71 శాతంగా నమోదైంది. ఈ దఫా మెరుగైన ఫలితాలను ఆశిస్తూ పది విద్యార్థులకు త్వరితగతిన సిలబస్ పూర్తి చేశారు. ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సన్నద్ధం చేశారు. ప్రత్యేక తరగతుల నిర్వహణ సమయంలో విద్యార్థులకు పౌష్టికాహార లోపాలను నివారించేందుకు స్నాక్స్‌ను కూడా జిల్లా పరిషత్ నుంచి సమకూర్చారు. స్టడీ మెటీరియల్స్, టైంటేబుల్ ప్రకారం విద్యాబోధన సాగించటంతో ఈ దఫా మెరుగైన ఫలితాలు సాధిస్తామని జిల్లా విద్యాశాఖ బృందం గట్టి నమ్మకంతో ఉంది.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం


జనార్ధనపురంలో పిడుగుపాటుకు కాలిపోతున్న వరి గడ్డి వామి


పెడసనగల్లుపాలెంలో తడిసి ముద్దయిన పచ్చి ఇటుకలు

మొవ్వ: కృష్ణా జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. సాయంత్రం వేళ ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. ఆకాశం మేఘావృతమై గంటకు పైగా వర్షం కురిసింది. మొవ్వ మండలంలో మొక్కజొన్న, అరటి తోటలు నేలకు ఒరిగాయి. సుమారు గంటకు పైగా పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఇటుక బట్టీలకు తీవ్ర నష్టం వాటిల్లింది. పెడసనగంటి పాలెం శివారులో ట్రాపు వద్ద గల పెదపూడి కోటేశ్వరరావుకు చెందిన ఇటుకల బట్టీలో 32 వేల అచ్చువేసిన రాయి (పచ్చి రాయి) వర్షానికి తడిసి ముద్దయింది. సుమారు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని బట్టీ నిర్వాహకులు తెలిపారు.

పెదమద్దాలి(పామర్రు): ఉరుములు మెరుపులతో పాటు కురిసిన వర్షానికి పిడుగు పడటంతో గ్రామంలో రెండు చూడి గేదెలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన చందోలు స్వర్ణ తన పశువులను మేపుకునేందుకు పొలం వెళ్లింది. ఇదే ప్రాంతంలో పిడుగు పడటంతో అక్కడే ఉన్న రెండు చూడి గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షలు ఉంటాయని స్వర్ణ వాపోయింది. ఈదురు గాలులకు చెట్ల కొమ్మలు నేలకొరిగాయి.

గుడివాడటౌన్: పట్టణంలో కురిసిన భారీ వర్షానికి జనం భీతిల్లిపోయారు. పిడుగుపాటుకు గుడ్‌మేన్ పేటలో కొబ్బరిచెట్లు కాలిపోయాయి. జనార్ధనపురంలో నాలుగు ఎకరాల వరి గడ్డి తగలబడింది.

నేడు కంటైనర్ సబ్ స్టేషన్ ప్రారంభం

- తెలుగు రాష్ట్రాల్లో మొట్టమొదటిది ఇదే
- విజయవాడ గొల్లపూడిలో నిర్మాణం
- ప్రమాదాల నివారణ దీని ప్రత్యేకత
- ఓ చోటి నుంచి ఇంకొక చోటికి మార్చే అవకాశం
- సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.5.5 కోట్ల ఖర్చు


గొల్లపూడిలో ప్రారంభానికి సిద్ధమైన కంటైనర్ సబ్ స్టేషన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: విజయవాడ రూరల్ మండలం గొల్లపూడిలో నిర్మించిన కంటైనర్ సబ్‌స్టేషన్‌ను సోమవారం ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం (అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ)తో అతి తక్కువ స్థలంలో ఈ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఏపీసీపీడీసీఎల్ సీఎండీ కె.పద్మజనార్దనరెడ్డి స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి లాంఛనంగా ప్రారంభించనున్నారు. తెలుగు రాష్ట్రాల్లో తొలి కంటైనర్ సబ్ స్టేషన్ ఇదే కావడం గమనార్హం. ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీసీపీడీసీఎల్) ఈ కంటైనర్ విద్యుత్ సబ్ స్టేషన్‌ను నిర్మించింది. విజయవాడ సమీపంలోని గొల్లపూడి శ్రీనివాసనగర్‌లో ప్రయోగాత్మకంగా నిర్మించిన ఈ సబ్‌స్టేషన్ ట్రయల్ రన్ ఇప్పటికే విజయవంతమైంది. ఈ సబ్ స్టేషన్ 4.5 మీటర్ల వెడల్పు, 13 మీటర్ల పొడవున ఉంది. అందులోనే సబ్ స్టేషన్‌కు సంబంధించిన పరికరాలు అన్నింటినీ ఏర్పాటు చేశారు. అత్యాధునిక రీతిలో తక్కువ స్థలంలో కంప్యూటర్ ఆధారంగా ఆపరేట్ చేసేలా ఈ కంటైనర్ సబ్‌స్టేషన్‌ను నిర్మించారు. దీని నుంచి ట్రాన్స్‌ఫార్మర్లకు కనెక్షన్ ఇచ్చి విద్యుత్ సరఫరా చేస్తారు. పూర్తి ఆటోమేషన్ విధానంలోనే ఈ కంటైనర్ సబ్ స్టేషన్ పనిచేస్తుంది. ఈ సబ్ స్టేషన్‌తో అర్బన్ ప్రాంతాల్లో బహుళ ప్రయోజనాలున్నాయి.

ప్రయోజనాలు ఇలా..

- కంటైనర్ సబ్‌స్టేషన్‌లో సమస్య తలెత్తితే వెంటనే సెన్సార్ల ద్వారా ఆటోమెటిక్‌గా తలుపులు తెరచుకొంటాయి.
- వీడియో కాల్ ద్వారా సబ్‌స్టేషన్ పనితీరును పరిశీలించి తగు సూచనలు ఇచ్చి సమస్యలను పరిష్కరించే వెసులుబాటు ఉంది.
- సబ్‌స్టేషన్ లోపల ఏమి జరుగుతుందో ఎప్పటికప్పుడు తెలుసుకునేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.
- సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్ లైన్లు తెగిన వెంటనే ట్రిప్ అయ్యి విద్యుత్ సరఫరా నిలిచిపోయే వ్యవస్థ ఉంది.
- ఏ వీధిలో అయినా సమస్య తలెత్తితే సబ్‌స్టేషన్‌లో తెలుసుకొనే వీలుంది.
- వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేని చోట రిమోట్ లొకేషన్ నుంచి కంప్యూటర్ ద్వారా ఆపరేట్ చేయొచ్చు.

ఎంతో ప్రయోజనకరం



గొల్లపూడి ప్రజలకు ఈ కంటైనర్ సబ్ స్టేషన్ వరం లాంటిది. ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. భవిష్యత్తులో నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా ఏపీసీపీడీసీఎల్ అధికారులు ఈ కంటైనర్‌లో సబ్ స్టేషన్‌ను నిర్మించారు. మా ప్రాంత విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకవెళ్లిన వెంటనే స్పందించారు. కంటైనర్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సహకరించిన మంత్రి, అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు.

– కారంపూడి సురేష్, మార్కెట్ యార్డు చైర్మన్ గొల్లపూడి

నిర్వహణ వ్యయం తక్కువ



కంటైనర్ సబ్‌స్టేషన్ల ద్వారా డిస్కంలకు నిర్వహణ వ్యయం తగ్గుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లో తొలిసారిగా గొల్లపూడిలో ప్రయోగాత్మకంగా దీనిని నిర్మించారు. వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అవుతుంది. స్తంభాలతో పనిలేకుండా ఈ కంటైనర్ సబ్‌స్టేషన్లు ఆకర్షణీయంగా పనిచేస్తాయి. దీని నిర్మాణానికి సహకరించిన ముఖ్యమంత్రి, మంత్రి, ప్రభుత్వ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులకు ప్రత్యేక ధన్యవాదాలు.

– వసంత కృష్ణప్రసాద్, మైలవరం ఎమ్మెల్యే

రావణ వాహనంపై ఆది దంపతులు


వాహన సేవలో చైర్మన్ రాంబాబు, ఈవో భ్రమరాంబ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు ఆదివారం రావణ వాహనంపై నగర పురవీధుల్లో విహరించారు. ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో చైత్రమాస బ్రహ్మోత్సవాలు రెండో రోజుకు చేరుకున్నాయి. మహా మండపం నుంచి ప్రారంభమైన రావణ వాహన సేవను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో భ్రమరాంబ పూజలు చేసి ప్రారంభించారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ కొనసాగిన ఊరేగింపు కనకదుర్గనగర్, రథం సెంటర్, బ్రాహ్మణ వీధి, కోమల విలాస్, సామారంగం చౌక్ మీదగా తిరిగి ఆలయానికి చేరుకుంది. ఆలయ అర్చకులు, వేద పండితులు, అధికారులు, ఆలయ సిబ్బంది, భక్తులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు. పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, బచ్చు మాధవీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక, చేజర్ల ఇంద్రాణి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ నెల 8,9 తేదీల్లో తిరుపతిలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహితీ బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు, పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఆదివారం విద్యాధరపురం కబేళా రోడ్డులో నిర్వహించిన కార్యక్రమంలో వెలంపల్లి మాట్లాడారు. ప్రపంచ కవితోత్సవం, సాహిత్య సదస్సులు, కళా ప్రదర్శనలు, పుస్తకావిష్కరణలు నిర్వహించటం మన సంస్కృతి సంప్రదాయాలకు నిదర్శనమని చెప్పారు. శ్రీశ్రీ కళావేదిక కృష్ణా జిల్లా అధ్యక్షురాలు బంక నాగ పావని మాట్లాడుతూ సంస్థ అంతర్జాతీయ గౌరవ అధ్యక్షుడు కింగ్ ఇంద్ర ఆధ్వర్యంలో చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నేతృత్వంలో జరిగే ఈ వేడుకల్లో పలువురు సాహితీ ప్రియులు పాల్గొంటారని తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక కన్వీనర్ కొల్లి రమాపతి, ప్రోగ్రాం కన్వీనర్ గుత్తా హరి సర్వోత్తమ నాయుడు పర్యవేక్షిస్తారని తెలిపారు. కార్పొరేటర్లు అత్తలూరి ఆదిలక్ష్మి, బాపతి కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అత్తలూరి పెదబాబు, మైలవరపు కృష్ణ, కేసరి కృష్ణారెడ్డి, ముత్తా వాసు, చిదా పాల్గొన్నారు.

గుణదలలో ఘనంగా మట్టల ఆదివారం


భక్తులతో కిటకిటలాడుతున్న గుణదల మేరీమాత పుణ్యక్షేత్రం

గుణదల(విజయవాడ తూర్పు): సర్వ మానవాళి రక్షణార్థమై అవతరించిన ఏసుక్రీస్తు లోక రక్షకుడని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ యేలేటి విలియం జయరాజ్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ గుణదల పుణ్యక్షేత్రంలో మానుకొమ్మల ఆదివారం వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ గురువులు సమష్టి దివ్యబలి పూజ సమర్పించారు. ఫాదర్ జయరాజ్ భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ.. ఏసుక్రీస్తు పరిశుద్ధ యేరుషలేం దేవాలయంలోనికి అడుగుపెట్టిన రోజును మట్టల ఆదివారంగా జరుపుకొంటామని తెలిపారు. ఆ సమయంలో యేసుక్రీస్తును గాడిదపై ఊరేగిస్తూ ఖర్జూర మట్టలతో యూదుల సంప్రదాయం ప్రకారం ఆయనను కొనియాడారని గుర్తు చేశారు. తన ప్రవచనాల ద్వారా యావత్ ప్రపంచాన్ని ఆకర్షించిన క్రీస్తు కాలానికి కొలమానంగా అవతరించారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ క్రీస్తు బోధనలు అనుసరించాలని కోరారు. అనంతరం సమష్టి దివ్యబలిపూజ సమర్పించి భక్తులకు దివ్య సత్ప్రసాదాన్ని అందజేశారు. క్రీస్తు విశ్వాసులు పెద్ద సంఖ్యలో హాజరై మట్టలను చేబూని హోసన్నా.. హోసన్నా అంటూ దేవునిని స్తుతిస్తూ పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మరియన్న, ఫాదర్ థామస్, ఫాదర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

మిషన్ వాత్సల్య పథకానికి దరఖాస్తు చేసుకోవాలి


మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ద్వారా నిర్వహించే మిషన్ వాత్సల్య పథకానికి అర్హులైన లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఆదేశించారు. లబ్ధిదారుల ఎంపికపై మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్, సీడీపీఓలతో ఆదివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు అనాథలు, అభాగ్యులు, తల్లిదండ్రులను కోల్పోయిన వారు, దూరమైన వారు, తల్లి లేదా తండ్రిని కోల్పోయినవారు, విడాకులు పొందిన తల్లిదండ్రుల పిల్లలకు, ప్రాణాంతక వ్యాధితో బాధపడేవారికి, ప్రకృతి వైపరీత్యాలకు గురైన బాలలు, బాలకార్మికులు, అక్రమ రవాణా, దాడులకు గురైన బాలలు, బాల్య వివాహ బాధితులు, హెచ్.ఐ.వి బారిన పడిన చిన్నారులకు, వికలాంగులకు మిషన్ వాత్సల్య పథకం వర్తిస్తుందని వెల్లడించారు. మిషన్ వాత్సల్య పథకం ద్వారా నెలకు 4 వేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు వివరించారు. గ్రామ, వార్డు, మహిళా కార్యదర్శి, అంగన్‌వాడీ కార్యకర్తల ద్వారా గుర్తించబడిన ఆయా కేటగిరీల చిన్నారులు అర్హులని పేర్కొన్నారు. బాలల వివరాలు కుటుంబ నేపథ్యాన్ని తెలియపరుస్తూ దరఖాస్తులను పూర్తి చేసి తగిన ధ్రువ ప్రతాలను జత చేసి మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో సమర్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్ కార్డు, తల్లిదండ్రుల ఆధార్ కార్డులు, తల్లి లేదా తండ్రి మరణ ధ్రువీకరణ పత్రం, సంరక్షకుని ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రంతోపాటు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికేట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బ్యాంకు ఎకౌంట్ పత్రాలను జత చేసి ఏప్రిల్ 10వ తేదీ లోగా దరఖాస్తులను సమర్పించాలని కోరారు. మున్సిపల్ కమిషనర్ లేదా తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో, సీడీపీవో, సంబంధిత ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌తో ఏర్పాటు చేసిన కమిటీలలో దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి అర్హత కలిగిన అభ్యర్థులను ఎంపిక చేసి మిషన్ వాత్సల్య పథకాన్ని వర్తింప చేసేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఐసీడీఎస్ పీడీ జి. ఉమాదేవి, సీడీపీఓ జి. మంగమ్మ, ఎం.నాగమణి, జ్యోత్స్న, లలిత, పుష్పవతి, భాగ్యరేఖ, లక్ష్మి, భార్గవి, సత్యవతి పాల్గొన్నారు.

కేశఖండనశాలలో ఈఓ ఆకస్మిక తనిఖీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన కేశఖండనశాలను ఈఓ భ్రమరాంబ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విశేష పర్వదినాలు, శుక్ర, ఆదివారాల్లో భక్తులు త్వరితగతిన తలనీలాలు సమర్పించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఆదివారం భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని ఈఓకు సమాచారం అందింది. ఈఓ భ్రమరాంబ స్పందించి కేశఖండనశాలకు చేరుకున్నారు. క్యూలైన్‌లో భక్తులు బారులు తీరి ఉండటం గమనించి వెంటనే షామియానాలు ఏర్పాటు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఇకపై ప్రతి శుక్ర, ఆదివారాల్లో కేశఖండనశాల ఎదుట షామియానాలు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తుల తలనీలాలను నాయీబ్రాహ్మణులు త్వరితగతిన తీయాలన్నారు. శుక్ర, ఆదివారాల్లో భక్తుల రద్దీ దృష్ట్యా దేవస్థాన కార్యాలయంలో విధులు నిర్వహించే సిబ్బందికి సైతం ప్రత్యేకంగా విధులను కేటాయిస్తున్నట్లు ఈఓ పేర్కొన్నారు. అనంతరం అమ్మవారి ప్రసాదాల తయారీ పోటును పరిశీలించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో లడ్డూ, పులిహోర, చక్కెర పొంగలి ఏ మేరకు నిల్వ ఉన్నాయనే వివరాలను అడిగి తెలుసుకోవడంతో పాటు రికార్డులను పరిశీలించారు.

కార్తికేయుని ఆలయానికి పోటెత్తిన భక్తులు


మోపిదేవిలో స్వామివారి దర్శనం కోసం క్యూలైనులో వేచియున్న భక్తులు

మోపిదేవి: స్థానిక వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి ఆలయం ఆదివారం భక్తులతో పోటెత్తింది. రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది. తెల్లవారుజాము నుంచే క్యూలైన్‌లన్నీ భక్తులతో నిండిపోయాయి. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళశాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు క్యూలైన్లో భక్తులు గంటల తరబడి నిరీక్షించారు. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లను ఆలయ సూపరిటెండెంట్ బొప్పన సత్యనారాయణ పర్యవేక్షించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పెనమలూరు: గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందటంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం... యనమలకుదురు బందరు కాలువలో లాకుల వద్ద గుర్తు తెలియని మృతదేహం కనిపించటంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని కాలువ నుంచి బయటకు తీశారు. మృతుడు విజయవాడ పరిసర ప్రాంతాలకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. వయస్సు 55 నుంచి 60 మధ్యలో ఉంటుందని అన్నారు. మృతుడి షర్టు పై మోడరన్ టైలర్స్ అని ఉంది. వివరాలు తెలిసిన వారు పెనమలూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మార్చురీకి తరలించారు.

కారును ఢీకొని యువకుడి మృతి


మృతుడు దుర్గాప్రసాద్


గండిగుంట ఫ్లై ఓ వర్ వద్ద కారును ఢీకొన్న స్కూటీ

ఉయ్యూరు: జాతీయ రహదారిపై గండిగుంట ఫ్లైఓవర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. గండిగుంట గ్రామానికి చెందిన గరికే దుర్గాప్రసాద్ అలియాస్ దుర్గారావు (32) ద్విచక్ర వాహనంపై గండిగుంట వైపు నుంచి ఉయ్యూరు రాంగ్ రూట్‌లో వెళ్తున్నాడు. ఈ క్రమంలో మచిలీపట్నం నుంచి కంకిపాడు వైపు వస్తున్న కారును వేగంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో దుర్గారావు అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వీరప్రసాద్ తెలిపారు.

తిరుమలగిరి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

- ఈ నెల ఐదు నుంచి నిర్వహణ
- 6న స్వామి వారి కల్యాణం
- శ్రీవారి ఆలయం ముస్తాబు


తిరుమలగిరి ఆలయం

తిరుమలగిరి(జగ్గయ్యపేట): ప్రముఖ పుణ్యక్షేత్రం వాల్మీకోద్భవ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ నెల 5 నుంచి 10 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు రానుండటంతో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. చలువ పందిళ్లు, తాగునీరు, ఆలయానికి విద్యుద్దీపాలంకరణ, ప్రసాదాల పంపిణీకి ఏర్పాట్లుచేశారు. పారిశుద్ధ్య పనులకు ప్రత్యేక సిబ్బందిని నియమించారు. కల్యాణ వేదిక వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్‌లు కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ప్రత్యేకంగా సీసీ కెమెరాలు అమర్చుతున్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రత్యేక వేదికలు సిద్ధం చేస్తున్నారు. ఆలయం వద్ద 15 వేల మందికి పైగా అన్నదానం చేయనున్నారు. అలానే వైద్య శిబిరం నిర్వహించి భక్తులకు ఏవిధమైన అనారోగ్య సమస్య వచ్చినా వెంటనే చికిత్స అందిస్తారు.

ఐదో తేదీన అంకురారోహణ, స్వామి వారిని పెండ్లి కుమారుని చేయటం, దీక్షా స్వాముల ఇరుముడి సమర్పణ, ఆరున రాత్రి తొమ్మిది గంటలకు స్వామి వారి కల్యాణం, మధ్యాహ్నం భారీ అన్నదానం, ఏడున రాత్రి రథోత్సవం, ఎనిమిదిన హోమం, బలిహరణ, సప్తకలశస్నాపనం, తొమ్మిదిన పూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రతీర్థం, 10న పవళింపు సేవ, మహా నివేదనతో ఉత్సవాలు ముగియనున్నాయి. చివరి రోజు పూజా కుంకుమతో మహిళా భక్తులకు కుంకుమ భరిణలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం

బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశాం. గోడపత్రికను ఆవిష్కరించి అన్ని గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తున్నాం. వేసవి కాలం దృష్ట్యా తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. మజ్జిగతో పాటు దాతల సహాయంతో కూలర్‌లు అమర్చనున్నాం. భక్తులందరూ కల్యాణం తిలకించేలా కృషి చేస్తాం.

– దాసరి శ్రీరామవరప్రసాదరావు, ఆలయ సహాయక కమిషనర్

ప్రజలను చైతన్యవంతం చేయాలి


మాట్లాడుతున్న మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని పరిరక్షించుకోవడానికి ప్రజలను చైతన్యవంతం చేయాలని పలువురు వక్తలు తెలిపారు. మౌలిక సమస్య పరిష్కరించకుండా ప్రజల్ని మత ప్రాతిపదికన చీల్చి పాలిస్తున్న బీజేపీ ప్రజావ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరూ ముక్తకంఠంతో ఖండించాలని చెప్పారు. గవర్నర్‌పేటలోని ఎంబీ విజ్ఞాన కేంద్రంలో భారత్ బచావో సంఘం ఏపీ ప్రథమ మహాసభ ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి, సంయుక్త కిసాన్ మోర్చా నాయకుడు వడ్డే శోభనాద్రీశ్వరరావు సభను ప్రారంభించి ప్రసంగించారు. ప్రస్తుత విధానాలు ఇలాగే కొనసాగిస్తే మున్ముందు దేశంలో ఎన్నికలే ఉండకపోవచ్చని తెలిపారు. భారత్ బచావో ఉద్యమ జాతీయ నాయకుడు, ఏపీ ఇన్‌చార్జి డాక్టర్ ఎఫ్.ఎం.గోపీనాథ్ మాట్లాడారు. భారత్ బచావో రాష్ట్ర కమిటీ చైర్మన్‌గా సి.భాస్కరరావును, మరో 25 మందిని కౌన్సిల్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సామాజిక కార్యకర్త రంగారెడ్డి, సీతా మహాలక్ష్మి తదితరులున్నారు.

క్లుప్తంగా

రేపు మాంసం విక్రయాలు బంద్

పటమట(విజయవాడతూర్పు): మహావీర్ జయంతి సందర్భంగా ఈ నెల 4వ తేదీన నగరంలో మాంసం విక్రయాలను బంద్ చేస్తున్నామని, నగరంలోని కబేళా కూడా మూసేస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం నగరంలోని అన్ని చికెన్, మటన్ షాపులు, చేపల మార్కెట్లకు సెలవు ప్రకటించామని, నిబంధనలను పాటించకుండా షాపులు తీస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్పందనను వినియోగించుకోండి

పటమట(విజయవాడతూర్పు): నగరవాసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించుకునేందుకు స్పందన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతి సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌రూం, నగరంలోని మూడు సర్కిల్ కార్యాలయాల్లో జోనల్ కమిషనర్ల ఆధ్వర్యాన స్పందన జరుగుతుందని పేర్కొన్నారు. సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరవాసులు ఫిర్యాదులు, అర్జీలను అధికారులకు అందజేయాలని సూచించారు.

అనీల ఆస్పత్రిలో ఉచిత వైద్య పరీక్షలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ప్రపంచ ఆరోగ్య దినోత్సవం పురస్కరించుకుని ఈ నెల 3 నుంచి 30వ తేదీ వరకూ మధుమేహం, హైపర్‌టెన్షన్(బీపీ) ఉన్న వారికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు అనీల హాస్పటల్ అధినేత జనరల్ మెడిసిన్ స్పెషలిస్టు డాక్టర్ ఎన్.రాకేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యారావుపేట గోవిందరాజుల నాయుడు వీధిలోని హాస్పటల్‌లో సోమవారం నుంచి ప్రారంభం కానున్న సేవల్లో ఉచిత ఓపీ కన్సల్టేషన్, షుగర్, బీపీ పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వివరాలు, రిజిస్ట్రేషన్ కోసం 0866-3585405లో సంప్రదించాలని డాక్టర్ రాకేష్ తెలిపారు.

ఆర్థిక సంక్షోభాలకు కేంద్ర విధానాలే కారణం

కృష్ణలంక(విజయవాడతూర్పు): నేటి ఆర్థిక సంక్షోభాలకు కేంద్రం విధానాలే కారణమని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు విమర్శించారు. గవర్నర్‌పేటలోని ఎం.బి.వి జ్ఞాన కేంద్రంలో ఆదివారం యూటీఎఫ్ 48వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం రెండో రోజు జరిగింది. ఆయన మాట్లాడుతూ దేశంలో ఒక్క శాతం ఉన్న వారి సంపద 1/3 వంతుగా, 99శాతం ఉన్న ప్రజల సంపద 2/3గా ఉందని, దీనికి కారణం కేంద్ర పాలకుల లక్ష్యం లేని తనమని విమర్శించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కె.ఎస్.ఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఠాగూర్ గ్రంథాలయంలో కూచిపూడి నాట్య శిక్షణ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన ఉచిత కూచిపూడి నాట్య శిక్షణ కార్యక్రమాన్ని గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ జమల పూర్ణమ్మ ప్రారంభించారు. నటరాజ విగ్రహానికి పూలమాల వేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన ఆమె మాట్లాడుతూ చిన్నారులకు ప్రతి ఆదివారం ఉచితంగా కూచిపూడి నాట్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నృత్యంలో అపార అనుభవం కలిగిన బి.హెచ్.ఎస్. వి.కె.శర్మ శిక్షణ ఇస్తారన్నారు. ప్రస్తుతం సరస్వతి సామ్రాజ్యం సంస్థ ఆధ్వర్యంలో సునీత విద్యార్థులకు భగవద్గీత శ్లోకాలు నేర్పిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి కె.రమాదేవి, సిబ్బంది కె.రాంబాబు, జె.శంకర్, గోపాలరావు, ఫణి బాబు, దుర్గాంబ తదితరులు పాల్గొన్నారు.

6న గిరి ప్రదక్షిణ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): పౌర్ణమిని పురస్కరించుకుని 6వ తేదీ ఉదయం ఇంద్రకీలాద్రిపై గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్నట్లు ఆలయ వైదిక కమిటీ పేర్కొంది. గురువారం ఉదయం 6 గంటలకు మహా మండపం నుంచి ప్రారంభమయ్యే గిరి ప్రదక్షిణలో శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులు ప్రచార రథంపై కొలువుదీరన్నారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ సాగే గిరి ప్రదక్షిణలో దేవస్థాన చైర్మన్, ఈవోలతో పాటు పాలక మండలి సభ్యులు, అర్చకులు, ఆలయ అధికారులు, ఆలయ ఉద్యోగులు కుటుంబ సమేతంగా పాల్గొననున్నారు.

భక్తిశ్రద్ధలతో సూర్యోపాసన సేవ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): లోక కల్యాణార్థం, సర్వ మానవాళికి మంచి ఆరోగ్యాన్ని ప్రసాదించాలని కాంక్షిస్తూ ఆదివారం దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై సూర్యభగవానుడి చిత్రపటానికి ఆలయ అర్చకులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం సూర్య నమస్కారాలు, సూర్యోపాసన సేవ జరిగింది. సేవలో పలువురు ఉభయదాతలు, పెద్ద సంఖ్యలో భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.





● మధురం.. 'చిలక'ఫలం

మావిచిగురుచాటున మామిడి కాయలను చూసిన ఓ చక్కని చిలక పలుకులతో ఆ చెట్టుపై వాలిన చిత్రాలను చూడండి. పటమటలో ఓ ఇంటి సమీపంలోని మామిడి చెట్టుపై కాయలు అధిక సంఖ్యలో ఉన్నాయి. వాటిలో కొన్ని కాయలు పండటంతో అక్కడకు చేరిన చిలక మధురఫలాలను కొరుకుతున్న దృశ్యాలను 'సాక్షి' క్లిక్‌మనిపించింది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





మహిళా సాధికారతకు పెద్ద పీట

వైఎస్సార్ సీపీ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): మహిళా సాధికారతకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేశారని వైఎస్సార్ సీపీ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంకలోని 20,21,22 డివిజన్లకు సంబంధించి పొట్టి శ్రీరాములు నగరపాలక సంస్థ పాఠశాల ఆవరణలోనూ, 12,13 డివిజన్లకు సంబంధించి 12వ డివిజన్, అయ్యప్పనగర్‌లోని నెహ్రూ రోడ్ గ్రౌండ్‌లో ఆదివారం వైఎస్సార్ ఆసరా మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. 20, 21, 22 డివిజన్లకు చెందిన 676 పొదుపు సంఘాల మహిళలకు రూ.6.91కోట్లు, 12, 13డివిజన్లకు చెందిన 158 పొదుపు సంఘాల మహిళలకు రూ.1. 89 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ మహిళా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ వారిని ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నారన్నారు. ప్రజా సంకల్ప యాత్రలో ఇచ్చిన హామీ మేరకు జగనన్న వైఎస్సార్ ఆసరా పథకం కింద మూడు విడతల్లో రూ.19వేల కోట్లను మహిళల ఖాతాల్లో జమ చేశారని తెలిపారు. నాడు–నేడు పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఇంటికే పింఛన్లు అందజేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు అమలు కావాలంటే వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్ననే ముఖ్యమంత్రిగా గెలిపించడానికి అక్కాచెల్లెమ్మలు అండగా నిలవాలని కోరారు. గత ప్రభుత్వంలో చంద్రబాబు నాయుడు అందరికీ గ్రాఫిక్స్ సినిమా చూపించారని, రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని విమర్శించారు. కాపు కార్పొరేషన్ చైర్మన్, 20వ డివిజన్ కార్పొరేటర్ అడపా శేషు మాట్లాడుతూ అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, భట్రాజు కార్పొరేషన్ చైర్మన్ గీతాంజలి, 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, 12, 13 డివిజన్ల ఇన్‌చార్జిలు మాగంటి నవీన్, రామాయణపు శ్రీనివాస్, ఎన్టీఆర్ జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు చిమటా సాంబశివరావు, 21వ డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకుడు పుప్పాల రాజ తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ ఆసరా నమూనా చెక్కును అందజేస్తున్న దేవినేని అవినాష్

మహనీయుల సంగీత సేవలు ఆదర్శం

విజయవాడ కల్చరల్: మహనీయుల సంగీత సేవలను ఆదర్శంగా తీసుకోవాలని మృదంగ విద్వాంసురాలు దండమూడి సుమతీ రామ్మోహనరావు అన్నారు. స్వరఝరి సంగీత సంస్థ మూడు రోజులుగా శివరామకృష్ణ క్షేత్రంలో నిర్వహిస్తున్న 35వ వార్షిక సంగీత మహోత్సవాలు ఆదివారం ముగిశాయి. వయోలిన్ విద్వాంసులు ద్వారం దుర్గాప్రసాద్‌కు చింతలపాటి రాజ్యలక్ష్మి పురస్కారం, దుర్గాప్రసాద్ సప్తతంత్రీ వాయులీన కచేరీ నిర్వహించారు.

సుమతీ రామ్మోనరావు మాట్లాడుతూ ద్వారం వెంకస్వామి నాయుడు సంగీత వారసత్వాన్ని కాపాడుతూ నిజమైన కళాకారుడిగా సంగీత సరస్వతికి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సత్కార కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మోదుమూడి సుధాకర్, అంజనా సుధాకర్‌తోపాటు పలువురు సంగీత విద్వాంసులు పాల్గొన్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్ నిర్వహించిన వాయిలీన కచేరీలో పలు సంప్రదాయ కీర్తనలు ఆలపించారు. బీవీఎస్ ప్రసాద్ మృదంగంపై, ఎస్ హనుమంతరావు ఘటంతో సహకరించారు.



వయొలిన్ కచేరి చేస్తున్న ద్వారం దుర్గాప్రసాద్, బీవీఎస్ ప్రసాద్, హనుమంతరావు

రామునికి పవళింపు సేవ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా కొత్తపేట రామాలయం సమీపంలోని నగరాల సీతారామస్వామి దేవస్థానంలో స్వామి వారికి ద్వాదశి ప్రదక్షిణలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా శ్రీ నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం కమిటీ ఆధ్వర్యాన వేలాది మందికి అన్నప్రసాద వితరణ చేశారు. దేవస్థానం పాలక మండలి అధ్యక్షులు లింగిపిల్లి అప్పారావు, కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు తదితరులు శ్రీ సీతారాములకు పూజలు చేసి అనంతరం అన్నదానం జరిగింది. దేవాలయం ప్రాంగణంలోని అద్దాల మండపంలో వివిధ రకాల పూలతో అలంకరించిన ఉయ్యాలలో స్వామివారి పవళింపు సేవ నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కమిటీ ప్రముఖులు పాల్గొన్నారు.

5న పాతశివాలయంలో అయ్యప్ప జయంతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లోని అయ్యప్పస్వామి సన్నిధిలో ఈ నెల ఐదో తేదీన అయ్యప్ప స్వామి జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధానార్చకుడు కె.మురళీధరన్ నంబూద్రి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తేదీ శుక్రవారం ఉదయం 108 హోమ గుండాలు, 108 మంది దంపతులతో ప్రత్యేక హోమాలు చేయనున్నట్లు పేర్కొన్నారు. లక్ష్మీగణపతి, సుదర్శన హోమం, నవగ్రహ, రుద్ర, ఆదిత్యాది హోమాలను నిర్వహిస్తామని తెలిపారు. హోమాల్లో పాల్గొనాలనుకునే దంపతులు ఆలయ ప్రాంగణంలోని కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అన్నదానానికి మించింది ఏదీ లేదు

భవానీపురం(విజయవాడపశ్చిమ): దానాల్లో అన్నదానానికి మించింది మరొకటి లేదని, నలుగురికి పట్టెడన్నం పెడితే దేవుడు మేలు చేస్తాడని చండూరు వెంకటరెడ్డి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ ఎ.శరాబందిరావు పేర్కొన్నారు. స్థానిక ఊర్మిళానగర్ పరిధిలోని సంస్కృతి ఫంక్షన్ హాల్ వద్ద ఆదివారం ప్రారంభమైన మీనాక్షి డోర్స్ సందర్భాన్ని పురస్కరించుకుని షాపు యజమాని ఎస్‌వీఎస్ కృష్ణారావు అన్నదానం చేశఋరు. శరాబందిరావు మాట్లాడుతూ జిల్లా కేబినెట్ నాయకులు ఎంఎస్ ఇమామ్ బాషా క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో క్లబ్ జాయింట్ సెక్రటరీ పీవీ హనుమంతరావు, క్లబ్ నాయకులు వెంకట నారాయణ, నాగరాజు, శ్రీనివాసరావు, పింగళి వెంకట రమణ, రూపనాథ్, వాంబేకాలనీ మున్సిపల్ స్కూల్ హెచ్‌ఎం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'చట్టసభల్లో గోదావరి గళం' పుస్తకావిష్కరణ

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆక్వా డెవిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన రాజమండ్రికి చెందిన శ్రీపాద శ్రీనివాస్ రచించిన 'చట్టసభల్లో గోదావరి గళం' అనే పుస్తకావిష్కరణ కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్, ఎంఎల్ఎస్ ప్రసాద్ బాబు, అసోసియేషన్ కార్యదర్శి నరసరాజు, గుండు జనార్దన్, యర్రంశెట్టి శ్రీనివాసరావు, రాము చిదంబరం, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత శ్రీపాద శ్రీనివాస్‌కు చిరు సత్కారం చేసి అభినందించారు.



రచయితను అభినందిస్తున్న దృశ్యం

వైభవంగా కోదండరాముని శేషవాహనోత్సవం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ కన్యకాపరమేశ్వరి శ్రీరామ శ్రీనగరేశ్వర స్వామి దేవస్థానం (కొత్తగుళ్ళు) ప్రాంగణంలోని శ్రీ కోదండరామ స్వామి వారు ఆదివారం శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో జరుగుతున్న కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో పలు ప్రత్యేక వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పలు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం స్వామి వారి సన్నిధిలో దర్బార్ సేవ చేశారు. సాయంత్రం స్వామి వారికి విశేష ఉత్సవాలు జరిగాయి. ఆలయంలో భజన కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని మూలవిరాట్‌లకు కూడా విశేష అర్చనలు జరిగాయి. ఆలయంలో వైదిక కార్యక్రమాలను అర్చకులు పులిపాక రాఘవాచార్యులు, ఆంజనేయాచార్యులు నిర్వహించారు. కమిటీ ప్రముఖులు పర్యవేక్షించారు.



శేషవాహనంపై కొలువుదీరిన కోదండరాముడు

అలరించిన జానపద గీతాలాపన

విజయవాడ కల్చరల్/మధురానగర్: మాచవరం డౌన్ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో నవమి వేడుకల్లో భాగంగా ఆదివారం అంతర్జాతీయ గాయకుడు దామోదర గణపతిరావు, బృంద సభ్యులు మీసాల రమణ, మధురానగరం మన్మథ, సందేనపల్లి సునీత, అవనిద్ద శీను తదితరులు పలు జానపద, భక్తి గీతాలను మధురంగా ఆలపించారు. శివ శివ మూర్తివి గణనాథ, జగదభిరామ, తదితర గీతాలను ఆలపించారు. దేవస్థాన కమిటీ సభ్యులు చెరుకూరి కృష్ణకుమార్, అధ్యక్షుడు కంచర్ల రాంబాబు, కోశాధికారి నాగమోతు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



జానపద గీతాలు ఆలపిస్తున్న దామోదర గణపతిరావు బృందం

ప్రజా జీవనానికి ఆటంకం కలిగించొద్దు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ప్రజా జీవనానికి ఆటంకం కలిగించొద్దని సీఐ సుబ్రహ్మణ్యం హెచ్చరిచారు. కొత్తపేట పీఎస్ పరిధిలోని టీనర్‌పేట అడ్డరోడ్డు, కేఎల్‌రావునగర్, వీఎంసీ కాలనీ, పాల ప్రాజెక్టు, పంజా సెంటర్, నైజాంగేటు, కోమల విలాస్, సుబ్రహ్మణ్యస్వామి గుడి అడ్డరోడ్డు ప్రాంతాల్లో ఆదివారం పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీఐ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యాన ఆయా సెక్టార్ ఎస్‌ఐలు, నేఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుల్స్ ఆయా ప్రాంతాల్లో తిరుగుతూ రోడ్లపై నిలిపిన ఆటోలు, బైక్‌లపై ట్రిపుల్ డ్రైవింగ్ చేస్తూ తిరుగుతున్న యువకులను స్టేషన్‌కు తరలించారు. వారికి సీఐ సుబ్రహ్మణ్యం కౌన్సిలింగ్ ఇచ్చారు. రోడ్లపై జులాయిగా తిరిగితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. యువకుల తల్లిదండ్రులను పిలిచి హెచ్చరించి పంపేశారు.



యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న కొత్తపేట సీఐ సుబ్రహ్మణ్యం

ఘనంగా మట్టల ఆదివారం



మట్టలు పట్టుకొని ప్రత్యేక ఆరాధన



ఎంజీరోడ్డులో ప్రదర్శన చేస్తున్న క్రైస్తవులు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): మొగల్రాజపురం పరిసర ప్రాంతాల్లోని క్రీస్తు విశ్వాసులు మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెద్దలు, యువతులు, చిన్నారులు మట్టలను చేతపట్టుకుని మొగల్రాజపురం బందులదొడ్డి సెంటర్, సున్నపుబట్టీల సెంటర్, ఐటీఐ కళాశాల రోడ్లలో క్రీస్తు గొప్పదనాన్ని తెలిపే ప్రదర్శన చేశారు.

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆటోనగర్ వంద అడుగుల రోడ్డులోని మెస్సీయ ఫెలోషిప్ చర్చిలో క్రైస్తవులు ఆదివారం మట్టల పండుగ ప్రత్యేక ఆరాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. చిన్నారులతో పాటు క్రైస్తవులు మట్టలను పట్టుకొని యూదుల రాజుకు జయం..జయం అంటూ పాటలు ఆలపించారు. పాస్టర్ సజ్జా రత్నకుమార్ మాట్లాడుతూ ఏసు చూపిన ప్రేమ, దయ, దీనత్వంపై వాక్యోపదేశం చేశారు. కార్యక్రమంలో సజ్జల జ్యోతి, ఎలియాజర్, క్రైస్తవులు పాల్గొన్నారు.

లబ్బీపేట(విజయవాడతూర్పు): క్రైస్తవులు తపస్సు కాలం 40 రోజుల తర్వాత వచ్చే వారాన్ని పవిత్ర వారంగా పిలుస్తారు. ఈ పవిత్ర వారం మట్టల ఆదివారం(మ్రాని కొమ్మల ఆదివారం)తో ప్రారంభమై ఈస్టర్‌తో ముగుస్తుంది. మట్టల ఆదివారాన్ని నగరంలో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. లబ్బీపేట క్యాథలిక్ సెంటర్ ఆధ్వర్యాన మ్రాని కొమ్మల ఆదివారం ఘనంగా చేశారు. ఆ సెంటర్ డైరెక్టర్ వికార్ జనరల్ రెవరెండ్ ఫాదర్ గాబ్రియేల్ ఆధ్వర్యంలో ఊరేగింపు జరిగింది. క్యాథలిక్ సెంటర్ నుంచి ప్రారంభమైన ఊరేగింపు రెవిన్యూ కాలనీ, డీవీ మనార్ మీదుగా ఎంజీ రోడ్డులో మళ్లీ సెంటర్ వద్దకు చేరుకుంది. కార్యక్రమంలో బిషప్ హౌస్‌కు చెందిన రెవరెండ్ ఫాదర్ మాతంగి మరియకుమార్, రెవరెండ్ ఫాదర్ మేడేపల్లి మరియదాసు, సిస్టర్స్, ఉపదేశీ, సంఘ పెద్దలు, మరియదళ సభ్యులు, యూత్ పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో బీసీలకు ప్రాతినిధ్యం

ఆటోనగర్(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ హయాంలో అన్ని రంగాల్లో బీసీలకు ప్రాతినిధ్యం లభిస్తోందని పలువురు నేతలు పేర్కొన్నారు. జవహర్ ఆటోనగర్‌లోని వెంకటేశ్వర టింబర్ ట్రేడర్స్ ఆవరణలో ఇటీవల జరిగిన బెజవాడ బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో ట్రెజరర్‌గా గెలుపొందిన బత్తుల వెంకటేశ్వరరావును ఆదివారం పలువురు వ్యాపారవేత్తలు, బీసీ నాయకులు బత్తుల ధనరాజు, నాగయ్యలు శాలువా కప్పి సన్మానించారు. ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్ మాట్లాడుతూ బీసీలకు ఇటీవల ప్రాతినిధ్యం పెరిగిందన్నారు. గతంలో కంటే ఇప్పుడు బీసీలు అన్నిరంగాల్లో ముందున్నారన్నారు. న్యాయవాది వెంకటేశ్వరరావు భవిష్యత్తులో ఉన్నత స్థానం చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జమాక్ మాజీ అధ్యక్షులు కత్తిక శివనాగేశ్వరావు, పట్టిబోయిన శివరామకృష్ణ, కొంగన రవికుమార్, కనపర్తి చలపతి, నాలి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న బీసీ నాయకులు

ఉచిత వైద్యసేవలను వినియోగించుకోండి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్యసేవలను వినియోగించుకోవాలని 30వ డివిజన్ కార్పొరేటర్ బీహెచ్‌ఎస్‌వీ జానారెడ్డి సూచించారు. దేవీనగర్ 8వ లైన్‌లో ఆదివారం స్వర హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యాన్ని అందించడానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. సామాజిక బాధ్యతగా ఉచిత వైద్యసేవలను అందిస్తున్న స్వర హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ వెంకట్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. సుమారు 400 మందికి వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, దేవీనగర్ రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ముత్యాల లక్ష్మీనారాయణరెడ్డి, దుర్గారావు, స్వర హాస్పిటల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ వెంకట్

సీతారాముల కల్యాణానికి గోటి తలంబ్రాలు





ఒంటిమిట్ట: వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్ట కోదండ రామాలయంలో ఏప్రిల్ 5న నిర్వహించే సీతారాముల కల్యాణానికి విజయవాడ కృష్ణలంకకు చెందిన భక్తవత్సల సేవా సమితి ప్రతినిధి ధనలక్ష్మి ఆధ్వర్యంలో సుమారు 40 కేజీల గోటి తలంబ్రాలను ఆలయ టీటీడీ ఇన్‌స్పెక్టర్ ధనుంజయుడుకి అందజేశారు. రామయ్యపై భక్తి భావంతో వడ్లను గోటితో వలిచినట్లు వారు తెలిపారు.

ముగిసిన నూకాలమ్మ జాతర

చిట్టినగర్(విజయవాడ పశ్చిమ): సొరంగం సమీపంలో జరుగుతున్న నూకాలమ్మ జాతర ఆదివారం ముగిసింది. ఆదివారం అమ్మవారికి విశేష అలంకరణ, పూజల అనంతరం సంబరం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధికి ఊరేగింపుగా వెళ్లింది. మధ్యాహ్నం నూకాలమ్మ గుడిలో అన్న ప్రసాద వితరణ జరిగింది.

క్లుప్తంగా...

'కొటియా'పై కేంద్రమంత్రివి కోర్టు ధిక్కార వ్యాఖ్యలే

ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్న దొర



సాలూరు: ఆంధ్రా–ఒడిశా వివాదాస్పద కొటియా గ్రామాలు ఒడిశావే అంటూ కేంద్ర మంత్రి ధర్మేంద్రప్రధాన్ వ్యాఖ్యానించడం సరికాదని ఏపీ ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్న దొర అన్నారు. సాలూరులోని తన నివాస గృహంలో ఆదివారంన ఆయన విలేకరులతో మాట్లాడారు. కొటియా గ్రామాలు ఒడిశావేనని, ఆంధ్రా అధికారులు గో బ్యాక్ అనడాన్ని ఆయన ఖండించారు. సుప్రీంకోర్టులో స్టేటస్‌కో అమల్లో ఉన్న ఈ గ్రామాలపై ఇరు రాష్ట్రాలకు సమాన హక్కులు ఉంటాయన్నారు. కేంద్ర మంత్రి దేశంలో అన్ని ప్రాంతాలు, అన్ని రాష్ట్రాల పట్ల సమభావం, సమానత్వంతో ఉంటూ సమన్యాయం చేయాలని సూచించారు. కేంద్ర మంత్రి మాటలు, ఆయన చర్యలు కోర్టు ధిక్కారణకు వస్తాయన్నారు. 6 నెలల కిందట ఈ గ్రామాలు ఒడిశావే అంటూ అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఒడిశా సీఎం నవీన్ పట్నాయక్‌కు ఆయన సూచించగా చట్టం, రాజ్యాంగం గురించి మంచి పరిజ్ఞానం ఉన్న నవీన్ పట్నాయక్ సదరు కేంద్ర మంత్రి సూచనలు పట్టించుకోలేదని చెప్పారు.

గ్రంథాలయాలకు కొత్త పుస్తకాలు

రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు



మాట్లాడుతున్న మందపాటి శేషగిరిరావు

అనకాపల్లిటౌన్: భావితరాలకు అందించేందుకు దశాబ్దాల నుంచి గ్రంథాలయాల్లో భద్రపరిచిన పుస్తకాలను డిజిటలైజేషన్ చేస్తున్నట్లు రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు తెలిపారు. అదేవిధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెండు నెలల కిందట గ్రంథాలయాల అభివృద్ధికి రూ.15.70 కోట్లు విడుదల చేయడంతో నేటి యువతకు అవసరమైన కొత్త పుస్తకాలను కొనుగోలు చేసినట్లు చెప్పారు. గవరపాలెంలోని గౌరీ గ్రంథాలయంలో ఆదివారం 'గ్రంథాలయాలు–సాంకేతిక పరిజ్ఞానం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శేషగిరిరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 10,960 గ్రంథాలయాలను సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ పి.శ్రావణ్‌కుమార్, గ్రంథాలయ అధ్యక్షుడు దొడ్డి నూక అప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, కార్యదర్శి భీశెట్టి కృష్ణ అప్పారావు, కేంద్ర క్రీడా యువజన వ్యవహారాల శాఖ, నెహ్రూ యువ కేంద్ర ఉమ్మడి విశాఖ జిల్లాల అధికారి గొర్లె మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చేనేతపై జీఎస్టీ తొలగించేలా చేస్తాం

టీడీపీ నేత నారా లోకేశ్



ధర్మవరం/బత్తలపల్లి: కేంద్ర ప్రభుత్వం చేనేత రంగంపై విధించిన జీఎస్టీ ద్వారా నేత కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, చేనేత పరిశ్రమ కుదేలయ్యే పరిస్థితి వచ్చిందని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. తాము అధికారంలోకి వస్తే చేనేత రంగంపై జీఎస్టీ తొలగించేలా కేంద్రం మీద ఒత్తిడి తెస్తామన్నారు. యువగళం పాదయాత్రలో భాగంగా ఆయన ఆదివారం శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలోని ఓ కల్యాణ మండపంలో చేనేత నాయకులు, కార్మికులతో సమావేశం నిర్వహించారు. లోకేశ్ మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి వస్తే చేనేతలకు ఉచితంగా 200 యూనిట్ల విద్యుత్ అందిస్తామన్నారు. పవర్‌లూమ్స్‌ను నియంత్రిస్తామని, 'నేతన్న నేస్తం' పథకం సాయాన్ని పెంచి కార్మికులందరికీ వర్తింపజేస్తామన్నారు. ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజినేయులు, ప్రధాన కార్యదర్శి జింకా చలపతి, మాస్టర్ వీవర్‌లు మాట్లాడుతూ చేనేత కార్మికుల సమస్యలు వివరించారు. అనంతరం లోకేశ్ పాదయాత్ర గొట్లూరు, పోట్లమర్రి మీదుగా బత్తలపల్లికి చేరుకుంది. వాల్మీకులు, కురుబల సమావేశాల్లోనూ లోకేశ్ పాల్గొన్నారు. కాగా, లోకేశ్ పాదయాత్ర బత్తలపల్లి మండలం పోట్లమర్రి గ్రామానికి చేరుకున్న సందర్భంగా టీడీపీ కార్యకర్తలు ప్రత్యేక వాహనంపై నుంచి టపాసులు కాల్చి కిందకు విసిరారు. ఓ టపాసు జనం మధ్యలో పేలడంతో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఐదేళ్ల బాలుడు కూడా ఉన్నారు. గాయపడినవారిని 108 వాహనంలో బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రికి తరలించారు. గాయపడినవారిని టీడీపీ నాయకులు కనీసం పరామర్శించలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేశారు. మరోవైపు బత్తలపల్లిలో జరిగిన సభలో లోకేశ్ మాట్లాడుతూ పాదయాత్రలో తనను అడుగడుగునా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తాను టెర్రరిస్టును కాదని, వారియర్‌ను అని చెప్పారు.

ఈవీల జోరు.. అమ్మకాల హుషారు

దేశంలో ఈ ఏడాది 11.71 లక్షల వాహనాల అమ్మకాలతో రికార్డు

- గతేడాది అమ్మకాలతో పోలిస్తే 155 శాతం పెరుగుదల
- 7.20 లక్షల ద్విచక్ర వాహనాలు, 39,544 ఎలక్ట్రిక్ కార్ల విక్రయం
- దేశంలో 22.67 లక్షలకు చేరిన ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య
- ఈవీ వైపు చూస్తున్న యువత



సాక్షి, అమరావతి: దేశంలో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీల) జోరందుకుంటుండగా.. అమ్మకాలు సైతం హుషారెత్తిస్తున్నాయి. పెట్రోల్, డీజిల్ ధరలు గరిష్ట స్థాయిలో ఉండటం, ఎలక్ట్రిక్ వాహనాల నిర్వహణ వ్యయం తక్కువ అవుతుండటంతో యువత ఈవీల వైపు చూస్తున్నారు. ఫలితంగా.. ఆరు నెలలుగా వీటి అమ్మకాల జోరు పెరుగుతోంది. దేశంలో తొలిసారిగా ఒక ఆర్థిక ఏడాదిలో 10 లక్షలకు పైగా వాహనాల అమ్మకాలతో ఎలక్ట్రిక్ వాహన రంగం సరికొత్త రికార్డును సృష్టించింది. 2022–23లో దేశవ్యాప్తంగా 11,71,944 ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడైనట్టు వాహన్ డేటా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. 2021–22లో అమ్ముడైన 4,58,746 యూనిట్లతో పోలిస్తే అమ్మకాల్లో 155 శాతం వృద్ధి నమోదైంది. గడచిన ఆరు నెలలుగా ప్రతినెలా లక్షకు పైగా వాహనాలు అమ్ముడవుతున్నాయంటే డిమాండ్ ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య 22,67,042కు చేరింది. రాష్ట్రంలో ఈవీల సంఖ్య 54,918కు చేరింది.

టూ.. త్రీ వీలర్స్‌కే డిమాండ్ అధికం

ప్రస్తుతం అమ్ముడవుతున్న ఎలక్ట్రిక్ వాహనాల్లో ద్విచక్ర, త్రిచక్ర వాహనాల వాటానే అత్యధికంగా ఉంటోంది. మొత్తం ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాల్లో ద్విచక్ర వాహన అమ్మకాలు 61.5 శాతం ఉంటే, త్రిచక్ర వాహనాల వాటా 34 శాతంగా ఉంది. ద్విచక్ర వాహన రంగంలోకి ఓలా ఎలక్ట్రిక్ ప్రవేశంతో ఒక్కసారిగా అమ్మకాలు భారీగా పెరిగాయి. 2021–22తో పోలిస్తే 185 శాతం వృద్ధితో 7,20,733 ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. ఇందులో ఒక్క ఓలా ఎలక్ట్రిక్ 1,54,344 వాహనాలు అమ్మడం ద్వారా 21 శాతం మార్కెట్ వాటాతో మొదటి స్థానంలో నిలిచింది. ఆ తర్వాత స్థానాల్లో ఓకినావా ఆటో టెక్ 94,133, హీరో ఎలక్ట్రిక్ 89,165 నిలిచాయి. త్రిచక్ర వాహనాల అమ్మకాలకు వస్తే 2022–23లో మొత్తం 3,99,540 యూనిట్లు సేల్ అయ్యాయి. గడచిన ఆర్థిక సంవత్సరంలో మొత్తం 39,544 ప్యాసింజర్ కార్ల అమ్మకాలు జరిగితే.. అందులో 31,203 కేవలం టాటా మోటర్స్ నుంచే జరగ్గా, 4,412 యూనిట్లు ఎంజీ మోటార్స్ నుంచి జరిగాయి. రాష్ట్రంలోని కియా మోటర్స్ 311 ఎలక్ట్రిక్ కార్లను విక్రయించింది.

2022-23లో ఎలక్ట్రిక్ వాహనాల విక్రయాలు ఇలా..

విభాగం	యూనిట్ల అమ్మకాలు
ద్విచక్ర వాహనాలు	7,20,733
త్రిచక్ర వాహనాలు	3,99,540
ప్యాసింజర్ కార్లు	39,562
ఎల్‌పీవీ	7,045
బస్సులు	1,857
హెచ్‌జీవీ	193
ఎల్‌జీవీ	592
ఇతర వాహనాలు	2,422
మొత్తం	11,71,944

2014 నుంచి దేశవ్యాప్తంగా అమ్మకాలు ఇలా

ఆర్థిక సంవత్సరం	ఈవీలు
2013-14	2,627
2014-15	2,347
2015-16	16,198
2016-17	55,871
2017-18	96,512
2018-19	1,46,938
2019-20	1,73,545
2020-21	1,42,314
2021-22	4,58,746
2022-23	11,71,944

కులవాదుల కుటిలయత్నాలు

917వ రోజు రిలే నిరాహార దీక్షల్లో బహుజన పరిరక్షణ సమితి నాయకులు



దీక్షలో పాల్గొన్న బహుజన పరిరక్షణ సమితి నేతలు

తాడికొండ: కులవాదులు ఉద్యమం పేరుతో వ్యాఖ్యలు చేస్తూ రాజకీయాలను ప్రభావితం చేసేందుకు, ప్రజల భావోద్వేగాలను రెచ్చగొట్టి పబ్బం గడుపుకొనేందుకు కుటిలయత్నాలు చేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు మండిపడ్డారు. మూడు రాజధానులకు మద్దతుగా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్‌యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 917వ రోజు కొనసాగాయి. ఈ దీక్షలో పలువురు మాట్లాడుతూ 2024 ఎన్నికలే లక్ష్యంగా రాష్ట్రంలో అన్ని పార్టీల్లోని కులవాదులంతా ఏకమై ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నిస్తుండటం సిగ్గుచేటని విమర్శించారు. మూడు రాజధానులకు రాష్ట్రవ్యాప్తంగా వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక వీరంతా తప్పుడు ప్రచారాలకు దిగుతున్నారని చెప్పారు. ఐదుకోట్ల మంది రాష్ట్ర ప్రజలు మూడు రాజధానులకు, అన్ని ప్రాంతాల సమానాభివృద్ధికి సుముఖంగా ఉండి జై కొడుతున్నారని గ్రహించిన కులవాదులు అన్ని పార్టీల్లో ఉన్న అద్దె నాయకులతో మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ తరఫున శాసనసభ్యుడిగా ఎన్నికై మంత్రి పదవి కోసం పార్టీలు మార్చి భారీ అవినీతికి పాల్పడిన ఆదినారాయణరెడ్డి తన అవినీతి కప్పిపెట్టుకునేందుకు బీజేపీ కండువా వేసుకుని బహిరంగంగా టీడీపీకి కొమ్ము కాస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో సమితి నాయకులు గురునాథం, నూతక్కి జోషి, ఈపూరి ఆదాం, పులి దాసు తదితరులు పాల్గొన్నారు.

బోధనాస్పత్రుల బలోపేతం

ఆరోగ్యశ్రీకి ఏడాదిలో రూ.388 కోట్లు • 2022-23లో 2.22 లక్షల కేసులకు చికిత్స

కర్నూలులోని అశోక్‌నగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ కేదారేశ్వరయ్య గత ఫిబ్రవరిలో గుండెపోటుకు గురవటంతో కుటుంబ సభ్యులు స్థానిక జీజీహెచ్‌లో చేర్చారు. స్టెంట్ వేయడానికి వీలులేని ప్రదేశంలో రక్తనాళాల్లో బ్లాక్ ఉండటంతో బైపాస్ సర్జరీ అవసరమైంది. కార్డియో థొరాసిక్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి చిన్న కోతతో అరుదైన పద్ధతిలో బైపాస్ సర్జరీ చేశారు. ప్రైవేట్‌లో రూ.5 లక్షలు దాకా ఖర్చయ్యే శస్త్ర చికిత్సను జీజీహెచ్‌లో డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేశారు.

తెనాలి రూరల్ మండలం పెదరావూరుకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థికి గత నెలలో ఫిట్స్ రావడంతో కన్ను తీవ్రంగా వాచింది. ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లగా ప్రాణాలకు ప్రమాదం ఉందని వైద్యులు పేర్కొనడంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ముక్కులో ఇటమాయిడ్ సైనసైటిస్‌తో ఇన్‌ఫెక్షన్ సోకినట్లు నిర్ధారించిన వైద్యులు ఆర్బిటల్ డికంప్రెషన్ ఆపరేషన్ ద్వారా విద్యార్థి కంటి చూపుతో పాటు, ప్రాణాలను కాపాడారు. సుమారు రూ.3 లక్షల ఖరీదైన ఆపరేషన్‌ను జీజీహెచ్‌లో ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా నిర్వహించారు.



సాక్షి, అమరావతి: అరుదైన శస్త్ర చికిత్సలను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా బోధనాస్పత్రుల్లో విజయవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ వైద్య రంగాన్ని బలోపేతం చేయడంలో భాగంగా మానవ వనరులు, మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. రోగుల తాకిడికి అనుగుణంగా వనరులు సమకూర్చడంతో ప్రభుత్వాస్పత్రుల్లో వైద్య సేవలు గణనీయంగా మెరుగయ్యాయి.

ఏడాదిలో 2.22 లక్షల కేసులు

2022–23లో ప్రభుత్వ బోధనాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద 2,22,147 కేసులకు వైద్య సేవలు అందించారు. ఇందుకు రూ.388.63 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేసింది. 2018–19 నుంచి బోధనాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కేసులను పరిశీలిస్తే ఇదే అత్యధికం. టీడీపీ హయాంలో కేవలం 90 వేల లోపు కేసులకు మాత్రమే బోధనాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద వైద్యం అందగా ఇప్పుడు ఏకంగా రెండు లక్షలకు పైగా చేరుకోవడం గమనార్హం.

విజయవాడ జీజీహెచ్ టాప్

ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యసేవల్లో విజయవాడ జీజీహెచ్ 2022–23లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. 27,081 ఆరోగ్యశ్రీ కేసులు ఇక్కడ నమోదయ్యాయి.

బోధనాస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ కేసులు ఇలా

సంవత్సరం	కేసులు	నిధులు (రూ.కోట్లలో)
2018-19	86962	227.77
2019-20	117076	262.13
2020-21	108420	176.51
2021-22	195249	276.13
2022-23	222147	388.63

22,104 కేసులతో కర్నూలు జీజీహెచ్ రెండో స్థానంలో, 21732 కేసులతో విశాఖ కేజీహెచ్ మూడో స్థానంలో ఉన్నాయి.

ప్రత్యేక పర్యవేక్షణ

ఇన్నాళ్లూ ప్రభుత్వాస్పత్రుల్లో వనరులు సరిగా లేకపోవడంతో ఆరోగ్యశ్రీ వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రులనే ఆశ్రయించాల్సి వస్తోంది. ఆరోగ్యశ్రీ క్లెయిమ్‌లలో 30 శాతం ప్రభుత్వాస్పత్రుల నుంచి ఉంటున్నాయి. వీటిని మరింత పెంచి ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి చేసే లక్ష్యంతో వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో 2019 నుంచి బోధనాస్పత్రుల్లో 1,582 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులతోపాటు ప్రమోషన్ల రూపంలో కలిపి మొత్తం రెండు వేల వరకూ పోస్టుల భర్తీ చేపట్టింది. గతంతో పోలిస్తే మైనర్, మేజర్ సర్జరీలు, ఇతర చికిత్సలు బోధనాస్పత్రుల్లో గణనీయంగా పెరిగాయి. ఆరోగ్యశ్రీ కేసులపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచినట్లు డీఎంఈ డాక్టర్ వినోద్ 'సాక్షి'కి తెలిపారు. ప్రతివారం సమీక్ష చేపట్టి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.

విద్యుత్ పొదుపులో మరో ముందడుగు

- రాష్ట్ర ఇంధన సామర్థ్య పాలసీ రూపకల్పనకు సన్నాహాలు
- ఇంధన డిమాండ్ 67,890 మిలియన్ యూనిట్లలో 25 శాతం పొదుపు
- ఏటా కనిష్టంగా రూ.1,200 కోట్ల విలువైన విద్యుత్ ఆదా
- ఇంధనశాఖ అధికారులతో సీఎస్ జవహర్‌రెడ్డి సమావేశం

సాక్షి, అమరావతి: వినియోగదారులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడంలో భాగంగా ప్రత్యేకంగా ఇంధన సామర్థ్య పాలసీని రూపొందించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. 2023–24 ఏపీఈఆర్సీ టారిఫ్ ఆర్డర్ ప్రకారం రాష్ట్రంలో దాదాపు 67,890 మిలియన్ యూనిట్ల విద్యుత్ డిమాండ్ ఉంది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ (బీఈఈ) అంచనా ప్రకారం ఏటా దీన్లో దాదాపు 25 శాతం అంటే 17 వేల మిలియన్ యూనిట్ల ఇంధనం ఆదా అయ్యే అవకాశం ఉంది. ఇందులో కనీసం 10 శాతం లక్ష్యంగా పెట్టుకున్నా రూ.1,200 కోట్ల విలువైన 1,700 మిలియన్ యూనిట్ల ఇంధనాన్ని ఆదా చేయవచ్చు. ఇదే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పాలసీని రూపొందించనుంది.

ఎందుకీ పాలసీ..

రాష్ట్రంలోని వివిధ రంగాల్లో సరికొత్త ఇంధన సంరక్షణ, సాంకేతికతలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ పాలసీని అమలు చేయనుంది. ఇంధన భద్రత సాధించేందుకు, 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ అందించేందుకు, విద్యుత్ రంగాన్ని బలోపేతం చేసేందుకు ఈ పాలసీ సహాయపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. రాష్ట్రంలో ఎనర్జీ కన్జర్వేషన్ యాక్ట్–2001ని సమర్థంగా అమలు చేయడం, కర్బన ఉద్గారాల (గ్రీన్‌హౌస్ వాయువుల) తగ్గింపుతో వివిధ రంగాల్లో ఇంధన సామర్థ్య లక్ష్యాలను సాధించడం, ఇంధన సామర్థ్యంపై అవగాహన కల్పించడం, శిక్షణ కార్యక్రమాలను నిర్వహించడం, పెట్టుబడులను ఆకర్షించడం, వినూత్న ఫైనాన్సింగ్, మార్కెట్ వ్యూహాలను రూపొందించడం ఈ ఇంధన పాలసీ లక్ష్యం. పరిశ్రమలు, భవనాలు, మున్సిపల్, వ్యవసాయం, రవాణా రంగాల్లో ఇంధన పొదుపు, ఇంధన సామర్థ్య కార్యక్రమాలను రూపొందించడం, నివాస, వాణిజ్య భవనాలు, ప్రభుత్వ కార్యాలయాలలో స్టార్ రేటెడ్ ఇంధన సామర్థ్య పరికరాల వినియోగంపై ఈ పాలసీ దృష్టి సారిస్తుంది. ఇందుకోసం ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో స్టీరింగ్ కమిటీని, వివిధ రంగాలకు చెందిన విభాగాధిపతుల నేతృత్వంలో సాంకేతిక కమిటీని ఏర్పాటు చేయనున్నారు.

ఇంధన శాఖ సన్నాహక సమావేశం



పాలసీని తీసుకురానున్న నేపథ్యంలో ఇంధనశాఖ ఆధ్వర్యంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇంధన పరిరక్షణ మిషన్ (ఏపీఎస్‌ఈసీఎం) కార్యనిర్వాహక కమిటీ సమావేశం కొద్దిరోజుల్లో జరగనుంది. దీనికి సంబంధించిన సన్నాహక సమావేశాన్ని ఆదివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఏపీఎస్‌ఈసీఎం చైర్మన్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఇంధన శాఖ అధికారులతో నిర్వహించారు. రాష్ట్రంలో అమలు జరుగుతున్న ఇంధన పొదుపు కార్యకలాపాలు, ఇంధన సామర్థ్యానికి సంబంధించిన భవిష్యత్తు ప్రణాళికలపై ఈ సమావేశంలో చర్చించారు. రాష్ట్ర ఆర్థికాభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు చేపడుతున్న ప్రభుత్వ విధానాల్లో ఇంధన సామర్థ్య పాలసీ ముఖ్యమైనదని భావిస్తున్నట్లు జవహర్‌రెడ్డి చెప్పారు. అన్ని రంగాలకు సరిపడా విద్యుత్ సరఫరా చేయడానికి ఈ పాలసీ దోహదపడుతుందని ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి విజయానంద్ తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటివరకు రూ.3,800 కోట్ల విలువైన 5,600 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఆదా జరిగినట్లు ఏపీఎస్‌ఈసీఎం సీఈవో ఎ.చంద్రశేఖరరెడ్డి చెప్పారు.

8న తెలంగాణకు మోదీ

రూ.11,355 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం

- సికింద్రాబాద్–తిరుపతి వందే భారత్ రైలుకు పచ్చజెండా..
- స్టేషన్ ఆధునికీకరణ పనులకు భూమి పూజ..
- ఆరు జాతీయ రహదారుల ప్రాజెక్టులు, ఎయిమ్స్‌లో పనులకు కూడా..
- పరేడ్ గ్రౌండ్స్ బహిరంగ సభలో ప్రసంగించనున్న ప్రధాని



సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ రాష్ట్ర పర్యటన ఖరారైంది. ఈ నెల 8వ తేదీన రాష్ట్రానికి రానున్న మోదీ.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ఆధునికీకరణతోపాటు పలు రైల్వే, రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. దీనితోపాటు పరేడ్ గ్రౌండ్స్ బహిరంగ సభలో పాల్గొననున్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటనకుప్రాధాన్యత ఏర్పడింది. ఈ నెల 8న తెలంగాణ పర్యటనలో భాగంగా మొత్తం రూ.11,355 కోట్ల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని మోదీ శ్రీకారం చుడతారని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి వెల్లడించారు. ప్రధాని పర్యటనకు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను ఆయన విడుదల చేశారు. ఆ మేరకు.. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు చేరుకుని అక్కడ సికింద్రాబాద్– తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ (ఇది దేశంలో ప్రవేశపెట్టనున్న 13వ వందేభారత్ రైలు)ను పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారు. అలాగే రూ.715 కోట్ల ఖర్చుతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తారు. సికింద్రాబాద్– మహబూబ్‌నగర్ మధ్య రూ.1,410 కోట్ల వ్యయంతో నిర్మించిన 85 కిలోమీటర్ల డబ్లింగ్ రైల్వేలైన్‌ను జాతికి అంకితం చేస్తారు. సామాన్య ప్రజల రైలుగా మన్ననలు పొందిన ఎంఎంటీఎస్ ఫేజ్–2 లో భాగంగా హైదరాబాద్ శివారు పట్టణాల వరకు నిర్మించిన నూతన రైల్వే లైన్ల మీదుగా నడిచే 13 కొత్త ఎంఎంటీఎస్ సర్వీసులను ప్రారంభిస్తారు. అనంతరం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుండి పరేడ్‌గ్రౌండ్‌లో బహిరంగ సభాస్థలికి ప్రధాని చేరుకుంటారు. సభా వేదిక వద్దే రూ.7,864 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 6 జాతీయ రహదారులకు, రూ.1,366 కోట్లతో బీబీనగర్ ఎయిమ్స్‌లో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తారు. ఆ తర్వాత బహిరంగ సభకు హాజరైన ప్రజలనుద్దేశించి మోదీ ప్రసంగిస్తారు.

తెలంగాణ

డేటా లీకుపై ఈడీ ఆరా

- కీలక సూత్రధారి వినయ్ భరద్వాజ్‌పై కేసు నమోదు
- 24 రాష్ట్రాలకు చెందిన 70 కోట్ల మంది వ్యక్తిగత సమాచారం చౌర్యం
- అన్ని రాష్ట్ర ప్రభుత్వాలను అప్రమత్తం చేసిన సైబరాబాద్ పోలీసులు
- ఇప్పటికే 50 మందికి డేటా విక్రయించిన నిందితుడు వినయ్
- 11 కంపెనీలకు నోటీసులు జారీ చేసిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: దేశంలోని సగం జనాభా వ్యక్తిగత సమాచారాన్ని తస్కరించి, విక్రయించిన కేసుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దృష్టిసారించింది. 70 కోట్ల మంది ప్రజలు, సంస్థలకు చెందిన వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని చౌర్యం చేసిన ఫరీదాబాద్ (హరియాణా)కు చెందిన వినయ్ భరద్వాజ్‌పై ఈడీ మనీలాండరింగ్ కేసు నమోదు చేయనుంది. ఇప్పటికే 17 కోట్ల మంది డేటా లీకు కేసులో సైబరాబాద్ పోలీసులు అరెస్టు చేసిన నిందితులు నితీశ్ భూషణ్ కుమార్, పూజా కుమారి, సుశీల్ తోమర్, అతుల్ ప్రతాప్ సింగ్, ముస్కాన్ హసన్, సందీప్ పాల్, జియా ఉర్ రెహ్మాన్‌లపై పీఎంఎల్ఏ చట్టం కింద కేసు నమోదు చేసి, విచారిస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా దేశంలోని అతిపెద్ద డేటా లీకు కేసులో ప్రధాన సూత్రధారి వినయ్ భరద్వాజ్‌పై కూడా ఈడీ కేసులు నమోదు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ప్రజల వ్యక్తిగత సమాచారంతోపాటు రక్షణ, టెలికం, విద్యుత్, ఇంధనం, జీఎస్‌టీ వంటి ముఖ్యమైన ప్రభుత్వ శాఖల కీలక సమాచారాన్ని నిందితులు తస్కరించి, బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. నిందితుల కార్యకలాపాల్లో ఆర్థిక లావాదేవీల నిర్వహణతోపాటు ఆస్తులు కూడబెట్టినట్లు ఈడీ అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. ఈమేరకు మనీలాండరింగ్ కేసు నమోదు చేయనున్నట్లు సమాచారం.

అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణతోపాటు 24 రాష్ట్రాలకు చెందిన ప్రజలు, ప్రభుత్వ ఉద్యోగుల వ్యక్తిగత సమాచారాన్ని నిందితులు విక్రయానికి పెట్టారు. దీంతో అన్ని రాష్ట్రాల పోలీసులను సైబరాబాద్ పోలీసులు అప్రమత్తం చేశారు. వినయ్ భరద్వాజ్ ఏడాది కాలంగా ఫరీదాబాద్ కేంద్రంగా డేటా నిల్వ, విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాడు. ఇన్‌స్పైర్ వెబ్జ్ వెబ్‌సైట్ ద్వారా ఇప్పటివరకు 50 మందికి డేటాను విక్రయించినట్టు విచారణలో పోలీసులు గుర్తించారు. దీంతో నిందితుడి సెల్‌ఫోన్, ల్యాప్‌టాప్‌లతోపాటు బ్యాంకు లావాదేవీలను పోలీసులు విశ్లేషిస్తున్నారు. ఏడాది కాలంగా నిందితులు డేటా చోరీ, విక్రయ కార్యకలాపాలు నిర్వహిస్తున్నా.. ఏ రాష్ట్ర పోలీసులకు చిక్కకపోవటం గమనార్హం.

ఈ–కామర్స్ కంపెనీలు, బ్యాంకులకు నోటీసులు

ఈ–కామర్స్, ఐటీ కంపెనీలు వినియోగదారుల సమాచారంలో గోప్యత, భద్రత పాటించకపోవడం వల్లే డేటా లీకై నట్టు సైబరాబాద్ పోలీసులు నిర్ధారించారు. యూజర్ల సెన్సిటివ్ పర్సనల్ డేటా ఇన్ఫర్మేషన్ (ఎస్‌పీడీఐ)ను గోప్యంగా ఉంచాల్సిన బాధ్యత సంస్థలదే. కానీ, ఆయా సంస్థలు ఐటీ చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించినట్టు సైబరాబాద్ పోలీసులు గుర్తించారు. దీంతో ఆయా ఈ–కామర్స్ కంపెనీల చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్లను విచారించాలని నిర్ణయించారు. ఈ మేరకు బిగ్ బాస్కెట్, ఫోన్ పే, ఫేస్‌బుక్, క్లబ్ మహీంద్రా, పాలసీ బజార్, అస్ట్యూట్ గ్రూప్, యాక్సిస్ బ్యాంకు, మ్యాట్రిక్స్, టెక్ మహీంద్రా, బ్యాంకు ఆఫ్ బరోడా, బ్యాంక్ ఆఫ్ ఇండియా సంస్థలకు సెక్షన్ 91 కింద నోటీసులు జారీ చేశారు.

వైభవంగా భద్రాద్రి రామయ్య తెప్పోత్సవం



భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వసంత తిరుకల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం వైభవంగా తెప్పోత్సవం నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులను మేళతాళాలు, వేదమంత్రాల నడుమ ఊరేగింపుగా గోదావరి నదికి తీసుకొచ్చారు. ప్రత్యేకంగా అలంకరించిన పడవలో స్వామిని కొలువుదీర్చి పూజలు చేశారు. ఆలయ ఈవో రమాదేవి గోదావరి మాతకు పసుపు, కుంకుమ సమర్పించిన తర్వాత స్వామివారి జలవిహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దొంగలదోపు ఉత్సవాన్ని కనులపండువగా జరిపించారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఊంజల్ సేవ, మంగళవారం వసంతోత్సవం నిర్వహిస్తారు.



గోదావరి నదిలో శ్రీసీతారామచంద్ర స్వామి జలవిహారం

మంచి మాట

అనేవాళ్లు ఎప్పుడూ ఏదో ఒకటి అంటూనే ఉంటారు. లోపాలు అని, పనితీరు అని పనిగట్టుకునో, అదేపనిగానో అక్కర్లేనివాటిని అంటూనే ఉంటారు. మాటల్ని విసిరేస్తూ ఉండేవాళ్లు చాలమందే ఉన్నారు, ఉంటారు. వాళ్లను మనం పరిహరించుకోవాలి. పనికి వచ్చే పనులు చెయ్యలేనివాళ్లు, పనికిమాలిన మాటలు తెగ అంటూ ఉంటారు. అలాంటివాళ్లను తక్షణమే దారిలోంచి పక్కకు నెట్టేస్తూ మనం ముందుకు సాగిపోతూ ఉండాలి.



మూడు 'అ'లు

అభ్యాసం... అధ్యయనం... అవగాహన

ఎవరి మానసికస్థాయిలో వాళ్లు ఇతరుల్ని అర్థం చేసుకుంటూ తొందరపాటు తనంతో ఒక నిర్ణయానికి వచ్చేస్తారు. మనకు తారసపడే వ్యక్తులు వాళ్ల తాహతుకు తగ్గట్టు మనల్ని తూస్తూ ఉంటారు. ఎవరికివాళ్లు మనల్ని వాళ్ల పరిధిల్లోకి కుదించి విశ్లేషిస్తూనో, విమర్శిస్తూనో ఉంటారు. ఈ తీరు ఒక మానసికజాడ్యం. ఇతరుల విశ్లేషణలకూ, విమర్శలకూ, ఆలోచనాసరళికి మనం బలికాకూడదు.



'నీ విలువ నీ సత్వంలో ఉంటుంది; ఏం జరిగినా అది తొలగిపోదు' అని చైనా తాత్త్వికుడు చువాంగ్‌చొ మనకు అవసరమైన సత్యాన్ని తెలియజెప్పారు. ఈ సత్యాన్ని అవగతం చేసుకుంటే మనకు అవసరమైన మేలు ఆగిపోకుండా జరుగుతూ ఉంటుంది. ఈ చువాంగ్‌చొ మాట ఒక విలువైన మార్గదర్శకం. ఇతరులు మన గురించి అనేవి, అనుకునేవి మనకు ఎంత మాత్రమూ ముఖ్యం కాదు. మనం తెలుసుకునే సరైనవి, విలువైనవి, మనం చెయ్యగలిగే సరైనవి, విలువైనవి మనకు, సాటి మనిషికి, సమాజానికి అవసరం అయి నిలబడతాయి.

మన గురించి ఇతరులు అనడానికి, అనుకోవడానికి అతీతంగా, మనపై ఇతరులు చేసే విమర్శలకు, విశ్లేషణలకు లోబడకుండా మనం భవిష్యత్తును వర్తమానానికి తెచ్చుకోవడం నేర్చుకోవాలి; వర్తమానాన్ని గతితప్పకుండా భవిష్యత్తులోకి నడిపించుకోవడం తెలుసుకోవాలి.

'లక్షణానికి లక్ష్యం ఉండాలి; లక్ష్యానికి లక్షణం ఉండాలి'. మనం మెదులుతూ, కదులుతూ ఉండాలి. మనల్ని తోసిపడేసే అవకాశం ఇతరులకు ఇవ్వకూడదు. మనం అడుగు వెయ్యడం పడిపోవడానికి కాదు. ఏ కారణం వల్లా మన నడత పగిలిపోకూడదు. బతకడం చితికిపోవడానికి కాదు; జననం నలిగి పోకూడదు. కదలిక కళ కావాలి; కళలా మనం కదులుతూ ఉండాలి. తలలు పనిచెయ్యాలి; మన తలపులు పండాలి. నీళ్లు చచ్చిపోవు; మనుషులు మనుషులుగానే ప్రవహించాలి. కాంతి కాలిపోదు; మనుగడ మనుగడగానే ప్రసరించాలి.

'నీ గురించి ఇతరులకు తెలియజెప్పుకోవడం మానుకో. అలా చెయ్యడంవల్ల నువ్వు చచ్చిపోవు, నువ్వు జీవితంలోకి వస్తావు. అంతేకాదు, ఇతరులు నీ గురించి అంటున్నదాన్ని పట్టించుకోకు. ఇతరులు నీ గురించి అంటున్నప్పుడు వాళ్లు సంకుచితులు అయిపోతున్నారు. అది వాళ్ల సమస్య. నువ్వు ఇతరులతో కలిసి పనిచేస్తున్నప్పుడు అక్కడ నువ్వు ఒక పనిగానో, ఒక పాత్రగానో ఉండకు; చైతన్యపు ఉనికికి క్షేత్రంగా ఉండు. నీ దగ్గర ఉన్నదాన్నేదో నువ్వు పోగొట్టుకోవచ్చు కానీ నువ్వైనదాన్ని దేన్నీ నువ్వు పోగొట్టుకోవు' అని జర్మన్ తాత్త్వికుడు ఎక్‌హార్ట్ టోల్ సరైన సూచన చేస్తున్నారు. ఇతరులు ఏదో అంటున్నారనీ, అనుకుంటున్నారనీ మనం మన మనుగడను బాధించుకుంటూ ఉండిపోకూడదు.

మూడు 'అ' లు మనకు అత్యవసరం. అవి అభ్యాసం, అధ్యయనం, అవగాహన. ఈ మూడిటి తోడు తీసుకుని మనం కొనసాగాలి, మునుసాగాలి. ఇతరులు మనపై చేసే విశ్లేషణలు, విమర్శలు మనల్ని ఆపెయ్యకూడదు. అవి అడ్డొచ్చినప్పుడల్లా వాటిని ఛేదిస్తూ, భేదిస్తూ మన గమనం మనం చేస్తూ వర్ధిల్లేందుకు మనం వర్తమానమవనున్న భవిష్యత్తులోకి ప్రవేశిద్దాం; భవిష్యత్తు వర్తమానమైనాక మనం అందులో వర్ధిల్లుదాం.

- శ్రీకాంత్ జయంతి

గురువాణి


ఓ చెంచాడు అయినా లేకపోతే...

కష్టం వచ్చినప్పుడు భగవంతుడు మన పక్షాన లేడు.. అనుకుంటాం. దేముడు చల్లగా చూసాడు–అని సుఖం కలిగినప్పుడు అనుకుంటుంటాం. కానీ భగవంతుడికి ఏ పక్షపాతమూ లేదు, ఆయన ఎవరిపక్షాన ఉండడు.

''దృషద్విచిత్రతల్పయో ర్భుజంగమౌక్తికస్రజో/
ర్గరిష్ఠరత్న లోష్ఠయోః సుహృద్విపక్ష పక్షయోః/
తృణారవింద చక్షుషోః ప్రజామహీ మహేంద్రయోః /
సమప్రవర్తికః కదా సదాశివం భజామ్యహమ్.''

కటిక నేలనుంచీ, హంసతూలికా తల్పం వరకూ, మహారాజు నుండి సామాన్యుడి వరకు, మిత్రపక్షం అనీ, శత్రుపక్షం అనీ తేడా లేకుండా అన్నిటినీ సమాన దృష్టితో చూసే ఆ సదాశివుడికి నమస్కారం.. అంటాం.

వివేకానందుడు చెప్పినట్టు – ఈ ప్రపంచమంతా నీ పూజా మందిరంగా చూసే శక్తి రావాలి. భగవంతుడిని ఏమార్చి ఆయనను మన పక్షానికి తీసుకురావడం ఎప్పటికీ సాధ్యమయ్యేది కాదు. ఆయన ప్రీతి పొందేది మన నడవడికను బట్టే. మన నడవడి ధర్మాన్ని ఆశ్రయించి ఉండాలి. మనం సముద్రమంత ప్రయత్నం చేయవచ్చుగాక, కానీ ఓ చెంచాడంత భగవదనుగ్రహం ఉండకపోతే కార్యాలు సఫలీకృతం కావు. 'ఆచార్య ప్రభవో ధర్మః. ధర్మం అనేది కేవలం పుస్తకాలలో చదువుకుంటేనో, అన్నీ నాకు తెలుసనుకుంటేనో అన్వయం కాదు. నీవు ఎంత అనుష్ఠించావో అదే ధర్మం. ధర్మాత్ముడు.. అనిపించుకోవాలంటే నీ నడవడిక మొత్తం ధర్మబద్ధంగా ఉండాలి. ఆచరించినది ధర్మం. ఆచరించనిది ఎప్పటికీ ధర్మం కాదు. అమెరికాకు అధ్యక్షులుగా చేసినవారిలో చిరస్మరణీయుడైన అబ్రహాం లింకన్ ఒక మాటన్నారు...''దేముడు నీ పక్షాన ఉన్నాడా అని ఆలోచించడం కాదు, దేముడి మార్గంలో నీవు ఉన్నావా !'' అని చూసుకొమ్మన్నారు. ఆయన బాల్యంనుంచీ అలానే బతికారు. నిరుపేద. చిన్నతనంలో ఒక దుకాణంలో పనిచేస్తుండేవాడు.. ఒక వినియోగదారుడి దగ్గర తీసుకోవాల్సిన దానికంటే ఎక్కువ సొమ్ము తీసుకున్నారు. ఆ తరువాత లెక్కలు చూసుకుంటుంటే తెలిసింది. దుకాణం మూసేసి అర్ధరాత్రి వినియోగదారుడి ఇల్లు వెతుక్కుంటూ పోయి తాను ఎక్కువగా తీసుకొన్న మొత్తాన్ని ఇచ్చేసి మరీ వచ్చాడు. అదీ అనుష్ఠానం లో ధర్మం అంటే... ఈ పరిణతి ఆయన ఎంతసేపు పూజ చేసాడు, ఎంత సేపు ప్రార్థన చేసాడు.. అన్న దానినిబట్టి రాలేదు... చిన్నతనం నుంచి అదే నిబద్ధతతో బతకబట్టి వచ్చింది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

మీకు ధర్మంపట్ల అనురక్తి ఉండి ఆచరించినదేదో అదే ధర్మం. అదే సదాచారం. ధర్మంపట్ల అనురక్తి లేకుండా స్వప్రయోజనం చూసుకుంటే అది దురాచారం. ఎక్కడ సదాచారం ఉన్నదో అక్కడ భగవదనుగ్రహం ఉండి తీరుతుంది. ఎక్కడ సదాచారం లేదో అక్కడ దేముని కృప ఎలా సాధ్యం! నీకు ఆకలేస్తే నువ్వే తినాలి. నీకు నిద్రవస్తే నీవే నిద్రపోవాలి. అలాగే నీ నడవడికలో దోషాలను నీవే దిద్దుకోవాలి. సదాచారం పెరుగుతూ ఉండాలి, దురాచారం తగ్గుతూ పోవాలి. ధర్మం చెప్పేది కూడా... నీవు నన్ను కాపాడు.. నేను నీ పక్షాన ఉండి నిన్ను కాపాడతా...అనే.

బౌద్ధవాణి

ప్రత్యక్ష జ్ఞానం... శ్రేష్ఠ జ్ఞానం

బుద్ధుడు ఒక సమయంలో జేతవనంలో ఉంటున్నాడు. ఆ సమయంలో వైశాలీ నగరానికి చెందిన జానుశ్రోణి అనే పండితుడు తెల్లని గుర్రాలు పూన్చిన రథం మీద బయలుదేరాడు. నగరం వెలుపలికి రాగానే పిలోత వాత్సాయనుడు అనే మరో పండితుడు ఎదురయ్యాడు. జానుశ్రోణుడు రథం ఆపి –''పిలోతికా ప్రణామం. తమరు ఎక్కడి నుండి వస్తున్నారు?'' అని అడిగాడు

''భగవాన్ బుద్ధుని దగ్గర నుండి'' అన్నాడు.

''బుద్ధుడు మహాప్రజ్ఞానే అంటారా?'' అని అడిగాడు జాను శ్రోణుడు.

''మహాశయా! వారి ప్రజ్ఞను తెలుసుకోడానికి నేనెంతటి వాణ్ణి'' అన్నాడు వినమ్రంగా.

''వాత్సాయనా! మీరు మరీనూ! తెలియదు అంటూనే ''బుద్ధుడు మహా ప్రజ్ఞాని'' అని సగర్వగర్వితంగా చెప్పేస్తున్నారు. మీరు ఆయనలో ఏం చూసి ఆ నిర్ణయానికొచ్చారు?'' అని అడిగాడు.



''ఒకడు అడవిలోకి ఏనుగుల కోసం వెళ్లాడు. అక్కడే ఒక పెద్ద ఏనుగు పాదం గుర్తు కనిపిస్తుంది. ఆ పాద చిహ్నాన్ని చూసి ''ఆహా! ఇది చాలా పెద్ద ఏనుగు'' అని అనుకుంటాడు కదా! అన్నం అంతా అవసరం లేదు. ఒక్క మెతుకు పట్టి చూస్తే చాలు కదా'' అన్నాడు పిలోత వాత్సాయనుడు.

''మంచిది'' అని ముందుకు కదిలాడు జాను శ్రోణుడు.

నేరుగా బుద్ధుని దగ్గరకు వెళ్ళి నమస్కరించి, ఒక పక్కన నిలబడ్డాడు. తనకూ పిలోతునికీ జరిగిన సంవాదం గురించి చెప్పాడు.

అప్పుడు బుద్ధుడు–

''పండితా! పిలోతుడు చెప్పిన ఏనుగు ఉపమానం అక్కడితో ఆగిపోదు. పాద చిహ్నాల్ని చూసి ఏనుగుని ఇలా ఉంటుందని నిర్ణయించలేం''

'శ్రోణా! ఒకడు ఏనుగు కోసం అడవికి వెళ్ళాడు. అతనికి పెద్ద పెద్ద ఏనుగు పాదాలు కనిపించాయి. వాటి వెనుకే వెళ్ళి చూశాడు. తీరా వెళ్ళి చూస్తే అది 'వామనికం' అనే చిన్న ఏనుగు. అతను మరోసారి అడవికి వెళ్ళాడు. ఈ సారి కూడా పెద్ద పాదాల గుర్తులు చూశాడు. అది కూడా 'కళారికం' అనే మరుగుజ్జు ఏనుగువే. మరోసారి కూడా అలాగే చూసి వెళ్ళాడు. ఈసారి 'కరేణుకం' అనే చిన్న ఆడ ఏనుగు కనిపించింది. అలా మూడుమార్లూ పాద చిహ్నాలు సరైనవి కాలేదు.

మరోసారి కూడా పెద్ద పెద్ద పాద చిహ్నాలు కనిపించాయి. వాటిని వెంబడించాడు. దారిలో ఎత్తైన చెట్ల కొమ్మలు విరిగి కన్పించాయి. ఆ కొమ్మలకు బురద అంటి ఉంది. ఏనుగు చర్మం రాచుకుపోయిన ఆనవాళ్ళు ఉన్నాయి. ఈసారి ఈ దారిలో పోయింది పెద్ద ఏనుగే అని నిర్ణయించుకున్నాడు. వెళ్ళాడు. చూశాడు. పెద్ద వృక్షం దగ్గర నిలబడి విశ్రాంతి తీసుకుంటూ కనిపించింది పెద్ద ఏనుగు. ఆ పాద చిహ్నాలు దానివే'' అని చెప్పి – ప్రత్యక్ష జ్ఞానాన్ని అయినా సాక్షాత్కరించుకొన్న వానికే ఏది సత్యమో ఏది అసత్యమో తెలుస్తుంది. అలాంటి వాడు మాత్రమే ప్రాజ్ఞుడు– అంటాడు బుద్ధుడు.

బుద్ధుని సమాధానం విని సంతృప్తి చెందాడు జానుశ్రోణుడు. వినయంతో వంగి నమస్కరించాడు.


- డా. బొర్రా గోవర్ధన్

అమృత బిందువులు

- మంచివారితో మంచిగా ఉండండి. కానీ... చెడ్డవారితో చెడ్డగా ఉండకండి. ఎందుకంటే, వజ్రాన్ని వజ్రంతో కోయవచ్చు, కానీ... బురదని బురదతో కడగలేము కదా.
- సమసిపోయే మార్గం అన్వేషించు చిక్కుముడి వీడే దిశగా శోధించు ప్రయత్న లోపం లేకుండా ప్రయత్నించు విజయం నీదే మరి
- కొత్త బంధాలను, కొత్త స్నేహాలను కలుపుకోవడం కన్న ఉన్న బంధాలను నిలుపుకోవడం చాలా చాలా ఇష్టం.
- మనస్సులో సంతోషం లేనపుడు మనం ఏడంతస్థుల మేడలో ఉన్నా ఏమీ లేని గుడిసెలో ఉన్నా ఒకటే.

సినిమా

వెకేషన్ టైమ్



మహేశ్‌బాబు

ప్రతి ఏడాది వేసవిలో కుటుంబంతో కలిసి వెకేషన్ కోసం విదేశాలకు వెళ్తుంటారు హీరో మహేశ్ బాబు. ఈ ఏడాది కూడా వెళ్లనున్నారాయన. ఈ నెల మొదటి వారంలోనే మహేశ్ బాబు వెకేషన్ మోడ్ ఆన్ కానుంది. ఇప్పటికే ఆయన సతీమణి నమ్రత, పిల్లలు విదేశాల్లోనే ఉన్నారని, అతి త్వరలో మహేశ్ కూడా ఫ్యామిలీతో జాయిన్ అవుతారని సమాచారం. త్రివిక్రమ్ దర్శకత్వంలో తాను హీరోగా నటిస్తున్న సినిమా షూటింగ్‌తో బిజీగా ఉన్నారు మహేశ్ బాబు. మరో మూడు, నాలుగు రోజులు ఈ షూట్‌లో పాల్గొన్న తర్వాత ఫారిన్ ఫ్లైట్ ఎక్కనున్నారాయన. ఈ నెలాఖరున హైదరాబాద్‌కు తిరిగొచ్చి మళ్లీ షూటింగ్‌లో జాయిన్ అవుతారు. ఈ మూవీలో పూజాహెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. హారిక అండ్ హాసినీ క్రియేషన్స్ పతాకంపై ఎస్.రాధాకృష్ణ నిర్మిస్తున్న ఈ సినిమా 2024, జనవరి 13న విడుదల కానుంది.

హైదరాబాద్ టు గోవా



ఎన్టీఆర్

'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ చిత్రం తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో ఓ సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. హీరో కల్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రంలో బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్ హీరోయిన్. ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఫారిన్ స్టంట్ కొరియోగ్రాఫర్ కెన్నీ బెట్స్ డిజైన్ చేసిన ఓ యాక్షన్ సీక్వెన్స్‌లో ఎన్టీఆర్ పాల్గొంటున్నారట. షిప్‌లో సాగే ఈ ఫైట్ కోసం ప్రస్తుతం చిత్రయూనిట్ నైట్ షూట్ జరుపుతోంది. కాగా ఈ సినిమా తర్వాతి షెడ్యూల్‌ను గోవాలో ప్లాన్ చేశారని తెలిసింది. ఈ షెడ్యూల్‌లో ఎన్టీఆర్, జాన్వీలపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారట. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 5న రిలీజ్ కానుంది.

టార్గెట్ ఫిక్స్



కమల్ హాసన్

భారతీయుడికి టార్గెట్ ఫిక్స్ చేశారు దర్శకుడు శంకర్. 1996లో హీరో కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో వచ్చిన హిట్ మూవీ 'ఇండియన్'కి(తెలుగులో భారతీయుడు) సీక్వెల్‌గా తీస్తున్న 'ఇండియన్ 2' షూటింగ్ జరుగుతోంది. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ తైవాన్‌లో జరుగుతోంది. కమల్ హాసన్‌పై కీలకమైన యాక్షన్ సీక్వెన్స్‌లను తెరకెక్కిస్తున్నారు శంకర్. ఇందులో ఓ ట్రెయిన్ యాక్షన్ సీక్వెన్స్ కూడా ఉందని కోలీవుడ్ టాక్. అయితే 'ఇండియన్ 2' టాకీ పార్ట్ షూటింగ్‌ను జూన్‌కల్లా పూర్తి చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయట. ఇటీవల జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న శంకర్ ఈ విషయాన్ని వెల్లడించారు. ''టాకీ పార్టు పూర్తి కాగానే ఓ పాట చిత్రీకరిస్తాం.. దీంతో మేజర్ షూటింగ్ పూర్తవుతుంది. జూన్ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్‌ను స్టార్ట్ చేస్తాం'' అన్నారు శంకర్. కాజల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీలో రకుల్ ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, బాబీ సింహా కీలక పాత్రలు పోషిస్తున్నారు.

విరూపాక్ష అదిరిపోద్ది - సాయితేజ్

''విరూపాక్ష' చిత్రాన్ని దయచేసి థియేటర్లలో చూడండి.. సినిమా అదిరిపోద్ది. ప్రేక్షకుల అంచనాలను మించి ఉంటుంది. మా సినిమాకి వాయిస్ ఓవర్ ఇచ్చిన తారక్ అన్నకి (ఎన్టీఆర్) థ్యాంక్స్.. ఆయన వాయిస్ మా మూవీకి చాలా ప్లస్ అయింది'' అని హీరో సాయిధరమ్ తేజ్ అన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్, సంయుక్తా మీనన్ జంటగా తెరకెక్కిన చిత్రం 'విరూపాక్ష'. బాపినీడు.బి సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్ఎల్‌పీ, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 21న పాన్ ఇండియా స్థాయిలో విడుదలవుతోంది.



బాపినీడు, బీవీఎస్ఎన్ ప్రసాద్, కార్తీక్, సాయిధరమ్ తేజ్, సంయుక్తా మీనన్

ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ–''అభిమానులు, ప్రేక్షకుల ఆశీర్వాదాల వల్లే నేను మళ్లీ ఈ వేదికపై నిలుచున్నా. మీ అందరి ప్రార్థనలు, సపోర్ట్ వల్లే 'విరూపాక్ష' బయటికి వచ్చింది. 2019లో సుకుమార్‌గారు ఫోన్ చేసి, 'విరూపాక్ష' కథ వినమన్నారు. ప్రేమకథ అయ్యుంటుందిలే చేసేద్దాం అనుకున్నా. కానీ, కార్తీక్ వచ్చి థ్రిల్లర్ అనగానే షాక్ అయ్యాను. 'విరూపాక్ష' కథ మొత్తం విన్నాక ఇది బ్లాక్‌బస్టర్ అవుతుంది, చేయాలని ఫిక్స్ అయిపోయాను. మా కొడుకులు 'విరూపాక్ష' సినిమా చేశారని మా అమ్మ, కార్తీక్ అమ్మ గర్వంగా చెబుతారు. సెట్స్‌లో నాకు ధైర్యం చెబుతూ సపోర్ట్ చేసిన ప్రసాద్, సుకుమార్, బాపినీడు గార్లకు, తోటి నటీనటులకు థ్యాంక్స్'' అన్నారు. ''2018లో సుకుమార్‌గారికి 'విరూపాక్ష' కథ చెప్పాను. కరోనా, లాక్‌డౌన్, తేజ్‌గారికి ప్రమాదం వల్ల సినిమా ఆలస్యం అయ్యింది'' అన్నారు కార్తీక్ దండు. ''విరూపాక్ష' యూనివర్సల్ సబ్జెక్ట్.. అందుకే పాన్ ఇండియా స్థాయిలో తీశాం'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్.



సమంత

నేను అలా అనుకోవడం లేదు - సమంత

''వైవాహిక జీవితానికి ముగింపు పలికిన కొన్నిరోజులు నాకు ఎంతో కష్టంగా గడిచాయి'' అన్నారు హీరోయిన్ సమంత. గుణశేఖర్ దర్శకత్వంలో సమంత లీడ్ రోల్‌లో నటించిన 'శాకుంతలం' సినిమా ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో సమంత మాట్లాడుతూ–''స్వతంత్ర భావాలున్న ఓ బలమైన మహిళగా కొందరు నన్ను ఊహించుకుంటారు. కానీ, నేను అలా అనుకోవడం లేదు. జీవితంలో ఎన్నో కష్టాలు, బాధలు అనుభవించాను. నా జీవితంలోనూ కొన్ని చీకటి రోజులున్నాయి. ఆ సమయంలో (విడాకులు తీసుకున్న టైమ్‌లో) పిచ్చి పిచ్చి ఆలోచనలు నా మనసును ఉక్కిరిబిక్కిరి చేశాయి. నా స్నేహితులు, సన్నిహితులు, శ్రేయోభిలాషుల సపోర్ట్‌తో ఆ పరిస్థితుల నుంచి బయటపడ్డాను. ఇంకా ఆ పరిస్థితుల తాలూకు బాధను అనుభవిస్తూనే ఉన్నాను. కానీ ఆ ప్రభావం ఇప్పుడు తగ్గింది'' అన్నారు. 2017లో వివాహం చేసుకున్న నాగ చైతన్య, సమంత ఆ తర్వాత 2021లో విడాకులు తీసుకున్న సంగతి తెలిసిందే.

నటుడు కాస్ట్యూమ్ కృష్ణ ఇక లేరు



తెలుగు చలన చిత్ర పరిశ్రమలో విషాదం చోటు చేసుకుంది. ప్రముఖ నటుడు, నిర్మాత కాస్ట్యూమ్ కృష్ణ (86) ఇకలేరు. చెన్నైలోని స్వగృహంలో ఆదివారం తుదిశ్వాస విడిచారు. కాస్ట్యూమ్ కృష్ణది ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లా లక్కవరపు కోట. ఆయన అసలు పేరు మాదాసు కృష్ణ. సినిమా రంగంలో కాస్ట్యూమ్ డిజైనర్‌గా స్థిరపడిపోవడంతో ఆయన పేరు కాస్ట్యూమ్ కృష్ణగా ప్రాచుర్యం పొందింది. చెన్నైలో కాస్ట్యూమ్ డిజైనర్ అసిస్టెంట్‌గా పలు చిత్రాలకు పని చేసిన ఆయన ఆ తర్వాత 1954లో కాస్ట్యూమ్ డిజైనర్‌గా సొంతంగా చిత్రాలను చేయడం ప్రారంభించారు. సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థలో ఎక్కువ రోజులు పని చేయడంతో ఆయన్ను 'సురేశ్' కృష్ణ అనేవారు. ఆ తర్వాత కాస్ట్యూమ్ కృష్ణగా ఆయన పేరు స్థిరపడింది. తెలుగులో ఎన్టీఆర్, ఏఎన్నార్, చిరంజీవి, వాణిశ్రీ, జయచిత్ర, జయప్రద, శ్రీదేవి వంటి ప్రముఖుల చిత్రాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారు కృష్ణ. కాగా ఈయనలోని యాక్టర్‌ని గుర్తించిన దర్శకుడు కోడి రామకృష్ణ 'భారత్ బంద్'(1991) చిత్రం ద్వారా నటుడిగా పరిచయం చేశారు. ఆ తర్వాత 'అల్లరి మొగుడు, దేవుళ్లు, మా ఆయన బంగారం, పెళ్లి పందిరి, పెళ్లాం చెపితే వినాలి, పుట్టింటికి రా చెల్లి, విలన్' వంటి పలు చిత్రాల్లో నటించి ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు పొందారాయన. అలాగే 'అశ్వత్థామ' చిత్రం ద్వారా నిర్మాతగా మారిన కృష్ణ 'పెళ్లి పందిరి, అగ్గి రాముడు' వంటి ఎనిమిది సినిమాలు నిర్మించారు. వృద్ధాప్యం కారణంగా సినిమాలకు దూరంగా ఉంటున్న కాస్ట్యూమ్ కృష్ణ ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరి, చికిత్స పొంది ఇంటికొచ్చారు. కాగా ఆదివారం అర్ధరాత్రి 1.45 నిమిషాల ప్రాంతంలో తుదిశ్వాస విడిచినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. కాస్ట్యూమ్ కృష్ణకి భార్య భారతి, కుమారులు శేఖర్, రవి, కుమార్తెలు ధనలక్ష్మి, వాణి ఉన్నారు. కాగా నేటి ఉదయం చెన్నై గిండీలోని శ్మశానవాటికలో కాస్ట్యూమ్ కృష్ణ అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

బలగంకు మరో అవార్డు



బలగం పోస్టర్

అంతర్జాతీయ వేదికపై 'బలగం' సినిమా మరోసారి సత్తా చాటింది. ఉక్రెయిన్‌లో జరిగిన ఓనికో ఫిల్మ్ అవార్డ్స్‌లో ఈ మూవీకి ఉత్తమ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో అవార్డు లభించింది. ప్రియదర్శి, కావ్య జంటగా వేణు ఎల్దండి దర్శకత్వం వహించిన చిత్రం 'బలగం'. 'దిల్' రాజు ప్రొడక్షన్స్ సమర్పణలో హన్షిత, హర్షిత్ నిర్మించిన ఈ మూవీ మార్చి 3న విడుదలైంది.

మా ఊహ నిజమైంది - సుమన్

''పరారి' సినిమాలో నేను ఓ పోలీస్ ఆఫీసర్ పాత్ర చేశాను. యూనిట్ అంతా చాలా కష్టపడి తీసిన ఈ చిత్రం హిట్ సాధించినందుకు సంతోషంగా ఉంది. మేము ఊహించినట్లుగానే ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది'' అని నటుడు సుమన్ అన్నారు. యోగేశ్వర్, అతిథి జంటగా సాయి శివాజీ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పరారి'. గాలి ప్రత్యూష సమర్పణలో జీవీవీ గిరి నిర్మించిన ఈ చిత్రం మార్చి 30న విడుదలైంది. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో యోగేశ్వర్ మాట్లాడుతూ–''హీరోగా 'పరారి' నా తొలి చిత్రం. నేను బాగా నటించానని అందరూ అభినందిస్తుంటే సంతోషంగా ఉంది. నా తొలి సినిమాలోనే సుమన్, అలీ, జీవా, భూపాల్ వంటి సీనియర్స్‌తో నటించడం హ్యాపీ'' అన్నారు. ''మా చిత్రానికి నేటి నుంచి థియేటర్స్ సంఖ్యను పెంచుతున్నాం'' అన్నారు జీవీవీ గిరి.



యోగేశ్వర్, సుమన్, జీవీవీ గిరి



ఐపీఎల్‌కు విలియమ్సన్ దూరం

న్యూజిలాండ్ స్టార్ క్రికెటర్, గుజరాత్ టైటాన్స్ జట్టు ప్లేయర్ కేన్ విలియమ్సన్ మోకాలి గాయంతో ఐపీఎల్ 2023 టోర్నీకి పూర్తిగా దూరమయ్యాడు. ఈ విషయాన్ని డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్ ఆదివారం అధికారికంగా ప్రకటించింది. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో ఇన్నింగ్స్ 13వ ఓవర్లో బౌండరీ లైన్ వద్ద క్యాచ్ పట్టే ప్రయత్నంలో విలియమ్సన్ కుడి మోకాలికి గాయమైంది. గత ఏడాది వరకు సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడిన 32 ఏళ్ల విలియమ్సన్ ఈ సీజన్‌లో తొలిసారి గుజరాత్ తరఫున బరిలోకి దిగాడు.

హారిక తొలి విజయం

అంతర్జాతీయ చెస్ సమాఖ్య (ఫిడే) మహిళల గ్రాండ్‌ప్రి టోర్నీలో భారత గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక తొలి విజయం నమోదు చేసింది. న్యూఢిల్లీలో జరుగుతున్న ఈ టోర్నీలో ఆదివారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌లో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి హారిక 47 ఎత్తుల్లో నినో బత్సియాష్‌విలి (జార్జియా)పై నెగ్గింది. భారత్‌కే చెందిన మరో ప్లేయర్ వైశాలి మూడో ఓటమి చవిచూసింది. మువలోవా (రష్యా)తో జరిగిన గేమ్‌లో వైశాలి 43 ఎత్తుల్లో ఓడింది.



సింధుకు నిరాశ

- స్పెయిన్ మాస్టర్స్ టోర్నీలో రన్నరప్‌గా భారత స్టార్
- ఫైనల్లో ఇండోనేసియా ప్లేయర్ మరిస్కా చేతిలో ఓటమి



మాడ్రిడ్: ఈ ఏడాది ఫైనల్ చేరిన తొలి టోర్నీలో విజేతగా నిలిచి తొలి టైటిల్ సాధించాలని ఆశించిన భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు నిరాశ ఎదురైంది. స్పెయిన్ మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్-300 టోర్నీలో ప్రపంచ 11వ ర్యాంకర్ సింధు రన్నరప్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ గ్రెగోరియా మరిస్కా తున్‌జుంగ్ (ఇండోనేసియా) కేవలం 29 నిమిషాల్లో 21-8, 21-8తో సింధును ఓడించి టైటిల్ సొంతం చేసుకుంది. గతంలో సింధుతో ఆడిన ఏడుసార్లూ ఓడిపోయిన మరిస్కా ఎనిమిదో ప్రయత్నంలో తొలిసారి గెలుపొందడం విశేషం. ఫైనల్లో సింధు ఏదశలోనూ మరిస్కాకు పోటీనివ్వలేకపోయింది. విన్నర్ మరిస్కాకు 15,750 డాలర్లు (రూ. 12 లక్షల 93 వేలు), రన్నరప్ సింధుకు 7,980 డాలర్లు (రూ. 6 లక్షల 55 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

విజేత వెర్‌స్టాపెన్

ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి



మెల్‌బోర్న్: తన కెరీర్‌లో లోటుగా ఉన్న ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రి ఫార్ములావన్ రేసులో ఏడో ప్రయత్నంలో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన సీజన్ మూడో రేసులో వెర్‌స్టాపెన్ 'పోల్ పొజిషన్'తో బరిలోకి దిగాడు. మూడుసార్లు ట్రాక్‌పై ఆయా జట్ల డ్రైవర్ల కార్లు అదుపు తప్పడం లేదా ఢీ కొట్టుకోవడంతో రేసుకు మూడుసార్లు అంతరాయం కలిగింది. చివరకు వెర్‌స్టాపెన్ నిర్ణీత 58 ల్యాప్‌లను 2 గంటల 32 నిమిషాల 38.371 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. రేసును ప్రారంభించిన 20 మంది డ్రైవర్లలో 12 మంది మాత్రమే గమ్యానికి చేరారు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది రెండో విజయం. హామిల్టన్ (మెర్సిడెస్) రెండో స్థానంలో, ఫెర్నాండో అలోన్సో (ఆస్టన్ మార్టిన్) మూడో స్థానంలో నిలిచారు. సీజన్‌లోని నాలుగో రేసు అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రి ఏప్రిల్ 30న జరుగుతుంది.


'సూపర్ ఓవర్'లో శ్రీలంక విజయం


అసలంక

ఆక్లాండ్: న్యూజిలాండ్ జట్టుతో ఆదివారం జరిగిన తొలి టి20 మ్యాచ్‌లో శ్రీలంక 'సూపర్ ఓవర్'లో గెలిచింది. తొలుత శ్రీలంక 20 ఓవర్లలో 5 వికెట్లకు 196 పరుగులు చేసింది. అసలంక (41 బంతుల్లో 67; 2 ఫోర్లు, 6 సిక్స్‌లు), కుశాల్ పెరీరా (45 బంతుల్లో 53; 4 ఫోర్లు, 1 సిక్స్) మెరిపించారు. అనంతరం న్యూజిలాండ్ కూడా 20 ఓవర్లలో 8 వికెట్లకు 196 పరుగులు చేసింది. శ్రీలంక కెప్టెన్ షనక వేసిన 20వ ఓవర్ చివరి బంతికి కివీస్ బ్యాటర్ ఇష్ సోధి సిక్స్ కొట్టడంతో స్కోరు సమమైంది. ముందుగా 'సూపర్ ఓవర్' ఆడిన న్యూజిలాండ్ 2 వికెట్లకు 8 పరుగులు చేసింది. అనంతరం శ్రీలంక 3 బంతుల్లో 11 పరుగులు చేసి గెలిచింది.

మార్క్‌రమ్ 175

రెండో వన్డేలో దక్షిణాఫ్రికా గెలుపు



జొహానెస్‌బర్గ్: నెదర్లాండ్స్‌తో జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 146 పరుగుల తేడాతో గెలిచి సిరీస్‌ను 2-0తో దక్కించుకుంది. ముందుగా దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 8 వికెట్లకు 370 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (126 బంతుల్లో 175; 17 ఫోర్లు, 7 సిక్స్‌లు) వన్డేల్లో తన తొలి సెంచరీ సాధించాడు. డేవిడ్ మిల్లర్ (61 బంతుల్లో 91; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీని చేజార్చుకున్నాడు. నెదర్లాండ్స్ 39.1 ఓవర్లలో 224 పరుగులకు ఆలౌటైంది. దక్షిణాఫ్రికా పేసర్ మగాలా 43 పరుగులిచ్చి 5 వికెట్లు తీసుకున్నాడు.

సన్‌రైజర్స్ ఢమాల్...

ఒక్క మెరుపు బ్యాటింగ్ ప్రదర్శన లేదు. గెలిపించే భాగస్వామ్యమే రాలేదు. టాప్-5లో ఒక్కరూ కనీసం ఒక్క సిక్స్ అయినా కొట్టలేదు. ఇలాంటి ఆటతో ఐపీఎల్ మ్యాచ్ గెలవాలని ఏ జట్టయినా కోరుకోవడం అత్యాశే అవుతుంది. ఆదివారం ఉప్పల్ మైదానంలో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆట ఇలాగే ఉంది. ముందుగా నియంత్రణ లేని బౌలింగ్‌తో రెండొందలకు పైగా పరుగులు ఇచ్చిన జట్టు ఆ తర్వాత బ్యాటింగ్‌లో పూర్తిగా చేతులెత్తేసింది. తొలి ఓవర్లోనే 2 వికెట్లు కోల్పోయిన తర్వాత ఇక కోలుకునే అవకాశమే లేకపోయింది. ఫలితమే సొంత గడ్డపై భారీ ఓటమి. అన్ని రంగాల్లో రాణించిన రాజస్తాన్ రాయల్స్ ఘనవిజయంతో తమ సీజన్ ప్రస్థానాన్ని మొదలు పెట్టింది.

- తొలి మ్యాచ్‌లో పేలవ ప్రదర్శన
- 72 పరుగుల తేడాతో ఓటమి
- రాజస్తాన్ రాయల్స్ ఘనవిజయం
- మెరిసిన సామ్సన్, బట్లర్, యశస్వి



చహల్ బౌలింగ్‌లో హ్యారీ బ్రూక్ బౌల్డ్



బట్లర్

సాక్షి, హైదరాబాద్: కొత్త ఐపీఎల్ సీజన్‌ను సన్‌రైజర్స్ హైదరాబాద్ చెత్తగా ప్రారంభించింది. సొంత గడ్డపై జరిగిన తొలి పోరులో పేలవ ప్రదర్శనతో ఓటమిని మూటగట్టుకుంది. ఆదివారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో రాజస్తాన్ రాయల్స్ 72 పరుగుల తేడాతో సన్‌రైజర్స్‌పై ఘన విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన రాజస్తాన్ రాయల్స్ 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసింది. జట్టులో టాప్-3 ఆటగాళ్లు అర్ధ సెంచరీలు సాధించడం విశేషం. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' జోస్ బట్లర్ (22 బంతుల్లో 54; 7 ఫోర్లు, 3 సిక్స్‌లు), కెప్టెన్ సంజూ సామ్సన్ (32 బంతుల్లో 55; 3 ఫోర్లు, 4 సిక్స్‌లు), యశస్వి జైస్వాల్ (37 బంతుల్లో 54; 9 ఫోర్లు) హాఫ్ సెంచరీలు నమోదు చేశారు. అనంతరం సన్‌రైజర్స్ హైదరాబాద్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 131 పరుగులు చేసి ఓడిపోయింది. అబ్దుల్ సమద్ (32 బంతుల్లో 32 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. రాజస్తాన్ రాయల్స్ లెగ్ స్పిన్నర్ చహల్ (4/17) ఆకట్టుకున్నాడు.

ఓపెనర్ల జోరు...

పవర్‌ప్లేలో ఇద్దరు రాజస్తాన్ ఓపెనర్లు యశస్వి, బట్లర్ విధ్వంసం సృష్టించారు. సన్‌రైజర్స్ తాత్కాలిక కెప్టెన్ భువనేశ్వర్ వేసిన తొలి ఓవర్లో 6 పరుగులే వచ్చినా... ఆ తర్వాతి ఐదు ఓవర్లలో రాయల్స్ వరుసగా 14, 17, 19, 17, 12 పరుగులు రాబట్టింది. భువీ ఓవర్లో యశస్వి రెండు ఫోర్లు, బట్లర్ సిక్స్ కొట్టగా... వాషింగ్టన్ సుందర్ ఓవర్లో వరుస బంతుల్లో బట్లర్ రెండు సిక్స్‌లు బాదాడు. ఆపై నటరాజన్ ఓవర్లో బట్లర్ 4 ఫోర్లతో చెలరేగాడు. ఫజల్ ఓవర్లో కూడా 3 ఫోర్లు కొట్టి 20 బంతుల్లోనే అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్న బట్లర్ అదే ఓవర్లో వెనుదిరిగాడు. దాంతో 85 పరుగుల (35 బంతుల్లో) తొలి వికెట్ భాగస్వామ్యానికి తెర పడింది. 7.4 ఓవర్లలో రాజస్తాన్ స్కోరు 100 పరుగులకు చేరింది. ఈ దశలో రాయల్స్ ఇన్నింగ్స్ బాధ్యతను కెప్టెన్ సామ్సన్ తీసుకున్నాడు. సామ్సన్ తనదైన శైలిలో దూకుడు ప్రదర్శించగా, మరోవైపు 34 బంతుల్లో యశస్వి హాఫ్ సెంచరీ పూర్తయింది. ఉమ్రాన్ తొలి ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు కొట్టిన సామ్సన్, అతని తర్వాతి మరో ఫోర్, సిక్స్ బాదాడు. తక్కువ వ్యవధిలో రాజస్తాన్ జట్టు యశస్వి, దేవదత్ పడిక్కల్ (2), రియాన్ పరాగ్ (7) వికెట్లను కోల్పోగా, 28 బంతుల్లో సామ్సన్ హాఫ్ సెంచరీ మార్క్‌ను అందుకున్నాడు. హైదరాబాద్ బౌలర్లు కట్టడి చేయడంతో 7-15 మధ్య తొమ్మిది ఓవర్లలో రాజస్తాన్ 75 పరుగులు చేసింది.


యశస్వి జైస్వాల్


సామ్సన్


చహల్, సైనీ, అశ్విన్

ఐపీఎల్‌లో నేడు

చెన్నై × లక్నో (రాత్రి గం. 7:30 నుంచి)

స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

ఆపై డెత్ ఓవర్లలో కూడా స్కోరును పెంచుకోవడంలో రాయల్స్ విఫలమైంది. మరోసారి హైదరాబాద్ బౌలర్లు చక్కటి బంతులతో ప్రత్యర్థిని నిరోధించగలిగారు. ఆఖరి ఐదు ఓవర్లలో సామ్సన్ వికెట్ కోల్పోయి రాజస్తాన్ 43 పరుగులే సాధించగలిగింది. భారీ ఓపెనింగ్ భాగస్వామ్యం కారణంగానే ఆ జట్టు స్కోరు 200 పరుగులు దాటింది.

సమష్టి వైఫల్యం...

భారీ లక్ష్య ఛేదనలో రైజర్స్‌కు ఆరంభంలోనే దెబ్బ పడింది. బౌల్ట్ వేసిన తొలి ఓవర్లోనే అభిషేక్ శర్మ (0), రాహుల్ త్రిపాఠి (0) వెనుదిరిగారు. పేలవ ప్రదర్శన కారణంగా పవర్‌ప్లేను హైదరాబాద్ 30 పరుగులతోనే ముగించింది. ఘనమైన రికార్డులు, ఎన్నో అంచనాలతో తొలిసారి ఐపీఎల్‌లో అడుగు పెట్టిన ఇంగ్లండ్ హిట్టర్ హ్యారీ బ్రూక్ (21 బంతుల్లో 13; 1 ఫోర్) ప్రభావం చూపలేకపోయాడు. యజువేంద్ర చహల్ బౌలింగ్‌లో బ్రూక్ బౌల్డయ్యాడు. గ్లెన్ ఫిలిప్స్ (8) కూడా విఫలం కావడంతో 48 పరుగుల వద్ద హైదరాబాద్ సగం టీమ్ డగౌట్ చేరింది. తప్పనిసరి పరిస్థితుల్లో ధాటిగా ఆడే ప్రయత్నంలో మయాంక్ అగర్వాల్ (23 బంతుల్లో 27; 3 ఫోర్లు) అవుట్ కావడంతో సన్‌రైజర్స్ గెలుపు ఆశలు కోల్పోయింది. చివర్లో సమద్ కొన్ని మెరుపులు మెరిపించినా అప్పటికే బాగా ఆలస్యమైపోయింది. ఇన్నింగ్స్ ఆఖరి రెండు ఓవర్లలో సమద్ 2 ఫోర్లు, 1 సిక్స్ కొట్టగా, ఉమ్రాన్ (19 నాటౌట్) 2 సిక్స్‌లు, ఒక ఫోర్ బాదాడు. సన్‌రైజర్స్ తన తదుపరి మ్యాచ్‌ను శుక్రవారం లక్నో వేదికగా లక్నో సూపర్ జెయింట్స్ జట్టుతో ఆడుతుంది.

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) మయాంక్ (బి) ఫజల్ 54; బట్లర్ (బి) ఫజల్ 54; సామ్సన్ (సి) అభిషేక్ (బి) నటరాజన్ 55; పడిక్కల్ (బి) ఉమ్రాన్ 2; పరాగ్ (సి) ఫజల్ (బి) నటరాజన్ 7; హెట్‌మైర్ (నాటౌట్) 22; అశ్విన్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 203. వికెట్ల పతనం:** 1-85, 2-139, 3-151, 4-170, 5-187. **బౌలింగ్:** భువనేశ్వర్ 3-0-36-0, ఫజల్ హఖ్ 4-0-41-2, సుందర్ 3-0-32-0, నటరాజన్ 3-0-23-2, ఆదిల్ రషీద్ 4-0-33-0, ఉమ్రాన్ 3-0-32-1.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్: అభిషేక్ శర్మ (బి) బౌల్ట్ 0; మయాంక్ (సి) బట్లర్ (బి) చహల్ 27; త్రిపాఠి (సి) హోల్డర్ (బి) బౌల్ట్ 0; హ్యారీ బ్రూక్ (సి) చహల్ 13; సుందర్ (సి) హెట్‌మైర్ (బి) హోల్డర్ 1; ఫిలిప్స్ (సి) ఆసిఫ్ (బి) అశ్విన్ 8; సమద్ (నాటౌట్) 32; రషీద్ (స్టంప్డ్) సామ్సన్ (బి) చహల్ 18; భువనేశ్వర్ (బి) చహల్ 6; ఉమ్రాన్ (నాటౌట్) 19; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 131. వికెట్ల పతనం:** 1-0, 2-0, 3-34, 4-39, 5-48, 6-52, 7-81, 8-95. **బౌలింగ్:** బౌల్ట్ 4-1-21-2, ఆసిఫ్ 3-0-15-0, హోల్డర్ 3-0-16-1, అశ్విన్ 4-0-27-1, చహల్ 4-0-17-4, నవదీప్ సైనీ 2-0-34-0.

బెంగళూరు బోణీ

- ముంబై ఇండియన్స్‌పై 8 వికెట్లతో విజయం
- కోహ్లి, డు ప్లెసిస్ ధనాధన్ ఇన్నింగ్స్
- తిలక్ వర్మ మెరుపులు వృథా


డు ప్లెసిస్


తిలక్ వర్మ


కోహ్లి

బెంగళూరు: అందని ద్రాక్షగా ఉన్న ఐపీఎల్ టైటిల్‌ను ఈసారైనా సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) కొత్త సీజన్‌లో శుభారంభం చేసింది. ఐదుసార్లు చాంపియన్ ముంబై ఇండియన్స్ జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో ఫాఫ్ డు ప్లెసిస్ నాయకత్వంలోని బెంగళూరు ఎనిమిది వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 171 పరుగులు చేసింది. హైదరాబాద్ యువ క్రికెటర్ ఠాకూర్ తిలక్ వర్మ (46 బంతుల్లో 84 నాటౌట్; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) అసాధారణ బ్యాటింగ్‌తో అర్ధ సెంచరీ సాధించి అజేయంగా నిలిచాడు. తిలక్ వర్మ పుణ్యమాని ముంబై గౌరవప్రద స్కోరు సాధించగలిగింది. అనంతరం బెంగళూరు జట్టు ఆరంభం నుంచే దూకుడుగా ఆడి కేవలం 16.2 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 172 పరుగులు సాధించి గెలుపొందింది. ఓపెనర్లు విరాట్ కోహ్లి (49 బంతుల్లో 82 నాటౌట్; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' డు ప్లెసిస్ (43 బంతుల్లో 73; 5 ఫోర్లు, 6 సిక్స్‌లు) ముంబై బౌలర్ల భరతం పట్టారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 14.5 ఓవర్లలో 148 పరుగులు జోడించారు. డు ప్లెసిస్ అవుటయ్యాక వచ్చిన దినేశ్ కార్తీక్ ఖాతా తెరువకుండానే పెవిలియన్ చేరగా... మ్యాక్స్‌వెల్ (3 బంతుల్లో 12 నాటౌట్; 2 సిక్స్‌లు), కోహ్లి బెంగళూరును లక్ష్యానికి చేర్చారు.

టాపార్డర్ విఫలం...

గత సీజన్‌లో పేలవ ప్రదర్శన కనబరిచిన ముంబై ఈ సీజన్ తొలి మ్యాచ్‌లోనూ నిరాశపరిచింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ముంబైకి ఆశించిన ఆరంభం దక్కలేదు. పవర్‌ప్లే లోపే ముంబై మూడు కీలక వికెట్లను కోల్పోయింది. ఆదుకుంటాడనుకున్న సూర్యకుమార్ యాదవ్ (16 బంతుల్లో 15; 1 ఫోర్) ఎక్కువసేపు క్రీజులో నిలువలేదు. దాంతో ముంబై 48 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో తిలక్ వర్మ, నేహాల్ వధేరా కలిసి ముంబైను ఆదుకున్నారు. ముఖ్యంగా తిలక్ వర్మ ఫోర్లు, సిక్సర్లతో చెలరేగిపోయాడు. 32 బంతుల్లో తిలక్ అర్ధ సెంచరీ పూర్తయింది. ఒకవైపు ముంబై వికెట్లను కోల్పోతున్నా మరోవైపు తిలక్ తన జోరు కొనసాగించడంతో ముంబై జట్టుకు గౌరవప్రద స్కోరు సాధ్యమైంది. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన బెంగళూరుకు ఓపెనర్లు కోహ్లి, డు ప్లెసిస్ మెరుపు ఆరంభాన్నిచ్చారు. వీరిద్దరు ముంబై బౌలర్లపై తొలి బంతి నుంచే విరుచుకుపడ్డారు. దాంతో బెంగళూరు లక్ష్యం దిశగా సాగిపోయింది. అర్షద్ ఖాన్ బౌలింగ్‌లో డు ప్లెసిస్.. గ్రీన్ బౌలింగ్‌లో దినేశ్ కార్తీక్ వెంటవెంటనే అవుటైనా... కోహ్లి, మ్యాక్స్‌వెల్ మిగతా పనిని పూర్తి చేశారు.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ శర్మ (సి) దినేశ్ కార్తీక్ (బి) ఆకాశ్‌దీప్ 1; ఇషాన్ కిషన్ (సి) హర్షల్ పటేల్ (బి) సిరాజ్ 10, గ్రీన్ (బి) టాప్లే 5; సూర్యకుమార్ యాదవ్ (సి) షహబాజ్ (బి) బ్రేస్‌వెల్ 15; తిలక్ వర్మ (నాటౌట్) 84; నేహాల్ వధేరా (సి) కోహ్లి (బి) కరణ్ శర్మ 21; టిమ్ డేవిడ్ (బి) కరణ్ శర్మ 4; హృతిక్ షోకీన్ (సి) డు ప్లెసిస్ (బి) హర్షల్ పటేల్ 5; అర్షద్ ఖాన్ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 171. వికెట్ల పతనం:** 1-11, 2-16, 3-20, 4-48, 5-98, 6-105, 7-123. **బౌలింగ్:** సిరాజ్ 4-0-21-1, రీస్ టాప్లే 2-0-14-1, ఆకాశ్‌దీప్ 3-0-29-1, హర్షల్ పటేల్ 4-0-43-1, కరణ్ శర్మ 4-0-32-2, బ్రేస్‌వెల్ 2-0-16-1, మ్యాక్స్‌వెల్ 1-0-16-0.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: విరాట్ కోహ్లి (నాటౌట్) 82; డు ప్లెసిస్ (సి) టిమ్ డేవిడ్ (బి) అర్షద్ ఖాన్ 73; దినేశ్ కార్తీక్ (సి) తిలక్ వర్మ (బి) గ్రీన్ 0; మ్యాక్స్‌వెల్ (నాటౌట్) 12; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం (16.2 ఓవర్లలో రెండు వికెట్లకు) 172. వికెట్ల పతనం:** 1-148, 2-149. **బౌలింగ్:** బెహ్రెన్‌డార్ఫ్ 3-0-37-0, అర్షద్ ఖాన్ 2.2-0-28-1, జోఫ్రా ఆర్చర్ 4-0-33-0, పియూష్ చావ్లా 4-0-26-0, కామెరాన్ గ్రీన్ 2-0-30-1, హృతిక్ షోకీన్ 1-0-17-0.

క్రికెటర్ సలీమ్ దురానీ కన్నుమూత



న్యూఢిల్లీ: సంప్రదాయ టెస్టు క్రికెట్‌లో దూకుడైన ఆటకు మారుపేరుగా నిలిచిన అలనాటి మేటి భారత క్రికెటర్ సలీమ్ దురానీ ఆదివారం కన్ను మూశారు. 88 ఏళ్ల సలీమ్ దురానీ గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో తన సోదరుడు జహంగీర్ దురానీ ఇంట్లో నివసిస్తున్నారు. సలీమ్ 1934లో డిసెంబర్ 11న అఫ్గానిస్తాన్ రాజధాని కాబూల్‌లో జన్మించారు. భారత్ తరఫున 29 టెస్టులు ఆడిన దురానీ 1,202 పరుగులు సాధించడంతోపాటు 75 వికెట్లు పడగొట్టారు. దురానీ ఒక సెంచరీతోపాటు ఏడు అర్ధ సెంచరీలు చేశారు. మైదానంలోని ప్రేక్షకులు సిక్స్ కొట్టాలి అని డిమాండ్ చేస్తే ఆ దిశగానే దురానీ సిక్స్‌లు కొట్టి అభిమానులను అలరించేవారు. 1971లో వెస్టిండీస్ గడ్డపై ఐదు టెస్టుల సిరీస్‌ను 1-0తో నెగ్గిన భారత జట్టులో దురానీ కీలక సభ్యుడిగా వ్యవహరించారు. భారత్ నెగ్గిన టెస్టులో దురానీ విండీస్ స్టార్స్ క్లయివ్ లాయిడ్, గ్యారీ సోబర్స్‌లను అవుట్ చేశారు. 1973లో చివరి టెస్టు ఆడిన దురానీ ఆ తర్వాత దేశవాళీ క్రికెట్‌లో కొనసాగారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 'అర్జున అవార్డు' అందుకున్న తొలి భారత క్రికెటర్‌గా ఘనత వహించిన దురానీ దేశవాళీ క్రికెట్‌లో గుజరాత్, రాజస్తాన్, సౌరాష్ట్ర జట్లకు ప్రాతినిధ్యం వహించారు. మొత్తం 170 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌లు ఆడిన ఆయన 14 సెంచరీలు, 45 అర్ధ సెంచరీలతో కలిపి 8545 పరుగులు చేసి, 484 వికెట్లు పడగొట్టారు. సలీమ్ దురానీ మృతి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోపాటు బీసీసీఐ కార్యదర్శి జై షా, భారత దిగ్గజ క్రికెటర్లు సచిన్ టెండూల్కర్, రవిశాస్త్రి, అనిల్ కుంబ్లే తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

13వ ప్రయత్నంలో సఫలం

మయామి ఓపెన్ విజేత క్విటోవా ● రూ. 10 కోట్ల 36 లక్షల ప్రైజ్‌మనీ సొంతం


క్విటోవా

ఫ్లోరిడా: ఎట్టకేలకు చెక్ రిపబ్లిక్ టెన్నిస్ స్టార్ పెట్రా క్విటోవా నిరీక్షణ ముగిసింది. ప్రతిష్టాత్మక మయామి ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 ప్రీమియర్ టోర్నమెంట్‌లో 33 ఏళ్ల క్విటోవా తొలిసారి చాంపియన్‌గా అవతరించింది. గతంలో 12 సార్లు ఈ టోర్నీలో పాల్గొని ఒక్కసారి కూడా ఫైనల్ చేరలేకపోయిన క్విటోవా 13వ ప్రయత్నంలో ఏకంగా టైటిల్ సాధించడం విశేషం. ప్రపంచ ఏడో ర్యాంకర్ ఎలీనా రిబాకినా (కజకిస్తాన్)తో ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 12వ ర్యాంకర్ క్విటోవా గంటా 42 నిమిషాల్లో 7-6 (16/14), 6-2తో విజయం సాధించింది. క్విటోవా కెరీర్‌లో ఇది 30వ సింగిల్స్ టైటిల్‌కాగా, డబ్ల్యూటీఏ-1000 విభాగంలో తొమ్మిదోది. ఈ గెలుపుతో క్విటోవా 2021 సెప్టెంబర్ తర్వాత మళ్లీ ప్రపంచ టాప్-10 ర్యాంకింగ్స్‌లోకి రానుంది. రెండు వారాల క్రితం ఇండియన్ వెల్స్ ఓపెన్ డబ్ల్యూటీఏ-1000 టోర్నీలో విజేతగా నిలిచి సూపర్ ఫామ్‌లో ఉన్న రిబాకినా ఫైనల్లో తొలి సెట్‌లో గట్టిపోటీ ఇచ్చింది. చివరకు 22 నిమిషాలపాటు జరిగిన టైబ్రేక్‌లో క్విటోవా పైచేయి సాధించి తొలి సెట్‌ను దక్కించుకుంది. రెండో సెట్‌లో క్విటోవా దూకుడుకు రిబాకినా చేతులెత్తేసింది. కేవలం రెండు గేమ్‌లు మాత్రమే ఆమె గెల్చుకుంది. విజేతగా నిలిచిన క్విటోవాకు 12,62,220 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 10 కోట్ల 36 లక్షలు), రన్నరప్ రిబాకినాకు 6,62,360 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 5 కోట్ల 43 లక్షలు) లభించాయి.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	1,031	58,992
నిఫ్టీ ▲	279	17,360

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి


విదేశీ సూచీలు (శుక్రవారం ముగింపు)		
నాస్‌డాక్	12,222	▲ 208
డోజోన్స్	33,274	▲ 415
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,632	▲ 11
డాక్స్	15,629	▲ 106
షాంఘై	3,273	▲ 12
నికాయ్	28,041	▲ 259

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

పన్ను శూన్యం.. ఆదాయం అదనం

- పన్ను ఆదా చేసే పెట్టుబడి సాధనాలు
- పీపీఎఫ్, ఈపీఎఫ్, సుకన్య సమృద్ధిపై పన్ను సున్నా
- బీమా పాలసీలకూ ఇదే ప్రయోజనం
- ఈఎల్ఎస్ఎస్‌పైనా పన్ను లేకుండా చేసుకోవచ్చు
- కొన్ని షరతులు పాటిస్తే చాలు..


ఆదాయపన్ను ఆదాచేసే పెట్టుబడి సాధనాలకు మంచి డిమాండ్ ఉంది. మధ్యాదాయ వర్గాల వారికి పాత పన్ను విధానమే మెరుగైనది. అందులో పన్ను ఆదా, మినహాయింపునిచ్చే సెక్షన్లు చాలానే ఉన్నాయి. పన్ను ఆదా కోసం ఈ తరహా సాధనాల్లో ఇన్వెస్ట్ చేసే వారు చాలా మంది ఉన్నారు. ఆర్థిక సంవత్సరం చివర్లో కాకుండా ఆరంభం నుంచే ఈ సాధనాల్లో క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లడం వల్ల చివర్లో ఏకమొత్తంలో సమకూర్చుకోవాల్సిన ఇబ్బంది తప్పుతుంది. అయితే, పన్ను ఆదా సాధనాల్లో ఇన్వెస్ట్ చేసే ముందు లాభ, నష్టాల గురించి పూర్తిగా విచారించుకోవాలి. లాక్ ఇన్ పీరియడ్‌ను చూడాలి. రాబడిని చూడాలి. రిస్క్‌ను అర్థం చేసుకోవాలి. పన్ను బాధ్యత ఏ మేరకు అన్నది పరిశీలించాలి. ముందస్తు ఉపసంహరణలకు అవకాశం ఉందా? లేదా? తెలుసుకోవాలి. చాలా మంది పెట్టుబడిపై పన్ను ఆదానే చూస్తుంటారు. కానీ రాబడిపై పన్ను బాధ్యత గురించి తెలుసుకోరు. ముఖ్యంగా రిస్క్‌లేని సంప్రదాయ డెట్ సాధనాల్లో రాబడి 6–8 శాతం మించదు. కానీ, దీనిపై పన్ను చెల్లించాల్సి వస్తే.. ఇక మిగిలేది ఏముంటుంది? కనుక పెట్టుబడిపై పన్ను ఆదాయే కాదు, రాబడిపైనా పన్ను లేని సాధనాల్లో ఇన్వెస్ట్ చేయడం వల్ల అదనపు రాబడిని సంపాదించుకోవచ్చు. ఇలాంటి ముఖ్యమైన సాధనాల గురించి తెలియజేసే కథనమే ఇది.



2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రిటర్నులు దాఖలు చేసే వారు పాత, కొత్త విధానాల్లో దేనినైనా ఎంపిక చేసుకోవచ్చు. కాకపోతే కొత్త విధానంలో పన్ను ఆదా ప్రయోజనాలు పెద్దగా లేవు. స్టాండర్డ్ డిడక్షన్, ఉద్యోగి తరఫున యాజమాన్యం ఎన్‌పీఎస్ ఖాతాకు చేసే జమపైనే పన్ను ప్రయోజనాలు ఉన్నాయి. పాత విధానంలో అయితే సెక్షన్ 80సీ, 80డీ సహా ఎన్నో సెక్షన్లు పన్ను భారాన్ని తగ్గిస్తున్నాయి. కనుక పాత, కొత్త విధానాల్లో ఒక దానిని ఎంపిక చేసుకునే ముందు తమ ఆదాయం, పెట్టుబడులు తదితర అంశాలన్నీ విశ్లేషించుకున్న తర్వాత ఎంపిక చేసుకోవాలి. పాత విధానంలో అయితే, ఇక్కడ చర్చించే సాధనాలు రిస్క్‌లేని రాబడిని, పన్ను లేని రాబడినిస్తాయి. కనుక ఇన్వెస్టర్లు వీటిని పరిశీలించొచ్చు.



పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్




పీపీఎఫ్ అన్నది ఎవరైనా ఇన్వెస్ట్ చేసుకోతగిన సాధనం. సెక్షన్ 80సీ కింద ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల వరకు ఇందులో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఈ మొత్తంపైనా ఎలాంటి పన్ను లేదు. అంతేకాదు ఈ సాధనానికి మూడు రకాల పన్ను మినహాయింపులు ఉన్నాయి. ఇందులో పెట్టుబడిపై పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకోవచ్చు. వడ్డీ రాబడిపైనా పన్ను కట్టక్కర్లేదు. చివర్లో గడువు తీరిన తర్వాత ఉపసంహరించుకునే మొత్తంపైనా పన్ను లేదు. భద్రత దృష్ట్యా చూస్తే.. సార్వభౌమ గ్యారంటీతో కూడిన పథకం ఇది. ప్రస్తుతం 7.1 శాతం వార్షిక రాబడి ఈ పథకంలో ఉంది. పీపీఎఫ్ అకౌంట్ కాల వ్యవధి 15 ఏళ్లు. లాకిన్ పీరియడ్ కూడా ఇంతే ఉంటుంది. ఈ పథకంలో పెట్టుబడి మొదలు పెట్టిన ఆర్థిక సంవత్సరం చివరి నుంచి 15 ఏళ్ల కాలం అమలవుతుంది. ఆరంభం నుంచి కాదు. ఖాతా ప్రారంభించిన ఆరో ఏట నుంచి రుణ సదుపాయం అమల్లో ఉంటుంది. ఖాతా ప్రారంభించిన ఏడో ఆర్థిక సంవత్సరం నుంచి పాక్షిక ఉపసంహరణకు అనుమతిస్తారు. ఇందుకు కొన్ని షరతులు అమలవుతాయి. పోస్టాఫీసు లేదా బ్యాంక్‌లో ప్రారంభించుకోవచ్చు. పోస్ట్ ఆఫీసు అయితే అక్కడ సేవింగ్స్ ఖాతా తెరవాలని షరతు పెడుతున్నారు.



సుకన్య సమృద్ధి యోజన

భేటీ బచావో భేటీ పడావో అనే పథకం కింద సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని కేంద్ర సర్కారు తీసుకొచ్చింది. కుమార్తెలకు సంబంధించిన డిపాజిట్ పథకం ఇది. ఆడపిల్ల విద్య లేదా వివాహం అవసరాల కోసం తల్లిదండ్రులు ఆమె పేరిట ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. ఇలా ఒక్కరు ఇద్దరు కుమార్తెల పేరిటే ఈ పథకంలో ఇన్వెస్ట్ చేసుకోగలరు. ఇద్దరికి మించి కుమార్తెలు ఉంటే, వారి పేరిట ఇన్వెస్ట్‌మెంట్‌కు అవకాశం ఉండదు. పీపీఎఫ్ మాదిరే ఇందులోనూ పెట్టుబడిపై పన్ను లేదు. రాబడి, చివరిలో అందుకునే మొత్తంపై పన్ను ఉండదు. పన్ను లేని, మెరుగైన రాబడితో కూడిన డెట్ సాధనం ఇది. కేంద్ర ప్రభుత్వం గ్యారంటీతో వస్తుంది కనుక భద్రత పరంగా సందేహం అక్కర్లేదు. ప్రతి మూడు నెలలకు ఒకసారి చిన్న మొత్తాల పొదుపు పథకాలపై కేంద్ర ప్రభుత్వం వడ్డీ రేట్లను సవరిస్తుంటుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న రేటు 8 శాతం. బ్యాంకు డిపాజిట్లతో పోలిస్తే ఇందులోనే రాబడి కాస్తంత ఎక్కువగా ఉంటుంది. ఈ పథకంలో పెట్టుబడులకు 21 ఏళ్ల లాకిన్ పీరియడ్ ఉంటుంది. ముందస్తు ఉపసంహరణలను కొన్ని షరతుల మేరకు అనుమతిస్తారు. కుమార్తెల వయసు 10 ఏళ్లు మించకుండా ఉంటే, వారిపైనే ఈ పథకం కింద ఖాతా తెరిచి ఇన్వెస్ట్ చేసుకోవడానికి ఉంటుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో కనిష్ఠంగా రూ.250, గరిష్ఠంగా రూ.1.5 లక్షలను ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. కుమార్తె వయసు 18 ఏళ్లు వచ్చే వరకు తల్లిదండ్రి లేదా సంరక్షకుడు ఖాతాను నిర్వహించొచ్చు. బ్యాంకు లేదా పోస్టాఫీసులో ఈ ఖాతా తెరుచుకోవచ్చు.





ఉద్యోగుల భవిష్య నిధి, స్వచ్ఛంద భవిష్య నిధి

సంఘటిత రంగంలో పనిచేసే ఉద్యోగులు ఈపీఎఫ్ కిందకు వస్తారు. వేతనం నుంచి 12 శాతాన్ని ఈపీఎఫ్ ఖాతాకు ప్రతి నెలా జమ చేయాల్సి ఉంటుంది. పని చేయించుకునే సంస్థ కూడా ఉద్యోగి తరఫున అంతే మొత్తాన్ని జమ చేస్తుంది. ఉద్యోగులు తన వంతుగా జమ చేసే మొత్తంపై సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈపీఎఫ్ నిధికి 12 శాతానికి మించి జమ చేసుకోవాలంటే అందుకు వీలు కల్పించేదే స్వచ్ఛంద భవిష్య నిధి (వీపీఎఫ్). ఈపీఎఫ్ నిబంధనలు వీపీఎఫ్‌కు సైతం వర్తిస్తాయి. ఈపీఎఫ్ వడ్డీ రేటే వీపీఎఫ్ జమలపైనా అమలవుతుంది. ఈపీఎఫ్ పథకాన్ని కేంద్ర సర్కారు నిర్వహిస్తోంది. కనుక నూరు శాతం భద్రత ఉంటుంది. గడిచిన ఆర్థిక సంవత్సరానికి ఈపీఎఫ్‌పై 8.1 శాతం వడ్డీ రేటు అమలు చేయగా, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ పథకం రిటైర్మెంట్ వరకు కొనసాగుతుంది. ముందస్తు ఉపసంహరణలు చేసుకోవచ్చు. ఉన్నత విద్య, వివాహం, వైద్య చికిత్సల కోసం ఈపీఎఫ్ బ్యాలెన్స్‌ను ఉపసంహరించుకోవచ్చు. మిగిలిన పథకాల మాదిరే ఈపీఎఫ్‌పైనా పన్ను లేదు. కాకపోతే ఒక ఆర్థిక సంవత్సరంలో ఈపీఎఫ్, వీపీఎఫ్‌కు ఉద్యోగి చేసే జమ రూ.2.5 లక్షలు మించినప్పుడు.. అంతకుమించి చేసే జమలపై వచ్చే వడ్డీ పన్ను పరిధిలోకి వస్తుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.2.5 లక్షలకు మించి జమ చేసే వారు 5 శాతం మంది కూడా ఉండరు. వీపీఎఫ్, ఈపీఎఫ్ రెండు కలసి ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల పరిమితిపైనే పన్ను ఆదా పరిమితం.





జీవిత బీమా పాలసీలు

సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు ప్రయోజనం కలిగిన సాధనాల్లో జీవిత బీమా సాధనాలు కూడా ఉన్నాయి. టర్మ్ పాలసీలు, ఎండోమెంట్ పాలసీలు, యూనిట్ లింక్డ్ పాలసీల (యులిప్‌లు)కు ఏటా చెల్లించే ప్రీమియం మొత్తాన్ని సెక్షన్ 80సీ కింద చూపించుకోవచ్చు. జీవిత బీమాను పెట్టుబడి కోణంలో చూడొద్దు. కుటుంబానికి రక్షణ సాధనంగానే చూడాలి. అలా చూసినప్పుడు అసలైన బీమా ప్లాన్ అంటే టర్మ్ ప్లాన్ అనే చెప్పుకోవాలి. తక్కువ ప్రీమియంకే ఎక్కువ రక్షణ కవరేజీ లభిస్తుంది. పాలసీదారుడికి ఏదైనా జరిగితే కుటుంబం ఆర్థిక ఇబ్బందుల పాలు కాకుండా ఉంటుంది. గడువు తీరే వరకు జీవించి ఉంటే చివర్లో ఏమీ తిరిగి రాదు. అందుకే చాలా మంది దీని పట్ల విముఖత చూపిస్తుంటారు. దీనికి బదులు చివర్లో ఎంతో కొంత చెల్లింపులు చేసే ఎండోమెంట్ ప్లాన్ల వైపు వెళుతుంటారు. సంప్రదాయ పాలసీల్లో 20 ఏళ్లకు మించి కాలంపై రాబడి 4–6 శాతం మించదని గుర్తుంచుకోవాలి. యులిప్ ప్లాన్లు బీమా రక్షణ, పెట్టుబడితో కూడినవి. వీటిల్లోనూ ప్రీమియం అధికంగానే ఉంటుంది. యులిప్ ప్లాన్లలో పెట్టుబడులను ఈక్విటీ లేదా డెట్, లేదా ఈక్విటీ డెట్ కలసినవి ఎంపిక చేసుకోవచ్చు. ఈక్విటీ నుంచి డెట్‌కు, డెట్ నుంచి ఈక్విటీకి ఎలాంటి చార్జీల్లేకుండా మార్చుకోవచ్చు. గడువు తీరిన తర్వాత చివర్లో వచ్చే మొత్తంపై పన్ను లేకుండా చేసుకోవాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. యులిప్ ప్లాన్ల ప్రీమియం ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.2.5 లక్షలకు మించకుండా చూసుకుంటే మెచ్యూరిటీపై పన్ను పడదు. యులిప్‌లలో ఉన్న మరో ప్రతికూలత ఇవి చాలా తక్కువ టర్మ్‌తో వస్తుంటాయి. యులిప్ ప్లాన్లలోనూ రాబడులకు హామీ ఉండదు. అంచనా రాబడినే బీమా సంస్థలు వెల్లడిస్తాయి. ఇక సంప్రదాయ బీమా పాలసీలు (జీవించి ఉంటే మెచ్యూరిటీ చెల్లించేది) తీసుకునే వారు వార్షిక ప్రీమియం రూ.5 లక్షలు మించకుండా చూసుకోవాలి. అప్పుడే చివర్లో చేతికొచ్చే మొత్తం పన్ను రహితం. ఈ నిబంధన 2023 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.



ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ పథకాలు

ఈక్విటీ లింక్డ్ సేవింగ్స్ స్కీమ్ పథకాలలో చేసే పెట్టుబడులపై పన్ను మినహాయింపు ఉంది. పైన చెప్పుకున్న వాటికి ఇది భిన్నం. సెక్షన్ 80సీ కింద గరిష్ఠంగా ఈ పథకాల్లో రూ.1.5 లక్షలు ఇన్వెస్ట్ చేసి ఆ మొత్తంపై మినహాయింపు క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ పథకాలు పూర్తిగా ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. కనుక రిస్క్ ఉంటుంది. రాబడులు పన్ను పరిధిలోకి వస్తాయి. రాబడులపై హామీ ఉండదు. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా లాభ, నష్టాలు ఏవైనా రావచ్చు. కాకపోతే ఈక్విటీల్లో ఐదేళ్లకు మించిన కాలానికి నికరంగా రాబడులే వస్తాయని చారిత్రక గణాంకాలు చెబుతున్నాయి. ఈ పథకంలో పెట్టుబడులపై మూడేళ్ల లాకిన్ పీరియడ్ అమలవుతుంది. పన్ను ఆదా సాధనాల్లో తక్కువ లాకిన్ ఉన్నది ఇదే. ఈఎల్ఎస్ఎస్ నుంచి మూడేళ్లు నిండకుండా పెట్టుబడులు వెనక్కి తీసుకోవడానికి ఉండదు. మూడేళ్ల లాకిన్ పీరియడ్‌లో ఈ పథకం నుంచి ఆదాయం రావాలని కోరుకుంటే, గ్రోత్ ఆప్షన్‌కు బదులు డివిడెండ్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. దాంతో ఫండ్ డివిడెండ్ ప్రకటించిన ప్రతీ సందర్భంలోనూ ఇన్వెస్టర్‌కు ఎంతో కొంత ఆదాయం వస్తుంది. కాకపోతే డివిడెండ్ ఆదాయం పన్ను పరిధిలోకి వస్తుంది. ఇన్వెస్టర్ వార్షిక ఆదాయానికి కలిపి, పన్ను వర్తించే ఆదాయం ఉన్నప్పుడే చెల్లించాల్సి ఉంటుంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఏడాదికి మించిన కాలంపై వచ్చే లాభాన్ని దీర్ఘకాలిక మూలధన లాభంగా పరిగణిస్తారు. ఈఎల్ఎస్ఎస్ పథకాలు మూడేళ్ల లాకిన్‌తో ఉంటాయి కనుక.. ఇందులో వచ్చే రాబడులు దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను పరిధిలోకి వస్తాయి. ఒక ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.లక్ష వరకు ఉంటే ఎలాంటి పన్ను లేదు. ఈ పరిమితికి మించిన లాభంపైనే 10 శాతం పన్ను చెల్లించాలి. అందుకే ఈఎల్ఎస్ఎస్ పథకాల్లో గ్రోత్ ఆప్షన్ ఎంపిక చేసుకోవాలి. ఒక ఆర్థిక సంవత్సరంలో రూ.1.5 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకుని సెక్షన్ 80సీ కింద పన్ను మినహాయింపు పొందాలి. మూడేళ్లు నిండిన తర్వాత నుంచి ఏటా రూ.లక్ష లాభం మించకుండా ఉపసంహరించుకుని, తిరిగి ఆ మొత్తాన్ని మరొక ఈఎల్ఎస్ఎస్ పథకంలో ఇన్వెస్ట్ చేసుకుంటూ వెళ్లాలి. దీనివల్ల లాభంపై పన్ను పడదు. దీర్ఘకాలంలో మంచి నిధి జమవుతుంది.



మారుతీ సుజుకీ వాహనాల ధరల పెంపు

న్యూఢిల్లీ: మారుతీ సుజుకీ తన వాహన ధరలను పెంచింది. ఏప్రిల్ 1 నుంచి పెంచిన ధరలు అమల్లోకి వచ్చినట్లు ఒక రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. మోడళ్లలో సగటు ధర పెరుగుదల దాదాపు 0.8 శాతంగా (ఢిల్లీలో మోడళ్ల ఎక్స్ షోరూమ్) ఉంది. ద్రవ్యోల్బణం నియంత్రణ విధానాల కారణంగా సంస్థపై వ్యయ ఒత్తిడి ఉన్నట్లు తెలిపింది. ఇప్పటికే హోండా కార్స్, టాటా మోటార్స్, హీరో మోటోకార్ప్‌తో సహా పలు వాహన తయారీదారీ కంపెనీలు ఏప్రిల్ నుండి ధరలను పెంచుతున్నట్లు ప్రకటించాయి. ఉద్గారాల స్థాయిలను పర్యవేక్షించడానికి వాహనాలు ఆన్-బోర్డ్ స్వీయ-నిర్ధారణ పరికరాన్ని వినియోగించాలన్న నిబంధన ఏప్రిల్ 1 నుండి అమల్లోకి రావడం గమనార్హం.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-4-2023	
విశాఖ	430–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	417–00
విజయవాడ	417–00
రిటైల్ ధర (డజను)	66.00
2-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	405–00
వరంగల్	407–00
రిటైల్ ధర	4.65

రిటర్న్స్‌లో ఫండ్స్ లాభాలు చూపాలా?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

ఫండ్స్‌లో దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష లోపు ఉంటే పన్ను చెల్లించక్కర్లేదు. అయినా ఈ లాభాన్ని ఆదాయపన్ను రిటర్నుల్లో చూపించాలా – వివేక్

మీరు పన్ను రిటర్నులను నిబంధనల ప్రకారం దాఖలు చేయాల్సి ఉంటే, అందులో లాభ, నష్టాలను వెల్లడించాలి. స్టాక్స్, లేదా ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడులను ఏడాదికి మించి కొనసాగించినప్పుడు వచ్చేవి దీర్ఘకాల లాభాలు. దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష వరకు ఉంటే పన్ను లేదు. అంతకుమించిన లాభంపైనే 10 శాతం పన్ను చెల్లించాలి. వార్షిక సమాచార నివేదిక (ఏఐఎస్)లో మూలధన లాభాల పన్ను వివరాలు ఉంటే, అవి పన్ను రిటర్నుల్లో ముందుగానే నింపి ఉంటాయి. ఒకవేళ మీ ఆదాయం బేసిక్ ఆదాయపన్ను మినహాయింపు పరిధిలోనే ఉంటే, అప్పుడు మీరు రిటర్నులు దాఖలు చేయక్కర్లేదు. పాత పన్ను విధానంలో రూ.2.5 లక్షల వరకు పన్ను లేదు. 60 ఏళ్లు నిండిన వారికి ఇది రూ.3 లక్షలు, 80 ఏళ్లు నిండిన వారికి రూ.5 లక్షలుగా ఉంది. మరింత వివరంగా అర్థం చేసుకునేందుకు కొన్ని ఉదాహరణలు చూద్దాం. వార్షిక ఆదాయం రూ.5లక్షల్లోపు ఉంటే సెక్షన్ 87ఏ కింద పన్ను రాయితీ పొందొచ్చు. అప్పుడు పన్ను చెల్లించక్కర్లేదు. ఒకవేళ వార్షిక ఆదాయం రూ.5 లక్షలు దాటిందని అనుకుంటే, అప్పుడు రిబేట్ వర్తించదు. అప్పుడు సాధారణ శ్లాబు రేటు ప్రకారం పన్ను వర్తిస్తుంది. అలాగే, పన్ను వర్తించే ఆదాయం ఉంది కనుక రూ.లక్షకు మించిన దీర్ఘకాల మూలధన లాభంపై 10 శాతం చొప్పున పన్ను చెల్లించాలి. ఒకవేళ మీ వార్షిక ఆదాయం బేసిక్ పరిమితి లోపే, రూ.2 లక్షలుగానే ఉందని అనుకుందాం. అప్పుడు దీర్ఘకాల మూలధన లాభం రూ.లక్ష మించినప్పుడు.. రూ.50వేల మొత్తాన్ని బేసిక్ పరిమితి కింద మిగిలి ఉంది కనుక చూపించుకోవచ్చు. అన్ని కేసుల్లోనూ దీర్ఘకాల మూలధన లాభాల వివరాలను రిటర్నుల్లో చూపించాల్సిందే.

ఈక్విటీయేతర మ్యూచువల్ ఫండ్స్‌కు ఇండెక్సేషన్ (ద్రవ్యోల్బణం) ప్రయోజనాన్ని తొలగించారని తెలిసింది. నూతన చట్టం అమలుపై స్పష్టత ఇవ్వగలరా? – గణేశన్

ఈ ఏడాది మార్చి 31 వరకు చేసే పెట్టుబడులకు లాభాల్లో ద్రవ్యోల్బణ ప్రభావాన్ని మినహాయించే ఇండెక్సేషన్ ప్రయోజనం ఉంటుంది. ఇటీవలే కేంద్ర ప్రభుత్వం నాన్ ఈక్విటీ ఫండ్స్ పన్ను నిబంధనల్లో మార్పులు చేసింది. ఇండెక్సేషన్ ప్రయోజనాన్ని తొలగించింది. దీంతో ఎంత కాలం పాటు పెట్టుబడులు కొనసాగించారనే దానితో సంబంధం లేకుండా.. డెట్ ఫండ్స్‌లో వచ్చే లాభం ఇన్వెస్టర్ వార్షిక ఆదాయానికి కలుస్తుంది. వారికి వర్తించే శ్లాబు రేటు ప్రకారం పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఈ నూతన నిబంధన 2023 ఏప్రిల్ 1 నుంచి చేసే పెట్టుబడులకే అమలవుతుంది. దీనికంటే ముందు చేసే పెట్టుబడులకు ఇండెక్సేషన్ ప్రయోజనం వర్తిస్తుంది.

ఐసీఐసీఐ ప్రు.. గోల్డ్ పథకం



ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ తాజాగా గోల్డ్ పేరిట వినూత్న, దీర్ఘకాలిక పొదుపు పథకాన్ని ఆవిష్కరించింది. ఇటు వృత్తి, ఉద్యోగాల ద్వారా వచ్చే ఆదాయానికి తోడు అదనపు రాబడి అందుకోవాలనుకునే వారికి అనువైనదిగా ఇది ఉంటుందని సంస్థ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పాల్టా తెలిపారు. ఇది జీవిత బీమా కవరేజీతో పాటు కుటుంబానికి ఆర్థిక భద్రతను కూడా అందిస్తుందని పేర్కొన్నారు. ఐసీఐసీఐ ప్రు గోల్డ్ మూడు వేరియంట్లలో లభ్యమవుతుంది. ఇమీడియట్ ఇన్‌కమ్, ఇమీడియట్ ఇన్‌కమ్ విత్ బూస్టర్, అలాగే డిఫర్డ్ ఇన్‌కమ్ వీటిలో ఉన్నాయి. మొదటి దానిలో పాలసీ జారీ చేసిన 30 రోజుల తర్వాత నుంచి ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. ఇక రెండో వేరియంట్‌లో ప్రతి ఐదో ఏటా అదనంగా గ్యారంటీడ్ ఆదాయాన్ని కూడా అందుకోవచ్చు. మూడోదైన డిఫర్డ్ ఇన్‌కమ్ వేరియంట్‌లో ఆర్థిక లక్ష్యాలకు అనుగుణంగా వినియోగదారులు ఆదాయాన్ని ఎప్పటి నుంచి పొందాలనుకుంటున్నది తామే నిర్ణయించుకోవచ్చు. అంటే పాలసీ తీసుకున్న రెండో ఏడాది నుంచే లేదా 13 ఏళ్ల తర్వాత నుంచైనా ఆదాయాన్ని అందుకోవడం ప్రారంభించవచ్చు. చెల్లింపులను సాధారణంగా తీసుకోవడానికి బదులుగా సేవింగ్స్ వాలెట్‌లో జమ చేసుకునే అవకాశం కూడా ఉంటుంది. దీన్ని కావాలంటే పూర్తిగా లేదా పాక్షికంగా విత్‌డ్రా చేసుకోవచ్చు. లేదా ప్రీమియం ఆఫ్‌సెట్ సదుపాయంతో తమ భావి ప్రీమియంలను కూడా ఈ మొత్తం నుంచి చెల్లించవచ్చు.

స్టాక్స్ వ్యూ

గ్రీన్‌ప్లై ఇండస్ట్రీస్ | ఐడీబీఐ క్యాపిటల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 139 **టార్గెట్:** రూ. 171


ఎందుకంటే: దేశీయంగా అత్యంత వృద్ధిలో ఉన్న రియల్టీ రంగంతో లబ్ధిని పొందనున్న కంపెనీలలో గ్రీన్‌ప్లై ఇండస్ట్రీస్‌ను ప్రధానంగా పేర్కొనవచ్చు. గుజరాత్‌లోని వడోదరలో మధ్యస్థాయి సాంద్రతగల ఫైబర్‌బోర్డ్(ఎండీఎఫ్) తయారీకి 2,40,000 క్యూబిక్ బోర్డ్ మీటర్(సీబీఎం) సామర్థ్యంతో ప్లాంటును ఏర్పాటు చేసింది. ఇందుకు రూ. 540 కోట్ల పెట్టుబడులు వెచ్చించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం(2023–24) ప్లాంటులో దశలవారీగా ఉత్పత్తి పుంజుకోనుంది. ఈ నేపథ్యంలో దేశీయంగా ప్లైవుడ్ తయారీ కంపెనీలలో రెండో పెద్ద సంస్థగా గ్రీన్‌ప్లై నిలుస్తోంది. ప్లాంటు సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించుకుంటే రూ. 600–650 కోట్ల ఆదాయానికి అవకాశముంది. 2025కల్లా 65 శాతం సామర్థ్యాన్ని వినియోగించుకున్నా అమ్మకాలలో పటిష్ఠ వృద్ధికి వీలుంటుంది. తాజా విస్తరణ తదుపరి రెండేళ్ల(2023–24, 2024–25)లో కంపెనీ అమ్మకాలు 18 వార్షిక వృద్ధిని సాధించగలవని అంచనా. ఈ బాటలో వార్షిక ప్రాతిపదికన నిర్వహణ లాభం(ఇబిటా) 45 శాతం, నికర లాభం 35 శాతం చొప్పున జంప్ చేయగలవని భావిస్తున్నాం. వడోదర ప్లాంటుతో విస్తరణపై కంపెనీ ప్రధాన పెట్టుబడులు పూర్తికానున్నాయి.



ఏబీ క్యాపిటల్ | ఎమ్‌కే గ్లోబల్ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 154 **టార్గెట్:** రూ. 200

ఎందుకంటే: కంపెనీకి గల వివిధ బిజినెస్‌లు, అనుబంధ సంస్థలు తదితరాల విలువలను మదింపు చేసే(ఎస్‌వోటీపీ) పద్ధతిలో ఆదిత్య బిర్లా క్యాపిటల్ కౌంటర్ ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఇందుకు ప్రధానంగా మూడు అంశాలు కంపెనీకి బలాన్నిస్తున్నాయి. వీటిలో ఎన్‌బీఎఫ్‌సీ, హెచ్‌ఎఫ్‌సీలతో కూడిన లెండింగ్ బిజినెస్‌ను తొలుత ప్రస్తావించవచ్చు. విభిన్న విభాగాలు, కొనుగోళ్ల చానల్, యూనిట్ ఎకనమిక్స్ వంటి అంశాలు లెండింగ్ బిజినెస్‌కు దన్నునిస్తున్నాయి. దీంతో వార్షికంగా లోన్‌బుక్‌లో 26 శాతం వృద్ధిని సాధించింది. తద్వారా 2024–25 వరకూ లాభాల్లో 31 శాతం పురోగతిని నిలుపుకునే అవకాశముంది. ఇక నియంత్రణ సంస్థల నుంచి ఎదురవుతున్న సవాళ్లలోనూ లైఫ్ ఇన్సూరెన్స్ బిజినెస్ నిలదొక్కుకుంటోంది. ప్రస్తుతం విభిన్న పంపిణీ చానల్‌ను నిర్మించుకుంది. పట్టణ ప్రాంతాలను దాటి వృద్ధిని విస్తరించేందుకు దృష్టిని సారించింది. వెరసి పరిశ్రమలోనే అత్యధికంగా 20 శాతం కొత్త బిజినెస్(వీఎన్‌బీ) మార్జిన్లను సాధించగలదని అంచనా. కంపెనీకిగల మరో విభాగం ఏఎంసీ బిజినెస్‌ను పోలి మార్కెట్ వాటాను నిలుపుకుంటూ నాయకత్వ స్థాయిలో కొనసాగే వీలుంది. హెల్త్ ఇన్సూరెన్స్ బిజినెస్‌లోనూ వృద్ధి దశ కొనసాగనుంది. నికర లాభాల్లో 30% వార్షిక వృద్ధికి వీలుంది.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

టీడీపీ వర్గీయుల దాష్టీకం

- దళిత రైతు మల్బరీ పంటపై పురుగు మందు పిచికారీ
- చనిపోయిన పురుగులు.. రైతుకు కోలుకోలేని నష్టం



విషపూరితమైన మల్బరీ ఆకులు తిని చనిపోయిన పట్టు పురుగులు

రామగిరి: ఉమ్మడి అనంతపురం జిల్లాలో టీడీపీ వర్గీయుల దాష్టీకాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. వైఎస్సార్‌సీపీ మద్దతు దారులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారు. తాజాగా ఓ దళిత రైతు మల్బరీ పంటపై పురుగు మందు పిచికారీ చేసి, అతనికి తీరని నష్టం కలిగించారు. పరిటాల కుటుంబం అండతోనే టీడీపీ వర్గీయులు ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు బాధిత రైతు వాపోతున్నాడు. శ్రీసత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం గరిమేకలపల్లికి చెందిన హరిజన కొల్లప్ప వైఎస్సార్‌సీపీలో చురుకైన కార్యకర్త. కొల్లప్పకు ఇటీవల పార్టీ సచివాలయ కన్వీనర్ బాధ్యతలు కూడా అప్పగించారు. కొల్లప్ప స్థానికంగా వైఎస్సార్‌సీపీని మరింతగా పటిష్ట పరచడంలో కీలకంగా వ్యవహరిస్తున్నాడు. దీన్ని జీర్ణించుకోలేని టీడీపీ కార్యకర్తలు రెండెకరాల్లో అతను సాగు చేస్తున్న మల్బరీ పంటపై శనివారం పురుగు మందు పిచికారీ చేశారు. మూడు రోజుల్లో పట్టు గూళ్ల ఉత్పత్తి మొదలవుతుందనగా ఈ దాష్టీకానికి పాల్పడ్డారు. ఆదివారం ఉదయం పట్టు పురుగులు చనిపోయి ఉండడంతో కొల్లప్ప తోటను పరిశీలించగా అసలు విషయం వెలుగు చూసింది. నియోజకవర్గంలో నారా లోకేశ్ పాదయాత్ర జరిగిన సమయంలోనే టీడీపీ కార్యకర్తలు ఈ దుశ్చర్యకు పాల్పడటం గమనార్హం. రామగిరి ఎస్‌ఐ జనార్దన్ నాయుడు ఆదివారం బాధిత రైతు మల్బరీ తోటను పరిశీలించారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎగిసిన ఎగుమతులు

- రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో భారీ వృద్ధి

సాక్షి, అమరావతి: వివిధ దేశాల్లో ఉన్న మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకుంటూ.. ఎగుమతులను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. వైఎస్ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఏటేటా ఎగుమతుల్లో భారీ వృద్ధి నమోదవుతోంది. ఈ విషయం రాష్ట్ర సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడైంది. చంద్రబాబు హయాంలో 2018–19 ఆర్థిక సంవత్సరంలో ఏపీ ఎగుమతుల విలువ రూ.98,983.95 కోట్లుగా ఉండగా.. వైఎస్ జగన్ హయాంలో 2019–20లో రూ.1,04,829 కోట్లకు పెరిగింది. 2020–21లో రూ.1,24,744 కోట్లకు, 2021–22లో ఏకంగా రూ.1,43,843 కోట్లకు చేరిందని ఆర్థిక సర్వే వెల్లడించింది. ఉత్పత్తుల ఎగుమతుల్లో టాప్ ఐదు రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ స్థానం సంపాదించిందని పేర్కొంది. రాష్ట్రం నుంచి ప్రధానంగా సముద్ర ఉత్పత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు, డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్, సేంద్రియ, కెమికల్, పెట్రోలియం ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయని తెలిపింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల వారీగా ఉత్పత్తులను గుర్తించి.. ఆయా జిల్లాల నుంచే ఎగుమతులను ప్రోత్సహించేందుకు ప్రణాళికను రూపొందించినట్లు పేర్కొంది. జిల్లాల ఎగుమతుల హబ్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే మూడు జిల్లాలను(విశాఖ, తూర్పుగోదావరి, గుంటూరు) గుర్తించిందని సర్వే పేర్కొంది.

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు



ప్రధాన కేంద్రాల్లో ఆదివారం నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు(డిగ్రీల్లో)


కేంద్రం	గరిష్టం	కనిష్టం
అనంతపురం	41.6	22.9
రెంటచింతల	39.5	28.2
కడప	39.2	26.0
గూడూరు	38.0	27.0
కనిగిరి	38.0	24.0
తిరుపతి	37.0	24.0
విజయవాడ	36.0	26.0
చిత్తూరు	36.0	24.0
నెల్లూరు	35.7	27.0
భీమవరం	35.0	24.0
మచిలీపట్నం	34.0	27.0
రాజమహేంద్రవరం	34.0	25.0
విశాఖపట్నం	33.8	24.8
కాకినాడ	33.0	26.0
విజయనగరం	33.0	25.0
శ్రీకాకుళం	33.0	21.0
ఏలూరు	32.0	26.0
తెలంగాణలో..		
ఆదిలాబాద్	38.3	18.2
హైదరాబాద్	35.9	23.5
రామగుండం	36.8	23.4

పెరుగుతున్న బంగారం, వెండి అక్రమ రవాణా

శరీరంలో దాచి మరీ తరలింపు

- విమానాల్లో క్యాబిన్ సిబ్బంది, విమానాశ్రయ సిబ్బందికీ ప్రమేయం
- మూడేళ్లలో 84 మంది విమానాశ్రయ సిబ్బంది అరెస్టు.. 181.61 కిలోల బంగారం పట్టివేత
- మూడేళ్లలో అక్రమ రవాణా చేస్తున్న 7,632.52 కిలోల వెండి స్వాధీనం
- అత్యధికంగా విమానాశ్రయాలు, ఇతర మార్గాల్లోనే అక్రమ రవాణా
- విమానాల రాకపోకలు నిలిచిపోవడంతో కోవిడ్ సమయంలో తగ్గిన స్మగ్లింగ్


- ఇప్పుడు మళ్లీ పెరిగిన అక్రమ రవాణా
- పార్లమెంట్‌లో వెల్లడించిన కేంద్ర ఆర్థికశాఖ



సాక్షి, అమరావతి: దేశంలో బంగారం, వెండి అక్రమ రవాణా ఏటికేడాది పెరుగుతున్నాయి. కోవిడ్ సమయంలో విమానాల రాకపోకలపై ఆంక్షలతో 2020–21లో కొంతమేర వీటి అక్రమ రవాణా తగ్గినప్పటికీ తరువాత 2021–22, 2022–23 సంవత్సరాల్లో బాగా పెరిగింది. స్వాధీనం చేసుకున్న వాటిని చూస్తేనే అక్రమ రవాణా పెరిగిందంటే.. ఇక స్వాధీనం చేసుకోకుండా ఎంత అక్రమ రవాణా అయిందో ఎవరికీ తెలియదు. దేశంలో 2019–20 నుంచి 2022–23 ఫిబ్రవరి వరకు అక్రమ రవాణా చేస్తున్న 11,735.04 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు సంబంధించి 13,205 కేసులు నమోదు చేశారు. ఇదే సమయంలో 7,632.52 కిలోల వెండి స్వాధీనం చేసుకుని 49 కేసులు నమోదు చేశారు. ఈ విషయాన్ని ఇటీవల పార్లమెంట్‌లో ఆర్థికశాఖ వెల్లడించింది. అత్యధికంగా విమానాల ద్వారానే బంగారం, వెండి అక్రమ రవాణా అవుతున్నాయని, తరువాత ఇతర మార్గాలు, ఓడరేవుల ద్వారా కూడా అక్రమ రవాణా సాగుతోందని తెలిపింది. శరీరంలో దాచి మరీ బంగారం అక్రమ రవాణా చేస్తున్నారని పేర్కొంది. బంగారం, వెండి, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడానికి కస్టమ్స్ క్షేత్రస్థాయి బృందాలు నిరంతరం అప్రమత్తంగా ఉంటున్నాయని, ప్రయాణికుల ప్రొఫైలింగ్ ఆధారంగా విమానాలు, కార్గో సరుకుల లక్ష్యంగా తనిఖీలు చేస్తున్నాయని తెలిపింది. స్మగ్లర్లు ఉపయోగించే కొత్తకొత్త విధానాలు, పద్ధతులను ఎప్పటికప్పుడు కనిపెడుతూ అందుకనుగుణంగా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంది. విమాన క్యాబిన్ సిబ్బందితోపాటు విమానాశ్రయ సిబ్బంది బంగారం అక్రమ రవాణాకు పాల్పడుతున్నట్లు వెల్లడించింది. బంగారం, వెండి అక్రమ రవాణాకు పాల్పడిన క్యాబిన్ సిబ్బంది, విమానాశ్రయ సిబ్బందిని అరెస్టు చేయడంతోపాటు కేసులు నమోదు చేసినట్లు తెలిపింది. 2019–20 నుంచి 2022–23 ఫిబ్రవరి వరకు బంగారం, వెండి అక్రమ రవాణాకు పాల్పడిన క్యాబిన్, విమానాశ్రయ సిబ్బంది 84 మందిని అరెస్టు చేసి 181.61 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. బంగారం, వెండి అక్రమ రవాణాను అరికట్టడానికి నిరంతరం నిఘా ఉంచడంతో పాటు అడ్వాన్స్ ప్యాసింజర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ద్వారా రిస్క్‌బేస్డ్ ఇంటర్‌డిక్షన్ సహాయంతో ప్రయాణికుల ప్రొఫైలింగ్ వంటి కార్యాచరణకు చర్యలు తీసుకుంటామని కేంద్ర ఆర్థికశాఖ తెలిపింది.

దేశంలో గత మూడేళ్లలో స్వాధీనం చేసుకున్న బంగారం, వెండి, నమోదైన కేసుల వివరాలు

సంవత్సరం	కేసులు	స్వాధీనం చేసుకున్న బంగారం (కిలోల్లో)	కేసులు	స్వాధీనం చేసుకున్న వెండి (కిలోల్లో)
విమానాశ్రయాల్లో..				
2019-20	4,444	2,629.55	4	548.24
2020-21	1,830	1,000.50	2	237.90
2021-22	1,939	1,239.87	3	1.14
2022-23 (ఫిబ్రవరి వరకు)	3,614	2,531.97	2	66.15
ఓడరేవుల్లో..				
2019-20	3	38.98	-	-
2020-21	-	-	-	-
2021-22	2	14.82	-	-
2022-23 (ఫిబ్రవరి వరకు)	-	-	-	-
ఇతర మార్గాలు, ప్రదేశాల్లో..				
2019-20	337	958.32	4	727.97
2020-21	204	943.89	2	476.61
2021-22	295	917.42	17	5,193.30
2022-23 (ఫిబ్రవరి వరకు)	537	1,459.72	15	381.21



టీడీపీ సర్పంచ్ చేతిలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ సజీవ దహనం

చంద్రగిరి (తిరుపతి జిల్లా): టీడీపీ అధినేత చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులో టీడీపీ నేతలు మరోసారి బరితెగించారు. ఇటీవల కుప్పం, పుంగనూరు తదితర ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ నేతలు, పోలీసులపై టీడీపీ మూకల దాడులను మరిచిపోకముందే మరోసారి ఘాతుకానికి తెగబడ్డారు. అన్నెంపున్నెం ఎరుగని ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌పై పెట్రోల్ పోసి అతడి కారుతో సహా సజీవ దహనం చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులు చాణక్య ప్రతాప్, రుపంజయ తిరుపతి టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ సొంత అల్లుడు సంజీవ్‌కు స్వయానా బాబాయి కుమారులే కావడం గమనార్హం. అంతేకాకుండా టీడీపీ సీనియర్ నేతలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, పరిటాల శ్రీరామ్‌లతోనూ నిందితులకు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన టీడీపీ అభ్యర్థి శ్రీకాంత్ చౌదరితోనూ పరిచయాలు ఉన్నాయి. రాజీ పేరుతో ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ను పిలిపించి అతడిని టీడీపీ అధినేత చంద్రబాబు అనుచరుడు చాణక్య ప్రతాప్ సజీవ దహనం చేసిన ఘటన శనివారం అర్ధరాత్రి కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం బ్రాహ్మణపల్లికి చెందిన జయరామయ్య, చెంచెమ్మ దంపతులకు నాగరాజు, పురుషోత్తం కుమారులు. వీరిద్దరూ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నారు. ఈ క్రమంలో బ్రాహ్మణపల్లి టీడీపీ సర్పంచ్ చాణక్య ప్రతాప్ తమ్ముడు రుపంజయ భార్యతో పురుషోత్తం వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రుపంజయ ఎలాగైనా పురుషోత్తంను మట్టుపెట్టాలని నిర్ణయించాడు. ఈ విషయం తెలుసుకున్న నాగరాజు తన తమ్ముడు పురుషోత్తంను బెంగళూరుకు పంపించేశాడు.

హతమార్చడానికి పలుమార్లు ప్రయత్నం

టీడీపీ సర్పంచ్ చాణక్య ప్రతాప్, అతడి తమ్ముడు రుపంజయ.. నాగరాజు కుటుంబంపై కక్ష సాధింపులకు పాల్పడ్డారు. నాగరాజు తన పొలం వద్ద ఏర్పాటు చేసిన పైపులను పగలకొట్టడం, చెట్లు నరికివేయడం, మోటార్లను కాల్చివేయడం వంటివి చేసి టీడీపీ నేతలు తీవ్ర ఇబ్బందులకు గురిచేశారు. నాగరాజు తమ్ముడు పురుషోత్తంను హతమార్చాలని పలుమార్లు ప్రయత్నించి విఫలమయ్యారు. ఈ క్రమంలో వివాదాన్ని పరిష్కరించుకుందామని తిరుపతి అవిలాలలో నివాసం ఉంటూ వర్క్‌ఫ్రమ్ హోం చేసుకుంటున్న నాగరాజును గోపి అనే వ్యక్తితో పిలిపించారు. దీంతో శనివారం సాయంత్రం నాగరాజు తన కారులో స్వగ్రామం బ్రాహ్మణపల్లి వెళ్లాడు. అక్కడ టీడీపీ సర్పంచ్ చాణక్య ప్రతాప్, రుపంజయ, వారి అనుచరులు గోపి, సుబ్బయ్యతోపాటు మరికొంతమంది నాగరాజుతో మాట్లాడారు. ఆ తర్వాత శనివారం రాత్రి 11.30 గంటల సమయంలో గంగుడుపల్లి సమీపంలోని కురవకణం మలుపు వద్దకు తీసుకెళ్లి నాగరాజు కారులోనే అతడిని పెట్రోల్ పోసి సజీవదహనం చేశారు. ఈ ఉదంతం తెలుసుకున్న ఏఎస్పీ వెంకటరావు, వెస్ట్ డీఎస్పీ నరసప్ప, సీఐ ఓబులేసు ఆదివారం ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి భార్య మధుమతి ఫిర్యాదు మేరకు చాణక్య ప్రతాప్, రుపంజయ, గోపి, సుబ్రహ్మణ్యంతో పాటు మరికొంత మందిపై కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నారని త్వరలో పట్టుకుంటామని తెలిపారు. అయితే ప్రధాన నిందితుడు రుపంజయను పోలీసులు అదుపులోకి తీసుకుని, రహస్య ప్రదేశంలో విచారిస్తున్నట్లు సమాచారం.



టీడీపీ ఎమ్మెల్సీ శ్రీకాంత్ చౌదరితో నిందితుడు చాణక్య ప్రతాప్



పరిటాల సునీతతో చాణక్య ప్రతాప్ సోదరుడు రుపంజయ



భార్య మధుమతి, పిల్లలతో మృతుడు నాగరాజు

ఇద్దరు టీడీపీ నేతల హస్తం!

కాగా నాగరాజు హత్యలో రామచంద్రాపురం మండలానికి చెందిన ఇద్దరు టీడీపీ నేతల హస్తం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. అందులో ఒకరు మాజీ మంత్రి, టీడీపీ నేత గల్లా అరుణకుమారికి అత్యంత సన్నిహితుడిగా చెబుతున్నారు. హత్యకు పాల్పడిన చాణక్య ప్రతాప్ టీడీపీకి చెందిన వ్యక్తి కావడంతో ఆ ఇద్దరు నేతలు హత్యకు సంపూర్ణ సహకారం అందించినట్లు సమాచారం.

నేటి నుంచి టెన్త్ పరీక్షలు

▶ మొదటి పేజీ తరువాయి

రోజు విడిచి రోజు ఆరు పేపర్లలో పరీక్షలు నిర్వహిస్తున్నారు.

- ▲ తెలుగు, హిందీ, ఇంగ్లిష్, మేథ్స్, సోషల్ స్టడీస్ పరీక్షలకు 24 పేజీల బుక్‌లెట్, ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్, సంస్కృతం, వృత్తి విద్యా కోర్సులకు 12 పేజీల బుక్‌లెట్లను అందిస్తారు. సైన్స్‌కు ఒకే ప్రశ్నపత్రం, రెండు ఆన్సర్ షీట్లు ఉంటాయి. ఆయా ప్రశ్నలకు నిర్దేశిత బుక్‌లెట్‌లోనే సమాధానాలు రాయాలి.
- ▲ పేపర్ లీక్ అనేది లేకుండా పక్కాగా నిఘా ఏర్పాట్లు చేశారు. ఎక్కడైనా, ఏదైనా అవాంఛనీయ ఘటన, లీక్ జరిగితే అది ఎక్కడ జరిగిందో వెంటనే కనిపెట్టేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు.
- ▲ అన్ని పరీక్ష కేంద్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులే ఇన్విజిలేటర్లుగా వ్యవహరిస్తారు. పరీక్షల నిర్వహణకు 43 వేల సిబ్బందిని నియమించారు. రెవెన్యూ, పోలీసు, వైద్య ఆరోగ్య శాఖ, ఆర్టీసీ తదితర విభాగాల సహకారం తీసుకుంటున్నారు. సమస్యాత్మకంగా గుర్తించిన 104 పరీక్ష కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అన్ని పరీక్ష కేంద్రాలనూ నో ఫోన్ జోన్లుగా ప్రకటించారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు సహా ఏ ఒక్కరూ మొబైల్ ఫోన్లు, ఇతర ఎల్రక్టానిక్ పరికరాలను పరీక్ష కేంద్రాల్లోకి తీసుకెళ్లరాదు.
- ▲ విద్యార్థులు కూడా వాచీలు, ఫోన్లు ఇతర డిజిటల్ వస్తువులను తీసుకెళ్లకూడదు. పెన్ను, పెన్సిల్, ఎరేజర్ స్కేలు వంటివి తీసుకెళ్లవచ్చు. విద్యార్థులకు ఇచ్చిన ఓఎమ్మార్ షీట్లో వివరాలు తనవో కాదో సరిచూసుకున్న తర్వాతే సమాధానాలు రాయాలి. ఏదైనా తేడా ఉంటే ఇన్విజిలేటర్‌కు చెప్పి సరైనది పొందాలి. ఓఎమ్మార్ షీట్‌ను సమాధానాల బుక్‌లెట్‌కు పిన్ చేయాలి.
- ▲ ఈ నెల 19 నుంచి 26వ తేదీ వరకు సమాధాన పత్రాల మూల్యాంకనం జరుగుతుంది.



అలా చూస్తున్నారు.. ఇలా కొంటున్నారు

వీడియోలు చూసి వస్తువులు కొనేస్తున్న భారతీయ యువత

- కొనుగోలు నిర్ణయాలను ప్రభావితం చేస్తున్న రీల్స్, సోషల్ మీడియా
- దాదాపు 60 శాతం యువతది ఇదే తీరు
- షార్ట్ వీడియో యాప్ సంస్థ 'ఎమోజీ' సర్వేలో వెల్లడి

సాక్షి, అమరావతి

భారతీయ యువతలో కొనుగోలు ట్రెండ్ మారుతోంది. సరదా షాపింగ్ విధానం పెరిగిపోతోంది. ఇదేదో దుకాణాలకు వెళ్లి కాదండోయ్.. ఆన్‌లైన్‌లోనే.. అదీ ఇంట్లోనే.. మరీ చెప్పాలంటే వీడియో రీల్స్ (షార్ట్ వీడియో) చూస్తూ వస్తువుల కొనుగోలును ఎంజాయ్ చేస్తున్నారు. దాదాపు దేశంలో 60 శాతం మంది యువత కొనుగోళ్లను చిన్న వీడియోల్లోని కంటెంట్ ప్రభావితం చేస్తోంది. ప్రముఖ షార్ట్ వీడియోస్ యాప్ సంస్థ ఎమోజీ 'గెటింగ్ యంగ్ ఇండియా రైట్' పేరుతో ఒక నివేదికను విడుదల చేసింది. ఇందులో 18–34 ఏళ్ల మధ్య యువతను ఆన్‌లైన్‌లో సర్వే చేసింది. దీని ప్రకారం దేశంలో ఏకంగా 77 శాతం యువత ఎక్కువ సమయం షార్ట్ వీడియోలు చూస్తున్నట్టు పేర్కొంది. మరో 16 శాతం మంది వార్తలు, ఇతర వినోద కార్యక్రమాలు, 7 శాతం మంది టీవీ, ఓటీటీ ఆధారిత కంటెంట్‌లో మునిగిపోతున్నట్టు గుర్తించింది.

అత్యధిక ఖర్చు ఆ రెండింటిపైనే..

దేశంలోని 77 శాతం యువత మొబైల్ ఫోన్లు, దుస్తులపై అత్యధికంగా ఖర్చు చేస్తున్నట్టు సర్వే చెబుతోంది. వీటి కొనుగోలు కోసం 65 శాతం మంది తమ వ్యక్తిగత నిధులను వినియోగిస్తుంటే.. 26 శాతం మంది స్నేహితులు, కుటుంబ సభ్యులపై ఆధారపడుతున్నారు. మరో 7 శాతం మంది బయట అప్పులు చేస్తున్నట్టు సర్వే వెల్లడిస్తోంది.

ఆఫర్లు.. డిస్కౌంట్లదే పైచేయి

కాగా, చిన్న వీడియోలు, సోషల్ మీడియా కంటెంట్ దేశంలోని యువత కొనుగోలు నిర్ణయాలను ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ ద్వారా ప్రభావితం చేస్తున్నాయని నివేదిక స్పష్టం చేస్తోంది. ఆఫర్లు, డిస్కౌంట్లు సగానికి పైగా యువత కొనుగోలు ఆలోచనలను ప్రభావితం చేసే అంశాల్లో ప్రధానంగా ఉన్నట్టు వివరించింది. ఉచిత రవాణా, వేగంగా సరుకు అందించడం కూడా కొనుగోళ్లను పెంచుతోంది.

సమ్మేటివ్ 2 పరీక్షల సమయంలో మార్పు

- ఒంటిపూట బడుల కారణంగా మార్పులు చేసిన ఎస్సీఈఆర్టీ
- ఏప్రిల్ 20 నుంచి 29 వరకు నిర్వహణ
- 1 – 9 వరకు అన్ని తరగతులకు ఉదయమే పరీక్షలు
- 1 నుంచి 8 తరగతి వరకు ఉదయం 9 నుంచి 12 వరకు
- 9వ తరగతికి ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 వరకు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏప్రిల్ 20వ తేదీ నుంచి 29వ తేదీ వరకు జరిగే సమ్మేటివ్ అసెస్‌మెంట్ – 2, క్లాస్ రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ – 3 పరీక్షల సమయాల్లో మార్పులు చేస్తూ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) సర్క్యులర్ జారీచేసింది. ఈ నెల 3 నుంచి ఒంటిపూట బడులు నిర్వహిస్తుండటంతో ఈ మార్పులు చేశారు. గతంలో సమ్మేటివ్ అసెస్‌మెంట్ – 2, క్లాస్‌రూమ్ బేస్డ్ అసెస్‌మెంట్ – 3 పరీక్షలను ఎలిమెంటరీ స్కూళ్లకు ఉదయం, హైస్కూళ్ల విద్యార్థులకు మధ్యాహ్నం పరీక్షల షెడ్యూల్‌ను ఇచ్చారు. ఒంటిపూట బడులు ప్రారంభం కానుండటంతో అన్ని పాఠశాలలూ ఉదయం 7.45 నుంచి 12.30 వరకే జరుగనున్నాయి. దీంతో పరీక్షల సమయాల్లో మార్పులు చేసినట్లు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 1 నుంచి 9వ తరగతి వరకు ఈ పరీక్షలు ఉదయం పూట మాత్రమే జరుగుతాయి. 1 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ఉదయం 9 నుంచి 12 గంటల వరకు జరుగుతాయి. 9 వ తరగతి విద్యార్థులకు మాత్రం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు పరీక్షలుంటాయి.

షెడ్యూల్ ఇలా



తేదీ	1 నుంచి 5 తరగతులు	6 నుంచి 9 తరగతులు
ఏప్రిల్ 20	ఫస్ట్ లాంగ్వేజ్	ఫస్ట్ లాంగ్వేజ్
ఏప్రిల్ 24	ఇంగ్లిష్	సెకండ్ లాంగ్వేజ్
ఏప్రిల్ 25	మేథ్స్	ఇంగ్లిష్
ఏప్రిల్ 26	ఈవీఎస్ (3, 4, 5)	మేథ్స్
ఏప్రిల్ 27	ఓఎస్సెస్సీ	జనరల్ సైన్సు
ఏప్రిల్ 28	--	సోషల్ స్టడీస్
ఏప్రిల్ 29	--	కాంపోజిట్ కోర్సు 1, 2

'చల్లని' కబురు!

ఈ ఏడాది వేసవి సాధారణమే

సాక్షి, విశాఖపట్నం: ఉష్ణతాపం నుంచి ఉపశమనం కలిగించే వార్తను భారత వాతావరణ శాఖ (ఐఎండీ) మోసుకొచ్చింది. రాష్ట్రంలో ఈ వేసవిలో దడపుట్టించే ఎండలు, వడగాడ్పులకు అంతగా ఆస్కారం ఉండదని తెలిపింది. గరిష్ట (పగటి) ఉష్ణోగ్రతలు సాధారణం గానీ అంతకంటే తక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తాజా నివేదికలో వెల్లడించింది. ఏప్రిల్ నుంచి జూన్ వరకు కొనసాగే ఎండాకాలం సీజనులో దేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే ఆంధ్రప్రదేశ్ సహా దక్షిణాది రాష్ట్రాల్లో వేసవి తాపం అంతగా ఉండదని పేర్కొంది. ఐఎండీ అంచనాల ప్రకారం ఉత్తర కోస్తాంధ్ర కంటే రాయలసీమలో తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కానున్నాయి. అందువల్ల సీమ జిల్లాల్లో వేసవితాపం అధికంగా ఉండే అవకాశం లేదు. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలతోపాటు ఉత్తర కోస్తాంధ్రలో ఉష్ణోగ్రతలు సాధారణం కంటే స్వల్పంగా పెరగనున్నాయి. ఈ వేసవిలో దక్షిణ, ఉత్తర కోస్తాంధ్రల్లో 4-6 రోజులు, రాయలసీమలో 2-4 రోజులు మాత్రమే వడగాడ్పులు వీచేందుకు అవకాశాలున్నాయి. సాధారణంగా రాష్ట్రంలో వేసవి సీజనులో ఏటా ఏడెనిమిది రోజుల పాటు వడగాడ్పులు/తీవ్ర వడగాడ్పులు వీస్తుంటాయి. ఈసారి వడగాడ్పులు వీచే రోజులు తగ్గనుండటం ఉపశమనం కలిగించనుంది. ఈ వేసవిలో కనిష్ట (రాత్రి) ఉష్ణోగ్రతలు సాధారణం కంటే తక్కువగానే నమోదు కానున్నట్లు ఐఎండీ అంచనా వేసింది. దీని వల్ల రాత్రి వేళ వాతావరణం ఊరట కలిగించనుంది.

ఏప్రిల్‌లో ఇలా..

ఏప్రిల్‌లో రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు ఒకింత ఎక్కువగా నమోదయ్యే అవకాశాలున్నాయి. ఈ నెలలో బిహార్, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్‌లో వడగాడ్పులకు ఆస్కారం ఉంది. దీని ప్రభావం ఒడిశాకు ఆనుకుని ఉన్న ఉత్తరాంధ్రపై పడనుంది. ఫలితంగా ఈనెల రెండో వారం తర్వాత శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో 2–4 రోజుల పాటు వడగాడ్పులు వీచే అవకాశాలున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం డైరెక్టర్ ఎస్.స్టెల్లా 'సాక్షి'కి వెల్లడించారు.

సాధారణానికి మించి వర్షపాతం..

రాష్ట్రంలో ఏప్రిల్‌లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. రాయలసీమలో ఎక్కువగా, కోస్తాంధ్రలో సాధారణంకంటే తక్కువ వర్షపాతం రికార్డవుతుందని ఐఎండీ అంచనా వేసింది.

ఫిబ్రవరిలోనే బెంబేలెత్తించి..

ఈ ఏడాది రాష్ట్రంలో ఫిబ్రవరిలోనే 39 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదవడంతో వేసవి తీవ్రతపై అందరిలోనూ ఆందోళన నెలకొంది. అందుకు భిన్నంగా మార్చి నెల కొనసాగింది. మార్చిలో ఏడుసార్లు పశ్చిమ అసమతుల్యతలు (వెస్టర్న్ డిస్టర్బెన్స్‌లు), ఉపరితల ద్రోణి, ఆవర్తనాలు లాంటివి ఏర్పడడంతో కొన్నిచోట్ల సాధారణ, పలుచోట్ల సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అవి ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. వీటి ఫలితంగా మార్చి రెండో వారం నుంచి నెలాఖరు వరకు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు, అక్కడక్కడ భారీ వర్షాలు కురిశాయి. దీంతో గత నెలలో ఉష్ణతాపం అంతగా అనిపించలేదు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0863-2512581 Fax: No. 0863-2512584. RNI Reg No. APTEL/2008/23794.